



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI






శనివారం | 28-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 253 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: విదియ ఉ. 11.11 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 6.44 తదుపరి శ్రవణం; వర్జ్యం: రా. 11.01-12.44; దుర్ముహూర్తం: ఉ. 6.48-8.16; అమృతఘడియలు: మ. 12.00-1.41; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.48; సూర్యాస్తమయం: 5.46 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai


● 'ఇన్‌సైడ్' మ్యాటర్..



అమరావతిలో 'ఇన్‌సైడర్' ట్రేడింగ్‌పై ఉప సంఘం నివేదికను సీఎం జగన్‌కు అందజేస్తున్న సంఘ సభ్యులు

● అడుగుకో పోలీస్.. అప్రకటిత కర్ఫ్యూ



మందడంలో పోలీసు ఆంక్షలతో దుకాణాలు బంద్.. అంతా నిర్మానుష్యం

● అమరావతికే మా సమ్మతి..



అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రాంతంలో బీజేపీ చీఫ్ కన్నా మౌన దీక్ష

# విశాఖ వీచికే!

## అమరావతి కథ కంచికే | సీఎం జగన్ విస్పష్ట నిర్ణయం

### కేబినెట్ భేటీలో అదే మాట.. వ్యూహం అమలుకు ఒక 'పద్ధతి'

- జీఎన్‌రావు, బీసీజీ వైఖరి విస్పష్టం
- హైపవర్ కమిటీ ఇక లాంఛనమే
- అసెంబ్లీలో చర్చతో 'ఆమోదం'
- కేబినెట్‌లో జగన్ సుదీర్ఘ ప్రసంగం





**10 వేల కోట్లతో విశాఖ మహానగరం**

అమరావతికైతే 1.10 లక్షల కోట్లు కావాలి

3న బీసీజీ నివేదిక సమర్పణ

15 రోజుల్లో హైపవర్ రిపోర్ట్

20వ తేదీన అసెంబ్లీ ఉమ్మడి భేటీ

కేబినెట్‌లో సీఎం వెల్లడి!

## రైతుల భూములు వెనక్కి



అభివృద్ధి చేసిన భూములు మినహా మిగిలినవన్నీ తిరిగి అప్పగించేద్దాం

రాజధాని ఎందుకు మారుస్తున్నామో వివరిద్దాం.. మంత్రివర్గ భేటీలో సీఎం

చంద్రబాబు తరహాలో ఏటా రూ.5,000 కోట్లు ఖర్చు చేస్తే.. దశాబ్దాలు గడచినా అభివృద్ధి చేయలేం. ప్రతి ఐదేళ్లకోసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. కట్టిన భవనాలన్నీ కుంగిపోతుంటాయి.

'విశాఖలో సచివాలయం, అసెంబ్లీ భవనాలు నిర్మించి.. మెట్రో రైలును ఏర్పాటు చేస్తే హైదరాబాద్, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో పోటీ పడేవాళ్లం.'

ఇప్పటికే రాజధాని అభివృద్ధి కోసం వినియోగించుకున్న భూములకు బదులు వేరే చోట భూములిద్దాం. కౌలు చెల్లింపుల భారం తగ్గించుకోవాలంటే.. భూములు వెనక్కి ఇచ్చేయాల్సిందే.'

- కేబినెట్ భేటీలో సీఎం జగన్!

**నిర్ణయం** మాత్రమే వాయిదా పడింది! రాజధాని మార్పు దాదాపుగా ఖాయమైంది! జీఎన్ రావు కమిటీ సిఫారసులు, బీసీజీ నివేదిక... వీటిపై హైపవర్ కమిటీ ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామనడం ఒక వ్యూహమే అని తెలుస్తోంది. ఎందుకంటే... జీఎన్‌రావు కమిటీకి, ప్రభుత్వ ఆలోచనలకు భిన్నంగా బీసీజీ నివేదిక వెలువడే అవకాశం లేదు. 'అమరావతి గ్రీన్ సిటీ సాధ్యం కాదు' అనేలా బీసీజీ ఇప్పటికే తన మధ్యంతర నివేదికను ఇచ్చేసింది. హైపవర్ కమిటీ కూడా ఇదే చెప్పడం ఖాయమని... ఆ తర్వాత అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి... రాజధాని తరలింపుపై 'తీర్మానం' చేయడమే మిగులుతుందని తెలుస్తోంది. వెరసి... 'మాది తొందరపాటు నిర్ణయం కాదు. అందరూ వద్దన్నాకే, అమరావతిని కొనసాగించడం సాధ్యం కాకే పరిపాలనను విశాఖకు తరలిస్తున్నాం' అని చెప్పడమే రాష్ట్ర ప్రభుత్వం వ్యూహం! శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం జగన్ ఈ దిశగా తన ఆలోచనలను స్పష్టంగా పంచుకున్నట్లు సమాచారం! ఆయన మాటల్లో పూర్తిగా 'విశాఖ వీచికలే' కనిపించాయి.

**అమరావతిపై హైపవర్ కమిటీ!**

కేబినెట్ భేటీ అనంతరం పేర్ని నాని ప్రకటన

### జరిగేది ఇదేనా!?

- **జనవరి 3:** ఇప్పటికే జీఎన్ రావు నేతృత్వంలోని కమిటీ ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించింది. బోస్టన్ కన్సల్టెన్సీ జనవరి 3న నివేదిక ఇవ్వనుంది.
- **జనవరి 18:** మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారులతో హైపవర్ కమిటీ 15 రోజుల్లో రెండు నివేదికలపై అధ్యయనం చేస్తుంది. అంటే జనవరి 18 నాటికి తన నివేదిక సమర్పిస్తుంది.
- **జనవరి 19:** కేబినెట్ సమావేశంలో చర్చించి హైపవర్ కమిటీ నివేదికను ఆమోదిస్తారు.
- **జనవరి 20:** అసెంబ్లీ ఉమ్మడి సమావేశం ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ జరుగుతుంది. రాజధాని నగరం తరలింపు నిర్ణయాన్ని ఆమోదిస్తారు.

10, 11



కేబినెట్ సమావేశమయింది. రాజధానిపై జీఎన్‌రావు కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించింది. 'మూడు ముక్కలు' చేయాలా లేక యథాస్థానంలోనే రాజధానిని కొనసాగించాలా అనేది నిర్ణయించకుండానే సమావేశం ముగిసింది. అయితే, ఈ సమావేశంలోనే కీలక నిర్ణయమేదో ప్రభుత్వం తీసుకోనున్నదన్న అంచనాలు.. రాజధాని గ్రామాల్లోనూ, రాష్ట్రమంతటా ఇప్పటికే నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను అమాంతం పెంచేశాయి.

# వెనక్కి తగ్గం

### రాజధానులపై తేలకపోయినా 'కొనసాగించే'దాకా తాడోపేడో

### రాజధాని గ్రామాల సంకల్పం

### జేఏసీ పోరాట షెడ్యూల్ సిద్ధం

- కేబినెట్ భేటీ.. ఆ తరువాత కూడా వేల మంది రైతులు రోడ్లపైనే
- టైర్లు తగలబెట్టి ట్రాఫిక్ స్తంభన
- సచివాలయం దారుల్లో కంచెలు
- సిబ్బందికీ తప్పని చెకింగ్ ఇక్కట్లు
- మంత్రివర్గం జరిగే బ్లాక్‌వద్ద హడావుడి
- ఆంక్షలపై రగిలిన మందడం గ్రామస్థులు
- పోలీసులను తోసివేసి రహదారిపై ధర్నా
- జేఏసీ పిలుపుతో రగిలిన విజయవాడ
- ధర్నా చేస్తున్న దేవినేని, బోడె అరెస్టు
- 'తెలుగు విద్యార్థి'చే బొత్స ఇల్లు ముట్టడి
- 101 ఏళ్ల వయసులో చక్రాల కుర్చీలో నిరసన తెలిపిన యడ్లపాటి వెంకట్రావు
- రెండో రోజూ హైకోర్టు విధుల బహిష్కరణ
- విశాఖను ఒప్పుకోం.. సీమలోనే రాజధాని
- కర్నూలులో విద్యార్థుల మానవ హారం

● కన్నీటి సుడి



తరలింపు వద్దంటూ రాజధాని మహిళ కన్నీరు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలన్నదే డిమాండ్! ఎక్కడికక్కడ నిరసనలు, రాస్తారోకోలు, మహాధర్నాలు, మౌనదీక్షలు, సంఘీభావ కవాతులతో దాదాపు అన్ని జిల్లాలు హోరెత్తిపోయాయి. ఆంక్షలు, సంకెళ్లు ఏవీ 'రాజధాని' సంకల్పాన్ని అణచలేకపోయాయి. మహాధర్నా శిబిరాలు కొనసాగుతున్న మందడం, వెలగపూడి, తుళ్లూరుల్లో 'రాజీ లేదు.. అమరావతే' అంటూ రైతులు కదం తొక్కారు. పోలీసుల తనిఖీలు దాటుకొని ధర్నా శిబిరాలకు చేరుకొన్నారు. కేబినెట్ నిర్ణయం ఎలా ఉన్నా.. రాజధానుల

మిగతా 11వ పేజీలో...

## మీరే న్యాయం చేయాలి

- నాడు అందరి మద్దతుందనే భూములిచ్చాం
- రాజధాని తరలిస్తే మా బతుకులు దుర్భరం
- కూలీలు, ఇతరుల పరిస్థితీ అగమ్యగోచరం
- రాష్ట్రపతికి అమరావతి రైతుల అభ్యర్థన

న్యాయ పోరాటం చేస్తాం: సుజనా



**జగన్‌ది పిచ్చి తుగ్లక్ నిర్ణయం**

శేఖర్ గుప్తా ఫైర్

# అమరావతి నిర్మాణానికి..

# పైసా భారం పడదు

## ఎదురు ఆదాయం తెచ్చే నమూనా: బాబు



### ప్రభుత్వం చేతిలో పది వేల ఎకరాలు.. కొద్ది కొద్దిగా అమ్మితే ఖర్చంతా తిరిగొస్తుంది

- కొత్తచోట సచివాలయం, హైకోర్టు, శాసనసభ నిర్మాణం అక్కర్లేదా?
- నిర్మాణానికి డబ్బులొద్దా?.. ఆలోచన అర్థం కాక పనికిమాలిన వాదన
- సీఎం అనుకుంటే మారిపోతాయా?.. రైతులతో చట్టపర ఒప్పందాలు
- వారి హక్కులను కాలరాయలేరు.. జగన్ మాటే జీఎన్ కమిటీ రాసింది
- కలల రాజధాని కోరుకోకూడదా?.. 'ఇన్‌సైడర్'పై ఏ విచారణకైనా రెడీ
- విశాఖ దందాలపై సీబీఐకి సిద్ధమా?.. ప్రభుత్వ చేష్టలతో దేశానికే దెబ్బ
- రైతులు, సంఘాలు ఢిల్లీ వెళ్లి ప్రధానిని, హోం మంత్రిని కలవాలి: బాబు

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'లక్ష కోట్లు ఖర్చవుతుంది కాబట్టి అమరావతిలో రాజధాని నిర్మించలేకపోతున్నామంటూ ప్రభుత్వ పెద్దలు చెప్పేది ఒట్టి బుకాయింపు. నేను సవాల్ చేసి చెబుతున్నాను. రాజధాని నిర్మాణం వల్ల ప్రభుత్వంపై పైసా కూడా భారం పడదు' అని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు

మిగతా 10వ పేజీలో...






## రాజధాని అమ్మకానికి కుట్ర

- ఓట్లేసిన వారిని నిలువునా ముంచారు
- పరిపాలన వికేంద్రీకరణకు మద్దతివ్వం: కన్నా
- రైతులకు మద్దతుగా మౌనదీక్ష 11

### కేంద్రానికీ అమరావతే!

ప్రధానే వచ్చి శంకుస్థాపన చేశారు 9

రాజధానిగా కొనసాగించాల్సిందే: అధిష్ఠానం!



'ప్రపంచ తెలుగు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వరప్రసాదరెడ్డి

# 'తెలుగు' వెలుగులు

### ఘనంగా ప్రపంచ తెలుగు రచయితల నాలుగో మహాసభలు ప్రారంభం

### 1,600మంది ప్రతినిధులు హాజరు

విజయవాడ/కల్చరల్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగు వెలుగులు విరజిమ్మాయి. ప్రపంచ తెలుగు రచయితల నాలుగో మహాసభలు విజయవాడలో శుక్రవారం కనుల పండువగా ప్రారంభమయ్యాయి. పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆడిటోరియంలో మూడు రోజులపాటు జరిగే ఈ సభలను కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు

మిగతా 12వ పేజీలో...

# స్కూలు ఫీజులు తగ్గాల్సిందే



- నియోజకవర్గం యూనిట్‌గా డేగకన్ను
- తల్లిదండ్రుల ఫిర్యాదులకు 'టోల్ ఫ్రీ'
- విద్యాహక్కు చట్టం సంపూర్ణ అమలు
- ఉపాధ్యాయులు ఇక బోధనకే పరిమితం
- మిగిలిన పనుల బాధ్యత వలంటీర్లదే
- త్వరలో రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- సమీక్షలో సీఎం జగన్ స్పష్టీకరణ

2

## ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ సిబ్బంది

బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర

## 2011 జనాభా ప్రకారమే 'స్థానిక' కోటా!

ప్రభుత్వ ఆధ్వర్యంలోనే బందరు పోర్టు.. కేబినెట్ నిర్ణయం

12

## 'స్థానికం' ఇప్పట్లో లేనట్టే!

సుప్రీం తీర్పుకి వ్యతిరేకంగా కేబినెట్ నిర్ణయం.. కోర్టుకెళ్తే 'స్టే' వచ్చే చాన్స్



పరంజ్యోతి

# మహాత్ములమవ్వకున్నా.. మంచివారిమవ్వొచ్చు



**ఆ**ధ్యాత్మిక పురోగతికి ఉన్న మార్గాల్లో త్రికరణశుద్ధి అత్యంత శ్రేష్ఠమైనది. 'త్రి' అంటే మూడు, 'కరణాలు' అంటే పరికరాలు. అవే.. మనసు, నాలుక, చేతులు. ఒకేపనిపై ఈ మూడూ దృష్టి కేంద్రీకరించడమే త్రికరణ శుద్ధి. మనసులో మెదిలే ఆలోచనలనే, నోటితో చెప్పడం.. అలా చెప్పిన మాటలనే కార్యరూపంలో ఉంచటం. త్రికరణ శుద్ధిని సాధించగలిగిన వారిని మహాత్ములు అంటారు. అదే.. ఈ మూడు ఆలోచనలు భిన్నంగా.. అంటే.. ఆలోచనలు, మాటలు, చేతలకు సంబంధం లేనివారిని దురాత్ములు అంటారు.

*మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్!*
*మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనామ్!!*

అనేది శాస్త్ర వచనం. ఇది ఉన్నతమైన ఆలోచన మాత్రమేనా? ఆచరణలో ఉంచినవారు కలికాలంలో ఎవరైనా ఉన్నారా? అనే సందేహం కలగవచ్చు. ఇలాంటి శుద్ధిని సాధించినవారున్నారనడానికి మన జాతిపిత మహాత్మాగాంధీ నిలువెత్తు నిదర్శనం. చిన్ననాటే ఒకానొక సంఘటన కారణంగా తన మాతృమూర్తికి ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకొన్నారు. అవరోధాలను అధిగమించి.. జాతీయోద్యమానికి నాయకుడయ్యారు. ఆసేతు హిమాచలం జనసామాన్యమంతా ఆయనకు నీరాజనాలందించి, ఆయన మాటను వేదవాక్కుగా భావించారు. అందుకు కారణం.. ఆయన త్రికరణ శుద్ధిని సాధించడమే. మనమంతా అలా మహాత్ములం కాగలమా? కాలేనప్పుడు ఆ దిశలో ప్రయత్నం వృథానే కదా? అనిపించవచ్చు. కానీ.. లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని, నిత్యజీవన విధానాన్ని సరిదిద్దుకుంటూ వెళ్తే మార్పు వస్తుంది. మనకు తెలియకుండానే పరివర్తన చెందుతాం. మహాత్ములం కాలేకపోయినా మంచివారమవుతాం. "ఫలానావ్యక్తి అబద్ధమే చెప్పడు. మాట తప్పడు. నిజాయితీపరుడు" అనే కీర్తిని పొందుతాం. ఉన్నస్థాయి నుంచి ఉన్నత స్థాయిని చేరుకుంటాం. త్రికరణ శుద్ధి వైపు అడుగులు పడుతుంటే.. సమాజంలోనేకాకుండా, సర్వేశ్వరుడి వద్ద మనం విశిష్టతను సంతరించుకుంటాం. మనం చేసే పూజలు, అర్చనలకంటే.. జీవన విధానమే భగవంతుడికి ప్రీతిపాత్రమైనది. అదే ఆయన ప్రేమానుగ్రహాలకు చేరువ చేస్తుంది. త్రికరణ శుద్ధితో పరోపకారానికి, సత్య నిరతికి, ధర్మాచరణకు చేరువవుతాం. మహాభారతంలో కౌరవులు కుట్రలు, కుతంత్రాలకు పాల్పడగా.. పాండవులు ధర్మాన్ని ఆచరించారు. అందుకే.. కృష్ణ పరమాత్మ పాండవుల వైపు నిలిచారు. "నేను పాండవ పక్షపాతిని కాదు.. ధర్మ పక్షపాతిని" అని చెప్పారాయన. ప్రస్తుత సమాజంలో కూడా భగవంతుడికి కావాల్సింది తన భక్తుల్లో పరివర్తన లేదా మార్పు. సృష్టిలో ఏ జీవరాశికీ తనను తాను సంస్కరించుకుంటూ, శుద్ధి చేసుకుంటూ ఉన్నతస్థాయికి చేరే అవకాశం లేదు. భగవంతుడు మానవులకు మాత్రమే మంచిచెడులు, ధర్మాధర్మాలు, సత్యాసత్యాల మధ్య తేడాను గుర్తించే శక్తిని, బుద్ధి కుశలతను ఇచ్చాడు. కాబట్టి.. మనమంతా ఆ దిశగా సాధన చేసి, శుద్ధీకరణకు చేరువవుదాం. జీవితాలను చరితార్థం చేసుకుందాం.

*– మాదిరాజు రామచంద్రరావు, 93933 24940*

## అర్థవంతమైన విజయమే జీవితం

**▸ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్**



బాబా మహా సమాధిని దర్శించుకుంటున్న మోహన్ భాగవత్

పుట్టపర్తి, డిసెంబరు 27: ఆది నుంచీ సనాతన ధర్మానికి పుట్టినిల్లుగా భారత్ పేరొందిందని, ప్రపంచ దేశాలు సైతం భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పట్ల మొగ్గు చూపుతున్నాయని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా ప్రశాంతి నిలయంలో సత్యసాయి బాలవికాస్ స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అర్థవంతమైన విజయమే నిజమైన జీవితమన్నారు. వివేకానందుడు రాజకీయనాయకుడు కాదు... అయినా.. ఆయన జీవితం అందరికీ ఆదర్శంగా ఉందని తెలిపారు.

## పౌరసత్వ బిల్లునే కాదు.. పౌరసత్వాన్నీ నిరాకరిస్తున్నాం

**▸ ఆయేషా మీరా తల్లిదండ్రుల ఆవేదన**

విజయవాడ సిటీ, డిసెంబరు 27: ఆయేషా మీరా హత్య కేసులో 12 ఏళ్లయినా తమకు న్యాయం జరగలేదని ఆమె తల్లిదండ్రులు షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లయినా కూడా మైనార్టీలకు న్యాయం జరగలేదు కాబట్టి.. పౌరసత్వ బిల్లును వ్యతిరేకించడమే కాదు.. తమ పౌరసత్వాన్ని కూడా నిరాకరిస్తున్నామని అన్నారు. 12 ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నా.. ఇంతవరకూ నేరస్తులను పట్టుకోలేకపోవడాన్ని నిరసిస్తూ 'ఆయేషామీరా న్యాయ పోరాట కమిటీ' ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద శుక్రవారం 'సత్యాగ్రహ దీక్షా దిన్' నిర్వహించారు. ఆయేషా కేసులో నిందితులు రాజకీయ కుటుంబం నుంచి వచ్చినవారు.. ప్రభుత్వ అండ ఉండటంతో విచారణ సరిగా జరగలేదన్నారు.



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న ఆయేషా మీరా తల్లిదండ్రులు

## జగన్‌తో సురేశ్ ప్రభు భేటీ

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ దంపతులతో కేంద్ర మాజీ మంత్రి, ఏపీ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న సురేశ్ ప్రభు సమావేశమయ్యారు. శుక్రవారం విజయవాడకు వచ్చిన సురేశ్ ప్రభు దంపతులు తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జగన్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ భార్య భారతి కూడా వారితో సమావేశమయ్యారు. ఇది మర్యాదపూర్వక సమావేశమేనని ప్రభుత్వవర్గాలు చెప్పాయి.

## జగన్ కేసు విచారణ 3కి వాయిదా

హైదరాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మంత్రి మండలి సమావేశం ఉన్న నేపథ్యంలో తన వ్యక్తిగత హాజరుకు మినహాయింపు ఇవ్వాలని ఏపీ ముఖ్యమంత్రి సీబీఐ ప్రత్యేక కోర్టును అభ్యర్థించారు. ఈ మేరకు జగన్ తరఫు న్యాయవాది జి.అశోక్‌రెడ్డి శుక్రవారం దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించిన న్యాయమూర్తి కేసు తదుపరి విచారణను జనవరి 3వ తేదీకి వాయిదా వేశారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ సిబ్బంది

**▸ బిల్లుకు గవర్నర్ ఆమోదం**

అమరావతి, డిసెంబర్ 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్పు చేస్తూ ప్రభుత్వం చేసిన బిల్లు గవర్నర్ ఆమోదం పొందింది. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్‌లో ఆమోదం పొందిన బిల్లు గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత ఉత్తర్వులు వెలువడ్డాయి. దీనిపై ఏపీఎస్‌ఆర్టీసీ ఎన్‌ఎంయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.వెంకటరమణారెడ్డి, వై.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

## అవినీతి ఊబిలో ఎమ్మెల్సీ గోపాల్‌రెడ్డి!

**▸ రెడ్డి శేఖర్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు**

**▸ వైఎస్సార్‌టీఎఫ్‌లో భగ్గుమన్న విభేదాలు**

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ (వైఎస్సార్‌టీఎఫ్)లో విభేదాలు భగ్గుమన్నాయి. వైఎస్సార్ టీఎఫ్‌తో ఎలాంటి సంబంధం లేకపోయినా ఎమ్మెల్సీ గోపాల్‌రెడ్డి యూనియన్‌లో కొత్త కార్యవర్గాన్ని ఎలా నియమిస్తారని ప్రస్తుత అధ్యక్షుడు వి.రెడ్డి శేఖరెడ్డి నిలదీశారు. గోపాల్ రెడ్డి భారీ ఎత్తున అవినీతికి పాల్పడి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని తీవ్ర విమర్శలు చేశారు. దీంతో బైలాకు విరుద్ధంగా రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారనే ఆరోపణలతో ఫెడరేషన్ రెండుగా చీలిపోయింది. వైఎస్సార్‌టీఎఫ్‌కు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వి. రెడ్డి శేఖరరెడ్డి, కె.వెంకటరెడ్డి కొనసాగుతున్నారు. వారి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి వరకు ఉంది. అయితే, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల స్థానంలో కొత్త వాళ్లను ఎంపిక చేసినట్లు తెలిసింది. సంఘానికి ఎలాంటి సంబంధం లేని ఎమ్మెల్సీ వి.గోపాల్‌రెడ్డి తనకు అనుకూలమైన వర్గాన్ని సమావేశానికి పిలిచి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు తెలియజేయకుండా సమావేశాన్ని ఏర్పాటు చేశారని రెడ్డి శేఖరరెడ్డి విమర్శించారు. కొంతమంది సంఘం నేతల నుంచి భారీగా ముడుపులు స్వీకరించి, అవినీతికి పాల్పడి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఏకపక్షంగా, అవినీతికి పాల్పడి ప్రకటించిన నూతన రాష్ట్ర కార్యవర్గం చెల్లదన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా బైలా ప్రకారం ఎన్నికల తేదీలు ముందుగా ప్రకటించి పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

# స్కూళ్లు ఫీజులు తగ్గాల్సిందే!

- ▸ నియోజకవర్గం యూనిట్‌గా దేగకన్ను
- ▸ తల్లిదండ్రుల ఫిర్యాదులకు 'టోల్ ఫ్రీ'
- ▸ విద్యాహక్కు చట్టం సంపూర్ణ అమలు
- ▸ ఉపాధ్యాయులు ఇక బోధనకే పరిమితం
- ▸ మిగిలిన పనుల బాధ్యత వలంటీర్లదే
- ▸ త్వరలో రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- ▸ ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం జగన్ స్పష్టం



ట్యూషన్ ఫీజులపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం జగన్

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): "ప్రజలు మన నుంచి చాలా ఆశిస్తున్నారు. నాణ్యమైన విద్యను, పాఠ్యప్రణాళికలో కుదింపును, అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల తగ్గింపును వారు కోరుకుంటున్నారు. ప్రభుత్వం ఆదిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలి. వచ్చే విద్యా సంవత్సరానికే మార్పు కన్పించాలి" అని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. అదేసమయంలో అన్ని పాఠశాలల్లోనూ విద్యా హక్కు చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని ఆదేశించారు. నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని, స్కూళ్ల పరిస్థితులను సమీక్షించాలన్నారు. "స్కూళ్లలో ఫీజులు సాధారణ స్థాయిలో లేవు. షాక్ కొట్టే రీతిలో ఉన్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఈ ఫీజులు తల్లిదండ్రుల అభిలాష, స్థాయిల మేరకు తగ్గాలి. ఆ దిశగా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి" అని సీఎం సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రైవేట్ కాలేజీలు, స్కూళ్లు, విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణపై సంబంధిత మంత్రి ఆదిమూలపు సురేశ్, ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఆర్.కాంతారావు(రిటైర్డ్), ఏపీ ఉన్నత విద్య నియంత్రణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య(రిటైర్డ్) తదితర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

### అవాంతరాలు వచ్చినా ఆంగ్లమే!

ప్రభుత్వ స్కూళ్లు తెలుగు మీడియంలో నడుస్తున్నందున చిన్నారుల భవిష్యత్తుపై బెంగతో వారి తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయించి, అప్పులు కూడా చేసి ఖర్చు పెడుతున్నారని సీఎం జగన్ అన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంకు మొగ్గు చూపిందని వివరించారు. ఇంగ్లిష్ మీడియం చదువులు పేదవాళ్లకు చేరువ అయితేనే వ్యవస్థలో మార్పులు వస్తాయని తాను నమ్ముతున్నట్టు సీఎం చెప్పారు. ఒక వైపు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెడుతూనే, మరోపక్క ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దూకుడుకు ముకుతాడు వేయాల్సిన అవసరం, బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రైవేటు పాఠశాలలపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు.

### టోల్ ఫ్రీతో చెక్

ప్రైవేట్ కాలేజీలు, స్కూళ్లలో భారీ ఫీజులను నియంత్రించేందుకు త్వరలోనే తల్లిదండ్రులకు అందుబాటులో ఒక టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. సమాజం పట్ల అంకిత భావం లేకుండా చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలుంటాయన్న సందేశం వెళ్లాలన్నారు. విద్యాహక్కు చట్టాన్ని సమూలంగా అమలు చేయాలని, పేద పిల్లలు మంచి కాలేజీల్లో చదువుకునేలా వ్యవస్థలో మార్పు రావాలని కోరారు. అదేసమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కచ్చితంగా అమలు కావాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో ఇస్తామని సీఎం చెప్పారు. ఉల్లంఘనలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా ఆయా చర్యలు అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని సీఎం ఆదేశించారు. వలంటీర్లు, గ్రామ సచివాలయాల ఉద్యోగులను ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని, టీచర్లను విద్యాబోధనకే పరిమితం చేయాలని సీఎం ఆదేశించారు.

### ప్రతిదీ రాజకీయమేనా?

ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్నీ కొందరు రాజకీయం చేస్తున్నారని సీఎం జగన్ అసహనం వ్యక్తం చేశారు. ఆంగ్ల మాధ్యమాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని పరోక్షంగా ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. విమర్శలు చేసే వారి మనవళ్లు, పిల్లలు ఏమీడియంలో చదువుకున్నారు? చదువుకుంటున్నారు? అని ప్రశ్నించారు. మద్యం దుకాణాలు, బార్లు తగ్గిస్తుంటే దానిపైనా వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఇదో పిచ్చి తుగ్లక్ నిర్ణయం

- ▸ జగన్‌కు అధికారం తలకెక్కింది
- ▸ ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలి
- ▸ ప్రముఖ జర్నలిస్టు శేఖర్ గుప్తా మనోగతం

న్యూఢిల్లీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) భారత దేశంలో ఆరు దశాబ్దాల తర్వాత ఒక అద్భుతమైన గ్రీన్ ఫీల్డ్ రాజధాని ఏర్పడే అవకాశాలను కాలరాస్తూ 3 రాజధానులు ఏర్పాటు చేయాలని జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తుగ్లక్ తీసుకున్న నిర్ణయం లాంటిదని సీనియర్ జర్నలిస్టు, 'ప్రింట్' అధినేత శేఖర్ గుప్తా వ్యాఖ్యానించారు. దేశానికి మొఘలులు వచ్చి నగరాలు నిర్మించి.. సంపదను పెంచి లూటీ చేశారని, తుగ్లక్ ఒక్కడే అందుకు మినహాయింపని తన ప్రింట్ వెబ్‌సైట్‌లో వ్యాఖ్యానించారు. తుగ్లక్‌ను ఉదాహరణగా తీసుకుని అమరావతిని రాజధాని కాకుండా చేయడం విషాదకరమన్నారు. వైఎస్ జీవించి ఉంటే.. చంద్రబాబును జనం మరచిపోయేలా రాజధానిని నిర్మించేవారని చెప్పారు. ఆంధ్ర ప్రజల ప్రయోజనాల రీత్యా ప్రధాని మోదీ ఇప్పటికే జగన్‌కు ఫోన్ చేసి ఇలాంటి తప్పుడు నిర్ణయంపై మందలించి ఉంటే బాగుండేదన్నారు. జగన్ అధికారం తలకెక్కడంతో ఈ నిర్ణయం తీసుకున్నారని. ముగ్గురు తుగ్లక్‌లు కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా ఉందని.. ఈ పిచ్చితనానికి అడ్డుకట్ట వేయాల్సిందేనని స్పష్టీకరించారు. ఇంకా ఏమన్నారంటే..

- ▸ 'తుగ్లక్‌ను ఉదాహరణగా తీసుకుని అమరావతిని విస్మరించడం విషాదకరం.'
- ▸ ప్రధాని మోదీ.. జగన్‌కు ఫోన్ చేసి ఇలాంటి తప్పుడు నిర్ణయంపై మందలించి ఉం టే బాగుండేది.'
- ▸ రాజధానిపై జగన్ వెనుకంజ వేస్తున్నారనే ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, సింగపూర్ కన్సార్టియమ్ వెనక్కిపోయాయి.'



### బాబుకు క్రెడిట్ దక్కుతుందనుకుని..

'చంద్రబాబు నిర్ణయాలన్నిటినీ కాలరాయాలనుకోవడం, రాజధానికి చంద్రబాబు తీసుకున్న బృహత్తర నిర్ణయం వల్ల ఆయనకు క్రెడిట్ దక్కుతుందని.. దానివల్ల తానేదో కోల్పోతానని జగన్ అనుకోవడం సరైంది కాదు. బృహత్తర రాజధాని నిర్మాణం ప్రారంభం కావడం, రైతులు భూములివ్వడంతో జగన్‌కు ఏం చేయాలో తోచక ఆ నిర్ణయాన్ని కాలరాయాలనుకున్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మధ్య స్పర్థలు ఇంత అనారోగ్యకరమైన స్థితికి దిగజారకూడదు. పెద్ద నగరాలు ఉంటే సంపద ఏర్పడుతుంది. ఉద్యోగాల కోసం, నాణ్యమైన జీవనం, విద్య, వైద్యం అవసరాలు, హుందాగా బతకడానికి జనం ఆ నగరాలకు తరలి వస్తారు. కానీ దురదృష్టవశాత్తు మనకు అలాంటి నగరాలు లేవు. ఉన్న నగరాలు జనంతో నిండిపోయాయి. ఆరోగ్యకరమైన, మంచి పాలనతో కూడిన, మౌలిక సదుపాయాలు పుష్కలంగా లభించే నగరాలు మనకు కావాలి. మహారాష్ట్ర నుంచి గుజరాత్ విడిపోవడంతో గాంధీనగర్ నిర్మించారు. అక్కడ ప్రభుత్వ కార్యాలయాలు తప్పమరేమీలేవు.'

### మమకారం పెంచుకున్న హైదరాబాద్..

'ఏపీ విడిపోయినప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు మమకారం పెంచుకున్న హైదరాబాద్ ను కోల్పోయారు. వారి భావోద్వేగాలు హైదరాబాద్‌తోనే ఉండిపోయాయి. చాలా మంది కోస్తా సంపన్నులు పెట్టుబడులు పెట్టి హైదరాబాద్‌లో ఆస్తులు నిర్మించుకున్నారు. అందువల్ల వారూ ఆ నగరాన్ని వీడలేకపోయారు. ఈ సమయంలో ఒక అద్భుతమైన గ్రీన్‌ఫీల్డ్ నగరాన్ని నిర్మించాలని చంద్రబాబు తలపెట్టినప్పుడు నేనెంతో సంతోషించాను. ఆ రోజుల్లోనే ఏపీకి రాజధానిని నిర్మించుకునే అవకాశం వచ్చిందని రాశాను. చండీగఢ్‌లో రాజధాని పెట్టుకుని హరియాణా, పంజాబ్ ప్రజలు సతమతమవుతున్నట్లుగా కాకుండా ఆంధ్రప్రదేశ్ వేరే రాజధాని ఏర్పర్చుకోవడం మంచిదని అభిప్రాయపడ్డాను. ఆరు దశాబ్దాల తర్వాత మొదటి గ్రీన్‌ఫీల్డ్ నగరాన్ని నిర్మించ తలపెట్టడం మంచి పరిణామం' 'దురదృష్టవశాత్తూ జగన్ మొదటి నుంచీ రాజధాని అమరావతి పట్ల అనుమానాస్పద వైఖరితో వ్యవహరించారు. బడ్జెట్‌లో కేవలం రూ.500 కోట్లే కేటాయించారు. అత్యంత గౌరవప్రదమైన లులు గ్రూపు కూడా నిష్క్రమించింది.' 'అమరావతిలో అద్భుతమైన రాజధాని నిర్మించే అవకాశాలను కాలదన్నుకుని తుగ్లక్‌లాగా జగన్ మూడు రాజధానులను ప్రకటించడం హాస్యాస్పదం. ఇదొక జాతీయ విషాదం.'

# బీసీజీ కూడా 'అటే'!

- ▸ కొత్త నగరానికి వ్యతిరేకం
- ▸ ఇప్పటికే మధ్యంతర నివేదిక

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ)... అమరావతిపై తదుపరి నివేదిక అందించనున్న సంస్థ ఇదే. జీఎన్‌రావు కమిటీతో పాటు బీసీజీ నివేదికను అధ్యయనం చేయడానికి హైపవర్ కమిటీని నియమిస్తామని సర్కారు ప్రకటించింది. నిజానికి... బీసీజీ సంస్థ తన మధ్యంతర నివేదికను ఇది వరకే ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం...

'గ్రీన్‌ఫీల్డ్ (పూర్తిగా నూతన నగరం) క్యాపిటల్‌గా అమరావతిని అభివృద్ధిపరచడం రాష్ట్ర ఖజానాపై పెనుభారం మోపుతుందని బీసీజీ అభిప్రాయపడింది. పెట్టిన ఖర్చుకు అనుగుణంగా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం లభించే అవకాశాలు తక్కువే అని తెలిపింది. దీనికి బదులుగా ఏదైనా 'బ్రౌన్‌ఫీల్డ్ (ఇప్పటికే అభివృద్ధి చెందిన) నగరంలో రాజధానిని ఏర్పాటు చేయడం శ్రేయస్కరమని పేర్కొంది. మహానగరంగా విస్తరించేందుకు పుష్కలంగా అవకాశమున్నప్పటికీ విజయవాడ ఎదగలేకపోవడానికి భౌగోళిక పరిస్థితులే కారణమని తెలిపింది. ఒక వైపు కృష్ణా నది, మిగిలిన దిశల్లో కొండలు, స్థల కొరత ప్రధాన కారణాలని బీసీజీ అభిప్రాయపడింది. రాజధాని వికేంద్రీకరణ ద్వారా అటు అమరావతి రైతులు నష్టపోకుండా చూడడంతో పాటు విజయవాడ మహా నగరంగా ఎదిగేందుకు పలు సూచనలు చేసింది. విజయవాడను రాజధాని ప్రాంతంతో అనుసంధానించేందుకు కృష్ణా నదిపై 3 చోట్ల కొత్త వంతెనలు నిర్మించాలని సూచించింది. దీనివల్ల ఈ రెండు ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మరింతగా పెరిగి, విశేషంగా లబ్ధి పొందుతాయని పేర్కొంది. స్థలం కొరత తీరి విజయవాడ రాజధాని ప్రాంతం దిశగా పెద్ద ఎత్తున విస్తరిస్తుందని, చకచకా అభివృద్ధి చెందడంతోపాటు రాజధాని గ్రామాల్లోని భూములకు డిమాండ్ పడిపోకుండా ఉంటుందని బీసీజీ మధ్యంతర కమిటీ పేర్కొన్నదని సమాచారం.

**బీసీజీ అంటే..**
అమెరికాలోని బోస్టన్ ప్రధాన కేంద్రంగా పని చేసే బీసీజీ 1963 నుంచి ప్రపంచవ్యాప్తంగా మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ కంపెనీగా ప్రసిద్ధి చెందింది. ఈ సంస్థకు 50 దేశాల్లో 90కిపైగా కార్యాలయాలు, సుమారు 14 వేల మంది సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వాలు, బడా సంస్థలు ప్రతిపాదించే భారీ ప్రాజెక్టులు ఎంత వరకు ఆచరణీయం, వాటి వల్ల ఒనగూరే ప్రయోజనాలు, కష్టనష్టాలను వివరిస్తూ నివేదికలు అందిస్తుంది.

## తరలింపుపై ఉద్యోగులకు వ్యతిరేకతలేదు

**▸ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి**

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వ నిర్ణయానికి మేం కట్టుబడి ఉంటాం. సచివాలయం విశాఖకు తరలింపుపై ఉద్యోగులకు వ్యతిరేకతలేదు. అయితే కొంత మంది ఉద్యోగులకు ఇబ్బందులు ఉన్నాయి" అని సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొంత మంది ఉద్యోగులు కుటుంబాలను హైదరాబాద్ నుంచి తరలించలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. అమరావతి ప్రాంతంలో ఇళ్ల అద్దెలు ఎక్కువగా ఉండడం వల్ల కొంత మంది ఉద్యోగులు రుణాలు తీసుకొని ఇళ్లు కొనుకున్నారని వివరించారు. సచివాలయం విశాఖకు తరలించాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటే ఉద్యోగులకు ఎదురయ్యే ఇబ్బందులను, సమస్యలను ప్రభుత్వం, సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరతామన్నారు. రాజధానిపై వేసిన జీఎన్‌రావు కమిటీ తనతో చర్చించలేదన్నారు. తాము ఉద్యోగులందరితో చర్చించిన తర్వాత వారి అభిప్రాయాలను సీఎం దృష్టికి తీసుకెళతామన్నారు. రాజధాని అనేది ఉద్యోగులకు మాత్రమే సంబంధించిన అంశం కాదని, రాష్ట్ర ప్రజలందరికీ, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశమని అన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి తాము వ్యతిరేకం కాదని, అయితే సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన తర్వాతే తరలించాలని సచివాలయ ఏఎస్‌వోల సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి అన్నారు.



### అది పనికిమాలిన కమిటీ

జీఎన్ రావు కమిటీకి చట్టబద్ధత ఉందా? అది చెత్త కమిటీ. అమరావతిని రాజధానిగా కొనసాగించాలని కోరుతూ మహిళలు, మహిళా రైతులు, రైతు కూలీలు, వైసీపీ తప్ప మిగిలిన అన్ని పార్టీలూ చేసిన ఉద్యమానికి రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. 26వ తేదీ రాత్రి రాజధాని మార్పుపై వైసీపీ ప్రకటనకూ, కేబినెట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయానికి వ్యత్యాసం వచ్చింది. గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని వైసీపీ దద్దమ్మ శాసనసభ్యులు తమ పదవులకు రాజీనామా చేయాలి.

**– దేవినేని ఉమా, మాజీ మంత్రి**

### తుగ్లక్ పాలన చూస్తున్నాం

ప్రజలకు మేలు చేస్తారని అధికారం కట్టపెట్టిన స్థానిక వైసీపీ శాసనసభ్యులు సమాధానం చెప్పాలి. పుస్తకాల్లో తుగ్లక్ పాలన గురించి చదివాం. ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి తుగ్లక్ పాలన చూస్తున్నాం. రాజధాని మారుస్తామంటూ ఎన్నికల్లో పెట్టి ప్రజల అంగీకారం అడిగి ఉంటే ప్రజా తీర్పు ఏ విధంగా ఉండేదో జగన్‌కు తెలిసివచ్చేది.

**– బోడె ప్రసాద్, తంగిరాల సౌమ్య, మాజీ ఎమ్మెల్యేలు**



### పుట్టగతులుండవు

అమరావతికి ద్రోహం చేయాలని ప్రయత్నిస్తే పుట్టగతులు ఉండవు. రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే రేపు వైసీపీకి పడుతుంది. ఉవ్వెత్తున వచ్చిన ప్రజావ్యతిరేకతను చూసి భయపడి రాజధాని తరలింపు అంశంపై ప్రభుత్వం వెనకడుగు వేసింది. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని వైసీపీ నాయకులు చేసిన ఆరోపణలపై సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీడీపీ అధినేత చంద్రబాబే సవాల్ విసిరారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

**– బొండా ఉమా, మాజీ ఎమ్మెల్యే**





### సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు

ఎన్నికలకు ముందు రాజధానిగా అమరావతి ఉంటుందని, అద్భుతమైన నగరాన్ని కడతామని జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రజలు, రైతులు, రైతు కూలీలు ఆందోళన చేస్తుంటే.. అడుగుకో పోలీస్‌ను పెట్టారు. ముళ్ల కంచెలు, వాటర్ క్యానన్లు, టియర్ గ్యాస్, లాఠీలు, తుపాకులా? ప్రజా ఉద్యమాలను అణచివేయాలనుకున్న ఎంతో మంది నియంతలు కాలగర్భంలో కలిసిపోయారు. అమరావతికి లక్ష కోట్లు ఖర్చవుతుందని అంటున్న వైసీపీ మేధావులకు అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు అని మరోసారి గుర్తుచేస్తున్నా.

**– నారా లోకేశ్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి**

## లోకం తీరు




**చలికాలం**

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| విశాఖపట్నం | 20.8 | 29.4 |
| కర్నూలు | 21.5 | 31.9 |
| విజయవాడ | 22.4 | 30.4 |
| నెల్లూరు | 23.0 | 31.0 |
| హైదరాబాద్ | 20.4 | 28.7 |

### తేలికపాటి వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ఒడిశా పరిసరాల్లో ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావం కారణంగా బంగాళాఖాతం నుంచి తేమగాలులు వీస్తుండడంతో కోస్తా, రాయలసీమల్లో ఎక్కువచోట్ల చిరుజల్లులు, అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల వరకు ద్రోణి ప్రభావం కొనసాగుతుందని, కోస్తా, రాయలసీమల్లో చిరుజల్లుల నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.



### ప్రియాంక.. అర్బన్ నక్సల్స్ బృందాల నేత

పార్లమెంటు మన దేశ ధర్మగ్రంథం లాంటిది. బీజేపీ ప్రభుత్వం ఇప్పటి దాకా రాజ్యాంగానికి మచ్చతెచ్చే చర్యలకు పాల్పడలేదు. అయితే పౌరసత్వ సవరణ చట్టం దేశానికే మచ్చ తీసుకు వచ్చిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించడం సరికాదు. ఆమె మాటలను బట్టి అర్బన్ నక్సల్స్ బృందాలకు నేతగా వ్యవహరిస్తున్నట్లుంది.

*– భగవంత ఖూబా, బీదర్ బీజేపీ ఎంపీ (బెంగళూరులో మీడియాతో)*



### పుష్పగుచ్ఛాలొద్దు.. పుస్తకాలు ఇవ్వండి

నాకెవరూ పూలగుత్తులు ఇవ్వొద్దు. అభిమానులు ప్రేమతో ఇచ్చినా పూలు వాడిపోతే బాధ పడతాను. వాటికి బదులుగా సంతకం చేసి పుస్తకాలు ఇవ్వండి. పుస్తకాలతో జ్ఞానం పెరుగుతుంది. అవి ఎప్పటికీ ఉండిపోతాయి. ఎందరినో జ్ఞానవంతులను చేస్తాయి.

*– జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్*



### పాక్షిక అంధత్వానికి కృత్రిమ రెటీనాతో చెక్

లాస్‌ఏంజెలెస్, డిసెంబరు 27: పాక్షిక అంధత్వానికి పరిష్కారం చూపే దిశగా శాస్త్రవేత్తలు ముందడుగు వేశారు. దెబ్బతిన్న రెటీనాలో ఎలక్ట్రోడులను అమర్చి వాటిని మెదడుకు అనుసంధానం చేయడం ద్వారా చూపును పునరుద్ధరించవచ్చని తెలిపారు. మెదడు సాధారణ రెటీనాతో అనుసంధానం అయినట్లే కృత్రిమ రెటీనాతో కూడా అనుసంధానమవుతుందని చెప్పారు. ఈ మేరకు అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ వర్సిటీ శాస్త్రవేత్తలు కరెంట్ బయాలజీ అనే జర్నల్‌లో తమ పరిశోధన వివరాలను వెల్లడించారు.

### మలేరియా పరాన్న జీవి గుట్టు రట్టు!

టోక్యో, డిసెంబరు 27: మలేరియా పరాన్న జీవి ప్లాస్మోడియం శరీరంలోని అతిథేయ కణాల మధ్య ఎలా వ్యాపిస్తుందో జపాన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్లాస్మోడియం మానవ శరీరంలో ఒక కణజాలం నుంచి మరొక కణజాలంలోకి ఎలా చొచ్చుకెళ్తుందో ఇప్పటిదాకా స్పష్టత లేదని, తాజా పరిశోధనల్లోనే మొట్టమొదటిసారిగా ఈ విషయాన్ని ఛేదించామన్నారు. పరిశోధన వివరాలను ఐసైన్స్ జర్నల్‌లో ఓ పటం ఆధారంగా వివరించారు. ప్లాస్మోడియం అతిథేయ కణాల్లో చేరాక అక్కడి ప్రోటీన్లపై ప్రభావం చూపి కణజాలం ఉపరితలం పైకి చేరుతుందని చెప్పారు. రోగనిరోధక వ్యవస్థకు దొరక్కుండా ప్రోటీన్లను దెబ్బతీస్తుందన్నారు. ఈ పరిశోధనలు భవిష్యత్తులో పరాన్న జీవుల వల్ల వచ్చే వ్యాధుల నివారణకు ఉపయోగపడతాయని వారు చెప్పారు.

# చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

▸ **హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రజని**



తాడేపల్లి, డిసెంబరు 27: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఎన్ని చట్టాలు రూపొందించినా వాటి అమలులో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రజని అన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో జరిగిన జాతీయ స్థాయి మహిళా శిఖరాగ్ర సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుతం మహిళలు పురుషులకు దీటుగా పోటీపడుతూ అన్ని రంగాల్లోనూ కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మరో ముఖ్య అతిథి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ దేశంలో చట్టాలు సక్రమంగా అమలు జరిగితే ఇప్పటికే మహిళలపట్ల వివక్ష, అత్యాచారాలు ముగిసిపోయి ఉండేవన్నారు.






▸ మత ప్రాతిపదికన పౌరసత్వం..

# రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

▸ **దేశంలోని ముస్లింలకు అండగా దళితులు: డొక్కా**

▸ **పౌరసత్వ సవరణ చట్టంపై కొనసాగిన నిరసనలు**

గుంటూరు/విజయవాడ/తిరుపతి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జాతీయ పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్‌పీఆర్, ఎన్‌ఆర్‌సీలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం పలుచోట్ల ముస్లింలు రోడ్డెక్కి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. వారికి వివిధ రాజకీయ పార్టీలు, దళిత, ప్రజా సంఘాలు కూడా మద్దతుగా నిలిచాయి. సేవ్ డెమోక్రసీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులో బీఆర్ స్టేడియం రోడ్డులోని పాతబస్టాండ్ సెంటర్ వద్ద ముస్లింలు పెద్దఎత్తున రోడ్డుపైకి చేరుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. మత ప్రాతిపదికన పౌరసత్వం ఇవ్వడం, తిరస్కరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సీఏఏ విషయంలో దేశంలోని 20 కోట్ల మంది ముస్లింలకు 40 కోట్ల మంది దళితులు అండగా నిలుస్తారని అన్నారు. విజయవాడలో ఆల్ మైనార్టీస్ అసోసియేషన్ నెట్‌వర్క్ (అమాన్) సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో జుమ్మా నమాజ్ తర్వాత ధర్నా చౌక్ వరకు ర్యాలీ సాగింది. సీఏఏకు వ్యతిరేకంగా చిత్తూరు జిల్లాలో ముస్లింలు చేపట్టిన నిరసన ప్రదర్శనలకు మద్దతుగా వైసీపీ, కాంగ్రెస్, సీపీఐతోపాటు భారతీయ అంబేడ్కర్ సేన వంటి ప్రజాసంఘాలు ఆందోళనల్లో పాల్గొన్నాయి. చంద్రగిరిలో ముస్లింలు వెయ్యి అడుగుల జాతీయ జెండాను వీధుల్లో ఊరేగిస్తూ ర్యాలీ నిర్వహించారు. వి.కోటలోనూ ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రదర్శన జరిపారు.



విజయవాడలో ముస్లింల భారీ ర్యాలీ

## సీఏఏపై కాంగ్రెస్ దుష్ప్రచారం

▸ **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా**

▸ **సీఏఏకు మద్దతుగా తిరంగా ర్యాలీ**



గుంటూరులో బీజేపీ తిరంగా ర్యాలీ

గుంటూరు, తిరుపతి, డిసెంబరు 27: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. సీఏఏకు మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో గుంటూరులో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరసత్వ నమోదు కాంగ్రెస్ పాలనలోనే ప్రారంభించినట్టు చెప్పారు. కాగా.. సీఏఏకు మద్దతుగా తిరుపతిలోనూ బీజేపీ తిరంగా ర్యాలీ నిర్వహించింది. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు సాగిన ర్యాలీలో మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ నాయుడు పాల్గొన్నారు.

# టీటీడీ ఈవో అధికారాల్లో కోత!

▸ **రూ.25 లక్షలు పైబడిన లావాదేవీలకు బోర్డు అనుమతి తప్పనిసరి**

▸ **నేటి ధర్మకర్తల మండలి సమావేశంలో ఆమోదం?**

▸ **భూముల లీజుపైనే భేటీలో ప్రధాన చర్చ**

తిరుమల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన కార్యనిర్వహణాధికారి అధికారాలకు కళ్లెంవేసే దిశగా ప్రస్తుత పాలకమండలి పావులు కదుపుతోంది. శనివారం తిరుమల అన్నమయ్య భవనంలో వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన ధర్మకర్తల మండలి సమావేశంలో దీనికి ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. సమావేశంలో ప్రధానంగా తిరుపతిలోని టీటీడీ భూముల లీజు విషయంపైనే చర్చ జరగనున్నట్లు సమాచారం. అలిపిరి సమీపంలో దేవలోక్ ప్రాజెక్టు, టాటా కేన్సర్ ఇన్‌స్టిట్యూట్, అరవింద్ ఆస్పత్రిలకు టీటీడీ భూములను లీజుకు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే ఆ భూముల్లో టీటీడీ ఆశించిన ఏర్పాట్లు జరగలేదని పెద్ద ఎత్తున విమర్శలు ఎదురవుతున్నాయి. దీంతో భూముల లీజు విషయమై చర్చించి తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కాగా.. నిత్యావసర సరుకులు, వస్తువులు, పరికరాలు, యంత్రాలు, వైద్య సదుపాయాల కొనుగోళ్లు, మరమ్మతులు, ఆధునీకరణ, నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు తదితరాల నిర్వహణ కొరకు రూ.2 కోట్లకు లోబడి బడ్జెట్ ఉంటే టీటీడీ ఈవో అనుమతితో ఫైలు కదిలేది. ఆ తరువాత రాటిఫికేషన్ ద్వారా బోర్డు దృష్టికి తీసుకెళ్లి ఆమోదం తీసుకునేవారు. ఈవోకు ఈ విచక్షణాధికారం ఎంతో కాలంగా వస్తోంది. అయితే శనివారం ధర్మకర్తల మండలి సమావేశం నేపథ్యంలో బుధవారం వర్క్స్ కమిటీ సమావేశమై రూ.2 కోట్లకు లోబడి ఇప్పటివరకు జరిగిన, జరుగుతున్న కాంట్రాక్టు పనులు, కొనుగోళ్ల వ్యవహారాలను పరిశీలించింది. టెండర్లు, కొనుగోళ్లు ఈవో ద్వారానే జరుగుతున్నాయని గుర్తించి ధర్మకర్తల మండలి ప్రాధాన్యాన్ని పెంచుతూ ఇకపై రూ.25 లక్షలు పైబడిన ప్రతి లావాదేవీని బోర్డుకు సమర్పించాలని వర్క్స్ కమిటీ నిర్ణయించింది. దీనిని అజెండాలో చేర్చి శనివారం జరిగే సమావేశంలో ఆమోదం తెలపనున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే అత్యవసర పరిస్థితుల్లో సరకులు కొనుగోళ్లు, నిర్మాణాలు, మరమ్మతులు వంటి వాటికి ఆటంకం కలిగే ప్రమాదముంది. బోర్డు ప్రతి నెల సమావేశమై అవసరమైన అంశాలకు ఆమోదం తెలిపినా కార్యాచరణకు కొంత కాలం పడుతుంది. దీంతో పాలనపరంగా సమస్యలు తలెత్తే అవకాశముందని కొందరు టీటీడీ సీనియర్ అధికారులు భావిస్తున్నారు.

మంటల్లో వాహనాలు..



పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల దగ్గరలో శుక్రవారం స్కూటీని కారు ఢీకొట్టింది. స్కూటీ పెట్రోల్ ట్యాంక్ పగిలి పెట్రోలు కారుపై పడటంతో నిప్పురవ్వలు ఎగిసిపడి రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో స్కూటీపై ఉన్న విద్యార్థులిద్దరికీ గాయాలవగా, కారులోని వ్యక్తి సురక్షితంగా బయటపడ్డాడు. **- ఏలూరుక్రైం**

## దంపతుల హత్య కేసులో 12 మందికి యావజ్జీవం

బొబ్బిలి డిసెంబరు 27: విజయనగరం జిల్లా మక్కువ మండలం కొత్తకాముడుపేటలో దంపతుల హత్య కేసులో 12 మందికి యావజ్జీవ శిక్ష విధిస్తూ బొబ్బిలి సెకెండ్ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి బి.శ్రీనివారావు శుక్రవారం తీర్పు వెలువరించారు. 2016 జనవరి 12న చిల్లంగి నెపంతో గొల్లారి పండు, సత్యెమ్మ దంపతులను కొంతమంది రాళ్లతో కొట్టి చంపారు ఈ కేసులో శుక్రవారం తుది విచారణ జరిగింది.

## పట్టణ పేదలకు సెంటు భూమి: శ్రీరంగనాథరాజు

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలకు కనీసం ఒక సెంటు భూమిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ఉగాది నాటికి 25 లక్షల మంది పేద లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథ రాజు చెప్పారు. అమరావతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ భూమి పోగా, ఇళ్ల స్థలాల పంపిణీకి 22 వేల ఎకరాల భూమి సేకరించాల్సి ఉందని చెప్పారు.







# అన్యాయమైన తీర్పు

వాషింగ్టన్ పోస్ట్ కాలమిస్టు జమాల్ ఖషోగ్గీ హత్యకేసులో సౌదీ న్యాయస్థానం ఐదుగురు వ్యక్తులకు మరణశిక్ష విధిస్తూ చెప్పిన తీర్పు అమెరికాకు తప్ప మరెవ్వరికీ సంతృప్తి కలిగించలేదు. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌కు బద్ధవ్యతిరేకి అయిన ఈ పాత్రికేయుడు గత ఏడాది అక్టోబర్ 2న టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లోని సౌదీ ఎంబసీలో అత్యంత పాశవికంగా హత్యకు గురికావడం యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరచింది. హత్యతో సంబంధం లేదని తొలుత దబాయించిన సౌదీ అధికారులు, పాలకులు అనంతరకాలంలో ఎన్ని కట్టుకథలు అల్లారో తెలిసిందే. ఇప్పుడు మొత్తం పదకొండుమంది నిందితుల్లో ఐదుగురికి మరణశిక్ష, మరో ముగ్గురికి పాతికేళ్ల జైలు శిక్ష విధించి మిగతావారిని న్యాయస్థానం వదిలేసింది. ఆధారాల్లేవంటూ వదిలిపెట్టేసిన వారిలో యువరాజుకు అత్యంత సన్నిహితులు, ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన వారు ఉన్నారు. తీర్పు వివరాలు తప్ప, శిక్షలు పడింది ఎవరికో కూడా మిగతాప్రపంచానికి తెలియదు. హత్య వెనుక ముందస్తు పథకాలు, కుట్రలూ ఏమీ లేవనీ, ఇది అప్పటికప్పుడు జరిగిన ఒక తప్పుడు ఆపరేషన్ అని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వ్యాఖ్యానించడం యువరాజుకు మట్టి అంటకుండా చూడటంలో భాగమే.

సహజంగానే టర్కీ తాడెత్తున మండిపడుతూ, ఈ తీర్పుతో కథ ముగిసిందని సౌదీ అనుకుంటున్నది కానీ, విషయాన్ని వదిలిపెట్టేది లేదంటూ భీష్మ ప్రతిజ్ఞ చేసింది. టర్కీ ఏ రూపంలో పోరాటం చేయబోతున్నదో తెలియదు కానీ, ఖషోగ్గీ మరణానికి సంబంధించిన కీలకమైన సమాచారాన్ని సరైన సమయంలో బయటకు చెబుతూ సౌదీని అది బాగా అప్రదిష్టపాల్జేసింది. కేవలం ఖషోగ్గీని అంతం చేసే లక్ష్యంతో హత్యకు కొద్దిరోజుల ముందు సౌదీనుంచి పదిహేనుమంది అధికారుల బృందం టర్కీ చేరుకోవడం, ఖషోగ్గీ ప్రవేశానికి ముందు వారు సౌదీ దౌత్యకార్యాలయంలోకి ప్రవేశించడం సహా అనేక వివరాలు టర్కీ బయటపెట్టింది. ఆయన శవాన్ని ముక్కలుగా కోసి, దౌత్యకార్యాలయంలోనే కొత్తగా ఏర్పాటు చేసిన కొలిమిలో దహనం చేశారని కూడా వార్తలు వచ్చాయి. హత్యకు సంబంధించిన మిస్టరీ వీడకపోయి ఉండవచ్చు గానీ, మృతదేహం ఆచూకీ కానీ, అవశేషాలు కానీ దొరకకపోవడమే ఇది ఎంత ప్రణాళికాబద్ధంగా జరిగిందీ తెలియచెబుతున్నది.

ఖషోగ్గీ హత్యలో యువరాజు ప్రమేయాన్ని నిరూపించే ఆధారాలున్నాయని ఐక్యరాజ్యసమితి హక్కుల కార్యకర్త, ఈ కేసులో ప్రత్యేక ప్రతినిధి అయిన ఆగ్నస్ కాలమర్డ్ గతంలోనే ప్రకటించారు. సౌదీ, టర్కీ ప్రభుత్వాలు రెండింటికీ ఈ కేసుపట్ల చిత్తశుద్ధిలేదనీ, అంతర్జాతీయ విచారణ జరగనిదే నిజం నిగ్గుతేలదని ఆమె అప్పట్లోనే అన్నారు. ఖషోగ్గీ కుటుంబీకులు, అంతర్జాతీయ ప్రతినిధుల సమక్షంలో విచారణ సాగించామంటున్న సౌదీ ప్రభుత్వం ఆగ్నస్‌ను మాత్రం రానివ్వలేదు. హత్యమాత్రమే కాదు, తీర్పు కూడా ప్రణాళికాబద్ధంగానే ఉన్నదనీ, ఇందులో న్యాయం లవలేశమైనా లేకపోయిందని ఆమె ఇప్పుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సల్మాన్ ఆదేశాలతోనే ఖషోగ్గీని సౌదీ అధికారులు హత్యచేసినట్టు కనిపిస్తున్నదని అమెరికా నిఘా సంస్థ కూడా గతంలో అన్నది. ఇప్పుడు ఖషోగ్గీ వివాహం చేసుకోదల్చిన యువతి తప్ప ఆయన మొదటి భార్య సంతానం ఎవరూ ఈ తీర్పును తప్పుబట్టకపోవడం విచిత్రం. ఆయన ఇద్దరు కుమారులు, కుమార్తెలకు సౌదీ ప్రభుత్వం అత్యంత విలువైన భవనాలను, భారీ మొత్తాలను ఇచ్చి దారికి తెచ్చుకుంటున్నదని వాషింగ్టన్ పోస్టు కొద్దినెలల క్రితమే ఆసక్తికరమైన కథనాలు ప్రచురించింది. అమెరికా ఎంత వెనకేసుకొచ్చినప్పటికీ, సౌదీలో ఉంటున్న ఖషోగ్గీ పెద్దకుమారుడు ఈ తీర్పు అద్భుతం అమోఘం అంటూ ప్రశంసిస్తున్నప్పటికీ, హత్య చేసినవారిని మాత్రమే శిక్షించి, హత్యకు కుట్రలు పన్నినవారిని రక్షించిన ఈ తీర్పు అంతర్జాతీయ సమాజానికి ఏమాత్రం సంతృప్తికలిగించని మాట వాస్తవం. నిజాన్నీ, న్యాయాన్నీ కూడా భూస్థాపితం చేసిన తీర్పు ఇదని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సైతం వ్యాఖ్యానించిన నేపథ్యంలో, టర్కీ అన్నట్టుగా ఖషోగ్గీ కథ ఇంతటితో ముగిసిపోకపోవచ్చు.

# ప్రతిఘటనే ఈ కాలం కర్తవ్యం

■ పి. చిదంబరం



'పళని' పలుకు

జార్ఖండ్ శాసనసభా ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు (డిసెంబర్ 24) పలు దినపత్రికలు రెండు(భారత)దేశ పటాలను ప్రచురించాయి. ఆ రాజకీయ భౌగోళిక పటాలు విశదం చేసిన వాస్తవాలు : భారతీయ జనతా పార్టీ 2018లో దేశంలోని 29 రాష్ట్రాలకు గాను 21 రాష్ట్రాలలో అధికారంలో వున్నది. 2019 సంవత్సరాంతానికి బీజేపీ పాలిత రాష్ట్రాల సంఖ్య 15 కి పడిపోయింది. 2018లో దేశ జనాభాలో 69.2 శాతం, దేశ వైశాల్యంలో 76.5 శాతం బీజేపీ పాలనలో ఉన్నాయి. 2019 సంవత్సరాంతానికల్లా ఆ సంఖ్యలు 42.5 శాతం(జనాభా), 34.6 శాతం(భౌగోళిక వైశాల్యం) తగ్గిపోయాయి.

పెద్ద రాష్ట్రాల(లోక్‌సభ నియోజకవర్గాలు 20 లేదా అంతకు మించి వున్న రాష్ట్రాలు) లో బీజేపీ ముఖ్యమంత్రులు కేవలం మూడు రాష్ట్రాలలో మాత్రమే వున్నారు. అవి: కర్ణాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్. మరో మూడు పెద్ద రాష్ట్రాలు.. ఆంధ్రప్రదేశ్, బిహార్, తమిళనాడు ఎన్‌డిఏ మిత్ర పక్షాలుగా వున్నాయి. అయితే అవి ఇంకెంతకాలం బీజేపీ బాటలో వుంటాయన్నది నిశ్చితంగా చెప్పలేము.

2019 మేలో 17వ లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ ఘన విజయం ఇతర రాజకీయపక్షాలలో తీవ్ర దిగ్భ్రాంతి, అమిత భయాన్ని కలిగించింది. ఎందుకంటే బీజేపీ తన సొంతంగా 303 స్థానాలను, మిత్రపక్షాలతో కలిసి 353 స్థానాలను గెలుచుకున్నది. నరేంద్ర మోదీ, అమిత్ షాలు ఎదురులేని వ్యక్తులుగా, కార్యసాధక రాజకీయ వేత్తలుగా భాసిల్లసాగారు. ఆ నాయకద్వయాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక ప్రతిపక్షాలు సతమతమైపోయాయి. వాటి రాజకీయ ప్రాబల్యం మరింతగా క్షీణించింది.




సరే, నరేంద్ర మోదీ, అమిత్ షాలు తమ లక్ష్య సాధనకు మహోత్సాహంతో ముందడుగు వేశారు. పాలనా వ్యవహారాలలో దయాదాక్షిణ్యాలు లేకుండా వ్యవహరించసాగారు. తాము నిర్దేశించినవి జరిగి తీరాలన్న పట్టుదల చూపసాగారు. వివిధ చర్యలు అత్యంత నిర్బంధపూరితంగా చేపట్టారు. భారత్‌ను ఒక హిందూ దేశంగా రూపొందించడమనే లక్ష్య సాధనలో తాము ఎట్టి పరిస్థితులలోను ఎలాంటి వెనకడుగు వేయబోమని తమ చర్యల ద్వారా దేశ ప్రజలకు ఒక స్పష్టమైన సందేశాన్ని పంపించారు. చారిత్రక యుగాలలోని చక్రవర్తుల వలే తాము తమ గమ్యానికి పురోగమిస్తామని తమ వివిధ కార్యాచరణల రూపేణా ప్రజలు, ప్రతిపక్షాలు, మిత్రపక్షాలకు తిరుగులేని విధంగా విశదం చేశారు. నరేంద్రమోదీ, అమిత్ షాల మొదటి చర్య ట్రిపుల్ తలాక్‌ను నేరపూరితం చేసే బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడం. ట్రిపుల్ తలాక్‌ను భారత జాతీయ కాంగ్రెస్ గానీ, ఇతర రాజకీయ పక్షాలు గానీ వ్యతిరేకించలేదు. అలా తలాక్ చెప్పిన భర్తను జైలుకు పంపాలన్న నిబంధనను మాత్రమే వ్యతిరేకించాయి. అయితే, పార్లమెంటులో ఆ బిల్లుపై జరిగిన చర్చలో కాంగ్రెస్ మొదలైన ప్రతిపక్షాలు కాలం చెల్లిన, మహిళల శ్రేయస్సుకు హానికరమైన తలాక్ విడాకుల ఆనవాయితీని సమర్థించేవారుగా అప్రతిష్ఠను మూటగట్టుకున్నారు !

ఆ తరువాత వారు అమలుపరిచిన చర్య అసోంలో దుర్మార్గమైన జాతీయ పౌర పట్టిక ( నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్.. ఎన్ఆర్‌సి). ఈ ప్రక్రియలో 19,06,657 మంది వ్యక్తులు 'భారత పౌరులు కానివారు'గా, 'దేశ రహిత' వ్యక్తులుగా మిగిలిపోయారు. 2019 ఆగస్టు 5న భారత రాజ్యాంగంపై ఒక వినాశనకర దాడికి బీజేపీ ఉపక్రమించింది. ఇది మన మౌలిక శాసనంపై మున్నెన్నడు జరగని దాడి. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన అధికరణ 370ని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసింది. ఆ రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. కశ్మీర్ లోయలోని 75 లక్షల మందికి పైగా ప్రజలను గృహ నిర్బంధితులను చేసింది. బయటి ప్రపంచంతో ఎటువంటి సంబంధాలు లేకుండా వారిపై ఆంక్షలు అమలుపరిచింది. పౌరసత్వ సవరణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందడం ద్వారా భారత గణతంత్రరాజ్యపు మౌలిక సూత్రాలపై బీజేపీ తుది దాడి చేసింది. ఆ బిల్లును ప్రవేశపెట్టడం, పార్లమెంటు ఆమోదం పొందడం కేవలం 72 గంటలలోనే పూర్తయిందంటే నరేంద్రమోదీ, అమిత్ షా ద్వయం తమ లక్ష్య సాధనలో ఎంత వేగంగా ముందుకు దూసుకుపోతుందో అర్థం చేసుకోవచ్చు. ఇంతకూ ఇవి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకులు చేపట్టవలసిన చర్యలేనా? కావు. కజ్జాకోరుల, బెదిరింపులతో వేధించే వ్యక్తుల చర్యలవి. బలవంత పెట్టడం, బెదిరింపులతో హింసించడం, బలహీనులపై దౌర్జన్య పూర్వకంగా పెత్తనం చెలాయించడం ప్రజాస్వామ్య పాలకులు చేయవలసిన పనులేనా? ప్రజాస్వామ్యంలో నిరంకుశాధికారాలు వహించడమేమిటి? నిరంకుశ పాలకులు వివేక వంతమైన సలహాలను వినరు. విరుద్ధ అభిప్రాయాలను, భిన్న దృష్టికోణాన్ని గుర్తించరు, గౌరవించరు. తమ అభిప్రాయాలతో ఎవరైనా విభేదించడాన్ని వారు సహించరు. తాము తప్పుచేయమని భావిస్తారు. తాము చేసిందే సక్రమమైనదని వారు విశ్వసిస్తారు. ఇటువంటి అతిశయపూరిత వ్యవహారశైలి వారికి పరిపాటి. అది వారి సహజ నైజం. అయితే బెదిరింపులకు లోనవడానికి, దౌర్జన్యాలను సహించేందుకు మిమ్ములను మీరు అనుమతించుకోకూడదు కదా. అలా అనుమతించుకోవడమంటే ఆ నిరంకుశ పాలకులు తమ అప్రజాస్వామిక కార్యకలాపాలలో సఫలమవ్వడానికి దోహదం చేయడమే కాదూ? దురదృష్టవశాత్తు అదే జరిగింది. నరేంద్రమోదీ నేతృత్వంలో బీజేపీ రెండో సారి అధికారంలోకి వచ్చిన తరువాత తొలి ఆరు నెలల్లో ప్రతిపక్షాలకు సంభవించిన విపత్కర పరిస్థితులే అందుకు నిండు నిదర్శనాలు.

నరేంద్ర మోదీ, అమిత్ షాల నిరంకుశ వ్యవహారశైలికి ప్రతిఘటన తొలి సంకేతాలు పశ్చిమ బెంగాల్‌లో కన్పించాయి. బీజేపీ తనను ఎంతగా సమస్యల పాలు చేసిందో అంతగా ఆ పార్టీని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సమస్యల పాలు చేశారు, చేస్తున్నారు. మహారాష్ట్రలో శరద్ పవార్ అంతకంటే దృఢమైన కృతనిశ్చయంతో వ్యవహరించారు. ఇటీవలి శాసనసభ ఎన్నికలలో బీజేపీని వెనక్కి నెట్టి వేయడంలో ఘటనాఘటన సమర్థుడు పవార్ సఫలమయ్యారు. తొలుత, సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన మెజారిటీ బీజేపీకి లభించకుండా చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత అధికారంలో కొనసాగేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలను శరద్ పవార్ తన అసమాన రాజకీయ చాతుర్యంతో పూర్తిగా వమ్ము చేశారు. తనకు తిరుగులేదన్న ధోరణితో వ్యవహరిస్తున్న బీజేపీ పవార్ చేతిలో చిత్తయిపోయింది. ఇది, గత వేసవిలో లోక్‌సభ ఎన్నికల అనంతరం బీజేపీకి సంభవించిన మొదటి ప్రధాన ఓటమి.

అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఒక ప్రధాన రాష్ట్రంలో పరిస్థితులు ఇలా వున్న తరుణంలోనే మోదీ ప్రభుత్వం 'పౌరసత్వ సవరణ బిల్లు'ను పార్లమెంటులో ప్రవేశ పెట్టి, ఆమోదం పొందడంలో విజయవంతమయింది. పార్లమెంటులో వివిధ పార్టీలను ఆ బిల్లుకు అనుకూలంగా చేసుకున్నది. అయితే, పార్లమెంటు వెలుపల దేశవ్యాప్తంగా ఆ బిల్లుకు వ్యతిరేకంగా విద్యార్థుల నిరసనాగ్నులు ఉవ్వెత్తున ప్రజ్వరిల్లాయి. మహారాష్ట్ర విజయం, పౌరసత్వ సవరణ బిల్లుపై వ్యతిరేకత జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై నిర్ణయాత్మక ప్రభావాన్ని చూపాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కొత్త ప్రభంజనాల అర్థమేమిటో గ్రహించారు. సమైక్యంగా పనిచేసి విజయం సాధించారు. తత్ఫలితంగానే కేవలం పక్షం రోజుల్లో ( డిసెంబర్ 1224 ) ఈ పురానవ జాతి తన ఆత్మను కనుగొన్నది. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా లేచి నిలబడ్డది.

ఈ దేశం, మన భారత గణతంత్ర రాజ్యం ఇక్కడి నుంచి ఎక్కడకు వెళ్ళనున్నది? నరేంద్ర మోదీ రెండోసారి అధికారంలోకి వచ్చి కేవలం ఏడు నెలలు మాత్రమే గడిచాయి. ఆయన ఇంకా 4 సంవత్సరాల 5 నెలలు అధికారంలో వున్నారు. కనుక సమీప భవిష్యత్తులో న్యూఢిల్లీలో కొత్త పాలకులు రాగలరని భావించలేము. అలాంటి భావనలు, ఊహాగానాలు ప్రజాస్వామ్యయుతమైనవి కావు. మరి ఏమి సంభవించనున్నది? కొంత మంది పరిశీలకుల అభిప్రాయం ప్రకారం మోదీ సర్కార్ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజల ప్రతిఘటన పెరుగుతుంది. ఫలితంగా మోదీ తన విధానాలను మార్చుకోవడం అనివార్యమవుతుంది. ఈ అభిప్రాయాన్ని నేను తిరస్కరించను గానీ పూర్తిగా అంగీకరించలేను. నా అభిప్రాయం ప్రకారం 2020, 2021 సంవత్సరాలలో వివిధ రాష్ట్రాల శాసనసభలకు జరిగే ఎన్నికల ఫలితాలు మోదీ ప్రభుత్వ గమనాన్ని అనివార్యంగా మార్చివేస్తాయి. 2020 జనవరి–ఫిబ్రవరి నెలల్లో ఢిల్లీ శాసనసభకు, అక్టోబర్–నవంబర్ నెలల్లో బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఇక 2021 ఫిబ్రవరి–మార్చిలో జమ్మూకశ్మీర్ లోను, ఏప్రిల్– మే నెలల్లో అసోం, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ శాసనసభలకు ఎన్నికలు జరగనున్నాయి.

ప్రస్తావిత రాష్ట్రాలన్నిటిలోనూ భారతీయ జనతా పార్టీ ఓటమి పాలయ్యే అవకాశాలు వున్నది. బీజేపీ ఒక అజేయ రాజకీయ యంత్రాంగమనే భావనను ప్రజలలోనూ, రాజకీయ పక్షాలలోనూ అమిత్ షా బలంగా సృష్టించారు. బీజేపీకి కొన్ని బలాలు, అనుకూలతలు వున్నమాట నిజమే(పైగా అవి అపార

**2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని ఓడించడమే అంతిమ లక్ష్యం. హిందూ రాష్ట్ర లక్ష్య సాధన పురోగతిని ఆ సంవత్సరంలోగానే నిర్ణయాత్మకంగా అడ్డుకొని తీరాలి. మహా నాయకుడు అబ్రహం లింకన్ 1865లో అమెరికా సంయుక్త రాష్ట్రాల సమైక్యతను కాపాడిన విధంగానే సార్వత్రిక ఎన్నికల సంవత్సరమైన 2024 ఏతెంచేలోగానే భారత రాజ్యాంగాన్ని రక్షించుకుని, భారత ప్రజాస్వామ్యాన్ని మనం పదిలం చేసుకోవాలి.**

ధన బలంతో మరింత సుదృఢమయ్యాయి). అయితే, అన్ని రాజకీయ పక్షాల మాదిరిగానే బీజేపీ కూడా సాధారణ బలహీనతలు, ప్రతికూలతలు, వర్గాలు, ముఠాలు, అసమ్మతిపరులు, తిరుగుబాటు అభ్యర్థులతో సతమతమైపోతున్నది. వీటికి తోడు అధికారంలో వున్న రాష్ట్రాలలో ప్రభుత్వ వ్యతిరేకత వుండనే వున్నది. బీజేపీ గత రెండు నెలల్లో చాలా నష్టాలను చవి చూసింది. హర్యానాలో మళ్ళీ అధికారాన్ని కైవసం చేసుకోగలిగినా ఆ పార్టీ ప్రతిష్ఠ బాగా దెబ్బతిన్నది. మహారాష్ట్రలో అధికారాన్ని కోల్పోయింది. జార్ఖండ్‌లో పరాజయం పాలయింది.

అసెంబ్లీ ఎన్నికలకు వెళ్ళనున్న ప్రతి రాష్ట్రంలోను ప్రజాదరణలో అగ్రగామిగా వున్న పార్టీ వెనుక బీజేపీయేతర పార్టీలన్నీ సమీకృతమయితే ఆ విజయాలను మరింత ముందుకు తీసుకు వెళ్లడం సుసాధ్యమవుతుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే అసోం, కేరళ, పాండిచ్చేరిలో కాంగ్రెస్ వెనుక, తమిళనాడులో డిఎంకె వెనుక బీజేపీయేతర పార్టీలన్నీ సమీకృతమవ్వాలి. బిహార్, పశ్చిమ బెంగాల్‌లలో ఆయా రాష్ట్రాలలోని నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా పార్టీల మధ్య సర్దుబాట్లు జరగాలి. ప్రస్తుతమున్న పరిస్థితులను బట్టి చూస్తే ప్రస్తావిత రాష్ట్రాలు ఏ ఒక్క దానిలోనూ బీజేపీ నిశ్చితంగా విజేత కాబోదు. మన అంతిమ లక్ష్యం 2024 లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని ఓడించడమే. 2024 సంవత్సరంలోగానే హిందూ రాష్ట్ర లక్ష్య సాధన పురోగతిని నిర్ణయాత్మకంగా అడ్డుకొని తీరాలి. మహామనిషి, మహోన్నత నాయకుడు అబ్రహం లింకన్ 1865లో అమెరికా సంయుక్త రాష్ట్రాల సమైక్యతను కాపాడిన విధంగానే సార్వత్రిక ఎన్నికల సంవత్సరమైన 2024 ఏతెంచేలోగానే భారత రాజ్యాంగాన్ని రక్షించుకుని, భారత ప్రజాస్వామ్యాన్ని పదిలం చేసుకోవాలి. అది మన విధ్యుక్త ధర్మం.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

# అంతరించిపోతున్న 2,680 భాషలు

మనిషిని, జంతువు నుంచి వేరు చేసే ఒక కీలక అంశం భాషను మాట్లాడగల గడం. ప్రతి మనిషీ తన సమాజ ఆధర్యంలో ఒక సొంత భాషను కలిగి ఉంటాడు. జంతువుకు అటువంటి భాష లేకపోవడమే మనిషి ప్రత్యేకతను తెలియజేస్తుంది. అందుకే, 'మనిషికో మాట, గొడ్డుకో దెబ్బ' అనే సామెత పుట్టింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విజ్ఞానాన్ని తెలుసుకోవడం, ఒంటబట్టించుకున్న జ్ఞానాన్ని, తన అనుభవాన్ని, సంస్కృతిని, సంప్రదాయాన్ని తరువాతి తరం వారికి అందించడానికీ ఉపకరించేది భాషే. ఆవిధంగా గతానికి, వర్తమానానికి, భవిష్యత్తుకు వారధి కూడా భాషే. పరిణామ క్రమంలో కొత్తకొత్త పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న కొద్దీ భాషను వృద్ధి చెందుతుంది. 'సొంత' భాషల ప్రత్యేకతా హెచ్చుతుంది, ప్రాధాన్యతా పెరుగుతుంది. ఒక సమాజం లేదా సమూహ అస్తిత్వానికీ అది ఆధారంగా ఉంటుంది. ఆ విధంగా భాషకు అపారమైన విలువ ఉంటుంది. కాబట్టే, భాష వినిమయ వస్తువుగా, డబ్బుకంటే ఎక్కువ విలువను సంతరించుకొన్నది.




అయితే, దేశీయ భాషల వాడుక విధానంలో తలెత్తే క్లిష్టమైన పరిస్థితి వాటి వినియోగదారులను నేరుగా ప్రభావితం చేయడం వలన స్థానిక భాషలు కనుమరుగయ్యే పరిస్థితి ఉంది. దానితో స్థానిక భాషలు భయంకరమైన రేటులో కనుమరుగవుతున్నాయి. అంతరించి పోతున్న ఈ భాషలలో చాలా మట్టుకు దేశీయ ప్రజలు ఉపయోగిస్తున్న స్థానిక భాషలే ఉండడం ఆందోళన కలిగించే విషయం. ఐక్యరాజ్యసమితి 2019ని అంతర్జాతీయ దేశీయభాషల సంవత్సరంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రపంచం మొత్తమ్మీద 2019 చివరి నాటికి 2,680 భాషలు అంతరించిపోతున్న భాషల జాబితాలో ఉన్నట్లు ఐక్యరాజ్య సమితి భాషా విభాగపు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రజలు ఇతర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం వలసలు పోతూండడం వల్ల వారు తమ భాషలకు దూరమవుతున్నారు. ఇలాంటి మరికొన్ని కారణాంశాల వల్ల స్థానిక భాషలు అదృశ్యమయ్యే స్థాయికి గానీ లేదా బలహీనపడే ప్రమాదకర స్థాయికి గానీ చేరుతున్నవని ప్రపంచ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. స్వదేశీ భాషలు సరైన స్థాయిలో మనుగడ కొనసాగించాలంటే, ప్రజా విధానాలలో అవసరమైన మార్పులు చోటు చేసుకోవాలి. దేశీయ భాషలకు ప్రచారం కల్పించాలి. భాషల మనుగడ అనేది భాషా వినియోగదారుల శ్రేయస్సు, రాజకీయ ప్రభావం, స్థానిక భాషలు మాట్లాడే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఈ భాషా విధానాలు దేశీయ ప్రజలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా శక్తి మంతం చేసే సామాజిక విధానాలతో పరిపూర్ణం చేయాలి. తద్వారా వారు తమ భాష, సంస్కృతిని వదులుకోకుండా, ఆర్థిక అవసరాల కోసం వలస పోకుండా జీవనోపాధిని సుస్థిరం చేసుకోగలుగుతారు. భారత్‌లాంటి దేశాల్లో రాజకీయ ప్రభావాల కారణంగా సామాజిక విధానాలు పరిపూర్ణం కాకుండా ఉండడం వల్ల ప్రజలు వలసలు పోతూ, స్వదేశీ భాషలు కనుమరుగు కావడానికి కారణమవుతున్నారు. స్వదేశీ భాషలు మాట్లాడే వారిపై విదేశీ భాషలపై ఆధారపడిన వారు వివక్షాపూరితంగా వ్యవహరించడం వల్ల కూడా స్థానిక భాషలు అంతరించిపోతున్నాయి. తల్లిదండ్రులు, పెద్దలు తమ పిల్లలకు స్వదేశీ భాషలను నేర్పించే విషయంలో శ్రద్ధ వహించకపోవడమే కాకుండా, పరాయి భాషపై మోజు పెంచే విధంగా వ్యవహరిస్తూ, స్వదేశీ భాషలను చిన్న చూపు చూస్తున్నారు. రాజకీయాలు, చట్టం, న్యాయం, సాంస్కృతిక పద్ధతులు, విద్య, ఉద్యోగాలు, సమాచార మార్పిడి, సామాజిక జీవితం, స్థిరమైన అభివృద్ధిలో విస్తృత భాగస్వామ్యం కల్పించకపోవడం వంటి పరిస్థితులూ దేశీయ భాషలు అంతరించిపోవడానికి కారణాలుగా ఉన్నాయి. ఈ పరిస్థితులను గమనించి ప్రజలు, ప్రభుత్వాలు తగు విధంగా ప్రవర్తనలు, విధానాలు సరిదిద్దుకుంటేనే మాతృ భాషలను రక్షించుకోగలుగుతాం.

■ పోలుమాటి రాంబాబు

# మృణ్మయ పాత్రలు చేసిన చేతులివి ..



వినబడినా వినబడని శ్రావణం ముందు
శంఖమెలా ఊదాలి
వినికిడి లేనితనానికి కూడా
వినబడాలంటే
చెవి దగ్గర శబ్దమెలా చెయ్యాలి

మోటవేసి తడి తగిలినా
మూట బతుకుల మూలాల ధార
కనబడలేదనే వాడికి
ఈ మట్టిలోనే ఇంకిన రక్తపు
ఆనవాళ్ళనెలా సాక్ష్యాలుగా చూపించాలి

తిరస్కరిద్దామనుకుంటున్నావేమో ...
నా ఉనికిలైన్లో నిలబడిన కణోజు
పోగుల కాగితం ముక్క కాదు
నిన్నా మొన్నటి దాకా శూద్ర
శూద్రాతిశూద్ర పంచముడంటూ
ఉత్తమపురుష ఏకవచన
సర్వనామ రూపంలో
నాపై పెట్టిన గీట్ల ఆనవాళ్ళు
మర్చిపోయావేమో

కల్లోలం పుట్టుకొచ్చిన ప్రతీసారీ
కల్లాకపటం లేని దేశంలా నేనెందుకు
తగలబడాలీ !
నేనేమన్నా రామమందిరాన్నా
మసీదుల పునాదుల్లో ఆధారాలు
వెదకడానికీ !
అస్సాములో ఒక చిన్న అచ్చుతప్పునా
పౌరసత్వం గుంజుకుపోడానికీ !

రాముడినీ నేనే రహీమునీ నేనే
నేతన్నను నేనే కేశాలంకరణ చేసేది నేనే
జాతికి పట్టిన మురికిని కడిగే
వాషర్మన్‌ను నేనే
దేశీయుల మలాన్ని చేతుల్తో
ఎత్తిందీ నేనే
వేటమాంసాన్ని ముక్కలుగా
కొట్టిందీ నేనే
ఏ కాగితాలూ అక్కరలేని
భారతీయుడినీ నేనే

ఉంటే లిక్కిపోతే కొడవలిని ..
ఎద్దును ఒంటిచేత్తో కోసి
చూపించమంటావా
చేతులతో మృణ్మయ పాత్రలు
చేయమంటావా
పచ్చ జంట ముందు కర్ర సాము చేసి
లోకలోడ్నని నిరూపించమంటావా

ఎవడ్రా నువ్వు!
రోజంతా భారతీయులను
ముక్కలుగా విడగొట్టి
సాయంత్రానికి భారత్ మాతాకీ
జై అంటూ
నామూలాలే ప్రశ్నిస్తావ్ ...

– తుల్లిమల్లి విల్సన్ సుధాకర్

# ద్రౌపది దత్త పుత్రిక?

ద్రోణుడు తనకు చేసిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోడానికి ద్రుపదుడు రెండు రకాల ఆలోచనలు చేసినట్టు తెలుగు భారతం చెబుతోంది. మొదటిది, ద్రోణుని చంపగల కొడుకును పొందడం. రెండవది, అర్జునునికి భార్య కాగల కూతురుని పొందడం. మొదటి కోరికలో కేవలం ప్రతీకారేచ్ఛ ఉంటే, రెండో కోరికలో ముందుచూపు కలిగిన రాజకీయవ్యూహం ఉంది. అర్జునుని వరించగల కూతురిని పొందడమంటే, పాండవులతో బంధుత్వం ద్వారా వారిని ద్రోణుడికి వ్యతిరేకంగా తనవైపు తిప్పుకోవడమే.

**గ్రీకు సమాజం గణదశనుంచి పౌరదశకు మళ్లడంలో గణసంబంధ ఆచారాలు, అలవాట్ల స్థానే కొత్త శాసనాలు తయారుచేసుకోవలసి వచ్చింది. ఆధునిక భారతదేశంలో మన అనుభవం కూడా ఇలాంటిదే. వివిధ మతాలు, భాషలు, ఆచారాలు, అలవాట్లు ఉన్న ఈ దేశప్రజలను ఒక జాతిగా నిర్మించే ప్రయత్నంలో మన దగ్గరా ఇలాంటి శాసననిర్మాణం జరిగింది, ఇంకా జరుగుతోంది. వ్యక్తిగత చట్టాల(పర్సనల్ లా)స్థానే ఉమ్మడిపౌర స్మృతిని నొక్కి చెప్పడం ఒక ఉదాహరణ.**

ద్రుపదుడి రెండు కోరికలనూ మనుష్యధర్మం నుంచి లేదా మనుష్య స్వభావం నుంచి అర్థం చేసుకుందాం. భార్య ద్వారా సహజమార్గంలో కొడుకును, కూతురిని కని ద్రోణుడిపై ప్రతీకారం తీర్చుకోవాలని అతడు అనుకునే అవకాశం లేదు. అలా కలిగే సంతానం సరిగ్గా ఒక కొడుకు, ఒక కూతురే అవుతారని ఎలా చెబుతాం? ఒకవేళ అయినా, ఆ కొడుకు ద్రోణుని చంపగలిగినవాడూ, కూతురు అర్జునుని వరించగలిగినదీ అవుతారన్న నమ్మకం ఏమిటి? ఆవిధంగా అది చీకట్లో రాయి విసరడం లాంటిది. దానికితోడు, వారు పుట్టి, పెరిగి తన ప్రతీకార సాధనకు ఉపయోగపడడం ఎంతో ఓపికతో ఎదురుచూడాల్సిన దీర్ఘ కాలిక ప్రణాళిక.

ప్రతీకారేచ్ఛతో ఉన్న ద్రుపదుడు అంతవరకూ వేచి చూడడం కష్టం. ఇంకో కోణం నుంచి చూస్తే, నిజానికి ద్రుపదుడు అంత కాలం వేచి చూడాల్సిన అవసరం లేదు. రాజు తన రాజ్యంలో, లేదా తన గణంలో లేదా తెగలో ఉన్న జనం అందరికీ తండ్రి కనుక; ద్రోణుని చంపగల శౌర్యసాహసాలు ఉన్న ప్రతి యువకుడూ ద్రుపదుడికి కొడుకే అవుతాడు, అర్జునుని వరించగల ప్రతి అమ్మాయీ కూతురే అవుతుంది. ఒకవేళ తన రాజ్యంలో లేదా తన గణంలో అలాంటివారు లేనప్పుడు వేరే రాజ్యం నుంచీ, లేదా వేరే గణం నుంచి అతను దత్తు చేసుకోవచ్చు.

ఈ సందర్భంలో దత్తు గురించి కొంచెం వివరంగా తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉంటుంది. దత్తు గణసమాజకాలంనుంచీ వస్తున్న ప్రక్రియ. మోర్గన్ తన 'పురాతన సమాజం'లో వివరించిన ప్రకారం, అమెరికా ఆదివాసులలో దత్తత స్వీకారం ఇలా ఉంటుంది: దత్తు చేసుకుని కొత్తవారిని సభ్యులుగా తీసుకునే హక్కు గణానికి ఉంటుంది. యుద్ధంలో పట్టుబడిన వారిని చంపడమో, దయదలచి ఏదైనా గణంలోకి దత్తు తీసుకోవడమో చేసేవారు. దత్తులకు కూడా గణహక్కులన్నీ లభిస్తాయి. వారిని సొంత మనుషులుగానే చూస్తారు. అన్న, తమ్ముడు, అక్క, చెల్లెలు, తల్లి, తండ్రి వగైరా వరసలే వారికి ఇస్తారు. మొదట్లో, అనాగరిక యుగం తొలి దశలో యుద్ధఖైదీలను బానిసలుగా చేసుకునేవారు. మలిదశలోని ఆదివాసులలో బానిసలు లేరు. అంటే, యుద్ధఖైదీలను దత్తు చేసుకునేవారన్న మాట.

దత్తు తంతులో భాగంగా, జనం రెండు వరసల్లో ఒకరి ఎదురుగా ఒకరు నిలబడతారు. వారి చేతుల్లో కర్ర, లేదా కొరడా లాంటివి ఉంటాయి. దత్తు కాబోయేవారు ఆ రెండు వరసల మధ్య నడుస్తూ వారితో దెబ్బలు తింటారు. దీనిని గాంట్ లెట్ (gauntlet) అంటారు. పట్టుబడిన ఖైదీలనో, లేదా ఇతర గణాలకు చెందినవారినో ఇలా దత్తు చేసుకుని, వారికి గణంలో చనిపోయినవారి స్థానమిచ్చి సంఖ్యను భర్తీ చేసుకుంటారు. గణంలో సభ్యుల సంఖ్య తగ్గిపోతున్నప్పుడు కూడా దత్తు ద్వారా సంఖ్య పెంచుకుంటారు ఒక దశలో సెనెకాలలో డేగ గణం వారి సంఖ్య తగ్గిపోయి అది అంతరించేలా ఉన్నప్పుడు తోడేలు గణం నుంచి పెద్ద సంఖ్యలో జనాన్ని దత్తు చేసుకున్నారు. ఇందుకు రెండు గణాలూ సమ్మతించాయి.

ఇరాక్వాలలో తెగసమితి సమావేశంలో దత్తు జరుగుతుంది. అది మతకర్మరూపం తీసుకుంటుంది. సమితి సమావేశమయ్యాక, దత్తు చేసుకోబోతున్న వ్యక్తి ఏ గణం వాడో, అతని పేరేమిటో, అతను ఎలాంటివాడో, అతన్ని ఎందుకు దత్తు చేసుకుంటున్నారో, అతనికి పెట్టబోయే పేరేమిటో సమితి నాయకులలో ఒకరు చెబుతారు. ఆ తర్వాత ఇద్దరు నాయకులు అతని రెండు చేతులూ పట్టుకుని దత్తత పాట పాడుతూ సమావేశభవనంలో ఈ చివరినుంచి ఆ చివరివరకూ నడుస్తారు. మిగతా జనం ప్రతి చరణం చివరా పల్లవి ఎత్తుకుంటారు. పాట చరణాలు అన్నీ పూర్తయ్యేవరకూ సమావేశభవనంలో ఈ చివరినుంచి ఆ చివరి వరకూ మూడు చుట్లు చూడతారు. దాంతో దత్తు పూర్తవుతుంది.

ఒక్కోసారి ఇతరులను అభిమాన సూచకంగా దత్తు చేసుకోవడమూ జరుగుతుంటుంది. సెనెకాలలో డేగగణం వారు తనను అలాగే దత్తు తీసుకున్నారని మోర్గన్ అంటాడు.




దత్తు తీసుకోవడం ఇప్పుడు వ్యక్తిగత విషయంగా మారిపోయింది. ఉదాహరణకు, పిల్లలు లేనివారు ఎవరినైనా దత్తు చేసుకోవచ్చు; అలాగని చేసుకుతీరాలనీ లేదు. స్వచ్ఛందసంస్థలవారు గ్రామాలనో, వెనకబడిన జిల్లాలనో దత్తు చేసుకుంటూ ఉంటారు. ఇవన్నీ స్వచ్ఛందాలు. కానీ, గణసమాజంలో ఒక దశలో దత్తత అవసరంగానూ, అనివార్యంగానూ మారి, సమాజనిర్మాణంలో భాగమైంది. అది గణం నుంచి ప్రజలకు, లేదా పౌరులకు మారుతున్న దశ. గ్రీకులలో ఆ దశ గురించి మోర్గన్ చర్చించాడు.

మనం క్రూరమైన చట్టాలను డ్రాకోనియన్ (Draconian) చట్టాలు అంటాం. డ్రాకో (Draco: క్రీ.పూ. 624) అనే వ్యక్తి గ్రీకు తెగలలోని ఎథీనియన్ల కోసం చేసిన కఠిన చట్టాల కారణంగా ఆ పేరు వచ్చింది. అంటే, అప్పటికి గణం తాలూకు ఆచారాలు, అలవాట్ల స్థానే లిఖిత శాసనాలు తయారు చేసుకోవలసిన స్థాయికి గ్రీకులు పెరిగారన్న మాట. చట్టాల అవసరమైతే కలిగింది కానీ, చట్టాలు చేసే నేర్పు మాత్రం అప్పటికింకా పట్టుబడలేదు. ఆ తర్వాత థీసియస్ (Theseus: ఇతని తేదీ తెలియదు), సోలన్ (Solon: క్రీ.పూ. 594), క్లైస్తనీస్(Cleisthenes: క్రీ.పూ. 509) అనే ముగ్గురు ఈ పరివర్తనలో ముఖ్యపాత్ర పోషించారు. క్లైస్తనీస్ నాటికి ఈ పరివర్తన ఒక కొలిక్కి వచ్చింది. నేటి ప్రజాస్వామిక పాలనా వ్యవస్థకు రూపునిచ్చినది ఇతనే. అత్తికా అనే ప్రాంతాన్ని ఇతను నూరు డెమో (Demoపట్టణం)లుగా విభజించాడు. ఆ పట్టణంలో ఉన్నపౌరులందరూ డెమోలు. వారు తమ పేర్లను, ఆస్తుల వివరాలను నమోదు చేసుకోవాలి. అప్పుడే వారికి పౌరహక్కులు లభిస్తాయి. డెమోలకు స్థానిక స్వపరిపాలనాధికారం ఉంటుంది. వీరొక 'డెమార్క్' ను ఎన్నుకుంటారు. ఈ డెమో అన్న మాటనుంచే డెమోక్రసీ అనే మాట వచ్చింది.

గణం నుంచి పౌరసత్వానికి మళ్లడం గురించి ఇలా నాలుగు వాక్యాలలో చెప్పుకున్నాం కానీ, ఈ మార్పు రావడానికి కొన్ని శతాబ్దాలు పట్టింది. అందుకు ఎంతో తెలివీ, అనుభవమూ అవసరమయ్యాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, గణవ్యవస్థ అనే తల్లిని శిథిలం చేసి పౌరవ్యవస్థ అనే శిశువు పుట్టింది. గణ నిర్మాణమూ, గణస్వభావమూ, గణానికి గల పరిమితులే దీనికి కారణం. గణం అనేది ఒక వ్యక్తి అనుకుంటే, గణసభ్యులందరూ ఆ వ్యక్తికి గల వివిధ అవయవాల వంటివారు. వ్యక్తికి విడిగా అవయవాలకు ఉనికి లేనట్టే, గణం బయట గణసభ్యులకు ఉనికి ఉండదు. అదసలు ఊహకే అందని విషయం. చెరువులోని చేపలు గట్టు మీద ఎలా బతకలేవో గణసభ్యులు కూడా గణం వెలుపల బతకలేరు.

కానీ, పైన చెప్పిన సోలన్ కు ముందు గ్రీకు తెగలలో పెద్ద సంక్షోభం తలెత్తింది. గణదశలో ఉన్న జనం తప్పనిసరై ఉన్న చోటు వదిలి దూరప్రాంతాలకు పోవలసివచ్చింది. వ్యక్తులలోని సాహసప్రవృత్తి, వర్తక వాణిజ్యాలు, యుద్ధాలు మొదలైనవి ఇందుకు కారణమయ్యాయి. దాంతో వీరికి సొంత గణాలతో సంబంధాలు తెగిపోయాయి. మరో గణంతో సంబంధం ఏర్పడలేదు. ఆ విధంగా వీరు ఏ గణంతోనూ సంబంధం లేకుండా త్రిశంకుస్థితిలో ఉండిపోవలసివచ్చింది. క్రమంగా వీరి సంతానం పెరిగింది. ఏ గణంతోనూ సంబంధం లేకపోవడమంటే ప్రభుత్వ పరిధిలోకి రాకపోవడమే. ప్రభుత్వ పరిధిలోకి రాని వారికి గుర్తింపు, గౌరవమే కాదు; ఉపాధి హక్కు, మత హక్కు, సహజవనరులలో భాగస్వామ్యంతో సహా ఏమీ ఉండవు. అది చావుతో సమానం. ఆయా గణాలవారు దయదల్చి వీరిని తమలో చేర్చుకోవడమే దీనికి పరిష్కారం. అక్కడ వచ్చింది దత్తతకు ప్రాధాన్యం.

గణాలకు గణాలు (లేదా కుటుంబాలకు కుటుంబాలు) తరలి వస్తే, ఒక గణంగా వారిని తెగలలోకి చేర్చుకోవచ్చు. వ్యక్తులుగా వస్తే దత్తు చేసుకోవడమే మార్గం. అందులో కూడా మళ్ళీ తేడాలు ఉన్నాయి. పేరు ప్రతిష్ఠలు, ఆస్తి ఉన్నవారికి దత్తత ద్వారా గణంలో సభ్యత్వం తేలిగ్గా లభించవచ్చు. కానీ పేదలకు అది కష్టమవుతుంది. గ్రీసులో క్రమంగా అలాంటి వారి సంఖ్య పెరిగిపోయి పెద్ద సంక్షోభానికి దారి తీయించింది. ఆ సంక్షోభాన్ని పరిష్కరించుకునే ప్రయత్నంలోనే గణవ్యవస్థ నుంచి పౌరవ్యవస్థ పుట్టింది. అప్పటి ఆ ప్రయోగాలే నేటి ప్రజాస్వామికనిర్మాణాలకు మాతృకలయ్యాయి. నేటి పార్లమెంటు ఎగువసభ, దిగువసభ మొదలైనవి ఆ ప్రయోగాలనుంచి పుట్టినవే.

**రాజు తన రాజ్యంలో, లేదా తన గణంలో లేదా తెగలో ఉన్న జనం అందరికీ తండ్రి కనుక; ద్రోణుని చంపగల శౌర్యసాహసాలు ఉన్న ప్రతి యువకుడూ ద్రుపదుడికి కొడుకే అవుతాడు, అర్జునుని వరించగల ప్రతి అమ్మాయీ కూతురే అవుతుంది.**

గ్రీకు సమాజం గణదశనుంచి పౌరదశకు మళ్లడంలో గణసంబంధ ఆచారాలు, అలవాట్ల స్థానే కొత్త శాసనాలు తయారుచేసుకోవలసి వచ్చిందని పైన చెప్పుకున్నాం. ఆధునిక భారతదేశంలో మన అనుభవం కూడా ఇలాంటిదే. వివిధ మతాలు, భాషలు, ఆచారాలు, అలవాట్లు ఉన్న ఈ దేశప్రజలను ఒక జాతిగా నిర్మించే ప్రయత్నంలో మన దగ్గరా ఇలాంటి శాసననిర్మాణం జరిగింది, ఇంకా జరుగుతోంది. వ్యక్తిగత చట్టాల(పర్సనల్ లా)స్థానే ఉమ్మడిపౌర స్మృతిని నొక్కి చెప్పడం ఒక ఉదాహరణ. గణదశనుంచి పౌరదశకు మళ్లడంలో గ్రీకుల అనుభవాన్ని మనకూ వర్తింపజేసుకోవచ్చు. అందులో మరింత ఆసక్తికరం ఏమిటంటే, మన వర్ణ, లేదా కులవ్యవస్థ చరిత్రనూ దాని నుంచి పునర్నిర్మించుకోవచ్చు.

*(కల్లూరి భాస్కరం రచన 'మహాభారతం మన చరిత్రే' నుంచి కొంత భాగం ఇది. ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ బుక్ ఫెయిర్ (ఎన్టీఆర్ స్టేడియం)లో ఈ పుస్తకం ఆవిష్కరణ)*

# అలాంటి భావాలు తొలగిపోవాలి!

## పదమూడో పాశురం

పుళ్ళిన్ వాయ్ కీణ్డానైప్పొల్లా వరక్కనై
క్కిళ్ళి క్కళై న్దానై క్కీర్తిమై పాడిప్పోయ్,
ప్పిళ్ళైగళ్ ఎల్లారుమ్ పావైక్కళమ్ పుక్కార్,
వెళ్ళి యెళున్దు వియాళము ఉరంగిత్తు!
పుళ్ళుమ్ శిలుంబినకాణ్! పోదు అరిక్కణ్ణినాయ్!
కుళ్ళ క్కుళిర క్కుడైన్దు నీరాడాదే,
పళ్ళిక్కిడత్తియో? పావాయ్! నీ నన్నాళాల్
కళ్ళమ్ తవిర్న్దు కలన్దు ఏల్ ఓర్ ఎంబావాయ్

తిరుప్పావై


ప్రముఖ చిత్రకారుడు బాపు బొమ్మ

**భావం:** ఈనాటి గోపిక సుందరమైన కనులున్నది. ఆ నేత్రాలకు శ్రీకృష్ణుడు వశమవుతాడు. ఆమె ద్వారా కృష్ణుడు తమకు వశమవుతాడన్న ఆశతో ఆమెను గోపికలు మేలుకొలుపుతున్నారు. "కొంగ రూపంలో వచ్చిన బకాసురుని చంపిన కృష్ణుణ్ణీ, రాక్షస రాజు రావణాసురుని అవలీలగా హతమార్చిన శ్రీరాముణ్ణీ స్తోత్రం చేస్తున్నాం. మన తోటివారందరూ వ్రతం ఆచరించడానికి నిర్దేశించిన వేదికకు చేరుకున్నారు. శుక్ర నక్షత్రం ఉదయించింది. బృహస్పతి (గురుడు) నక్షత్రం అస్తమించింది. వీరిలో ఒకరు సంజీవని విద్య కలవాడు. మనం కూడా ఆ విద్యను పొందాలి. మరొకరు నాస్తిక విద్యను కడతేర్చారు. మనలో కూడా ఆ భావాలు తొలగిపోవాలి. ఆహారం కోసం అరుస్తూ పక్షులు బయలుదేరాయి. లేడి కన్నుల వంటి సౌందర్యం కలదానా! తాపం తొలగిపోయేలా చల్లని మడుగులో మునిగి స్నానంచేయకుండా, ఇంకా శయ్యపైనే నిద్రిస్తున్నావా? మృదుస్వభావం కలిగినదానా! శయ్యను విడిచి రా! ఇంతటి మంచి రోజు భగవంతుణ్ణి పొందడానికి యోగ్యమైనది. రావమ్మా, రా! లేచి వచ్చి మాతో కలువు. భవ్యమైన ఈ వ్రతంలో పాలు పంచుకో!" అని గోపికలు పిలుస్తున్నారు.

● ఎ. సీతారామారావు

---

ఆహారం - ఆరోగ్యం



# న్యూ ఇయర్... బేఫికర్!

కొత్త సంవత్సరం వస్తుందంటే కొత్త అధ్యాయాన్ని ఆహ్వానిస్తూ, సరికొత్త నిర్ణయాలు తీసుకుంటాం. అందులో చాలా వరకూ పాటిస్తాం కూడా. ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించి, సులువుగా మార్చుకోదగ్గవి. ఆరోగ్యమే మహాభాగ్యం. చక్కటి ఆరోగ్యానికి అవసరమయ్యేవి ఆహారం, వ్యాయామం. సో... ఈ నూతన సంవత్సరంలో మీరు తీసుకోవాల్సిన నిర్ణయాలు ఇవే...

- వైట్ రైస్ తినాలంటే భయపడకండి. అందులో ఒక భాగం చిరుధాన్యాలు లేదా పైపొర తొలగించని ధాన్యాలు కలపండి. దానివల్ల సమతుల ఆహారం అందుతుంది.
- మూడు పూటలా నిరభ్యంతరంగా భోజనం చేయండి. కానీ తక్కువ మోతాదులో తీసుకోండి. రెండు ముద్దలు తగ్గిస్తే ముద్దుగా తయారవుతారు.
- నాన్ వెజ్ మానెయ్యాలా... వద్దా? అనే ఆలోచన పక్కనపెట్టండి. వారంలో 2-3సార్లు నాన్‌వెజ్ తినొచ్చు. ఒకవేళ నాన్‌వెజ్ వద్దు అనుకుంటే మానెయ్యండి. ప్రొటీన్ సరిపోదు అనే బెంగ అక్కర్లేదు. వెజిటేరియన్ ప్రొటీన్ సమృద్ధిగా దొరికే ఆహార ప్రణాళిక డైటీషియన్‌ను సంప్రదించి పాటించండి.
- అతిగా ఫ్యాట్, ఆయిల్ వద్దు. వేరే దేశంలో తయారయ్యే నూనె వాడాల్సిన అవసరం లేదు. స్థానికంగా దొరికే నూనే వాడండి. అదే మన జీన్స్‌కు సరిపడుతుంది. శరీరం ప్రిజర్వ్ అవుతుంది.
- షుగర్ చూసి భయపడొద్దు. 1-2 టేబుల్ స్పూన్లు కేవలం 30 క్యాలరీలు ఇస్తాయి. వీటిని బర్న్ చేయడానికి 30 నిమిషాల వర్కవుట్ చాలు. అయితే మీరు భయపడాల్సింది స్వీట్స్, ఆల్కహాల్ గురించి. వీటిని కట్ చేయండి.
- ఐస్‌క్రీమ్స్ తినాలంటే ఫ్రూట్‌తో కలపండి. ఒక మీల్ అయిపోతుంది.
- రోజూ 30 నిమిషాలు వ్యాయామం బోర్‌గా ఉంటే, భోజనానికి ముందు 10 నిమిషాలు స్పీడ్ వాక్ చేయండి. హార్ట్ రేటు పెంచాలి. అప్పుడు ఆ 10 నిమిషాల బెనిఫిట్ మీకు వస్తుంది. భోజనం చేయడానికి ముందు 10 నిమిషాలు స్పీడ్ వాక్ లేదా వేగంగా 20 గుంజీలు తీయాలి.
- వారానికి ఒక్కసారి పండ్లు, కూరగాయలు తింటూ గడిపేయండి. దాంతో కాలేయానికి విశ్రాంతి దొరకుతుంది. ఒంట్లోని అదనపు నీరు బయటకు పోతుంది. ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. పొట్ట శుభ్రమవుతుంది. శరీరం తేలికపడుతుంది. గ్లో వస్తుంది. ఆరోగ్యంగా ఉంటారు.
- వారానికి ఒక్కసారి కనీసం 5 కి.మీ నడవండి. కొత్తప్రదేశాల్లో, తాజాగాలి పీల్చుకుంటూ కొంచెం ఎండ ఉండే సమయంలో మొదలెట్టండి. విటమిన్ డి తయారుచేసుకోవడానికి మీ శరీరానికి అవకాశం ఇవ్వండి. ఒకసారి తయారైన విటమిన్ డి కొన్ని రోజులు నిల్వ ఉంటుంది. కాబట్టి వారానికి ఒక్కసారి ఎండకు ఎక్స్‌పోజ్ అవ్వండి. అలాగే కాల్షియం కూడా నిల్వ ఉంటుంది.
- జీర్ణాశయంలో మంచి బ్యాక్టీరియా తగ్గకుండా ప్రతిరోజు మజ్జిగ తాగండి. పులిసిన పదార్థాలు, పండ్లు, కూరగాయలు, రెగ్యులర్‌గా తినండి.



● **డాక్టర్ బి.జానకి,** న్యూట్రిషనిస్ట్
drjanakibadugu@gmail.com

---

**నూతన సంవత్సరానికి గ్రాండ్‌గా స్వాగతం చెప్పేందుకు అంతా సిద్ధమవుతున్న వేళ... 31 రాత్రి పార్టీకి ఏమేం రెడీ చేయాలనే చర్చ సహజంగానే చక్కర్లు కొడుతుంది. మెయిన్ కోర్సు ఎలా ఉన్నా స్టార్టర్స్ మాత్రం అదిరిపోవాల్సిందే అంటారంతా. కబాబ్స్, ఫ్రైడ్ చికెన్, చాప్స్, వింగ్స్... ఈ 'పార్టీ స్టార్టర్స్' ఒక్కసారి రుచిచూస్తే న్యూఇయర్ పార్టీ సూపర్‌హిట్టే!**



## తంగ్డీ కబాబ్

**కావలసినవి**

చికెన్ డ్రమ్‌స్టిక్స్ - అరకిలో, పెరుగు - ఒక కప్పు, అల్లంవెల్లుల్లి పేస్టు - ఒక టేబుల్‌స్పూన్, ఉప్పు - రుచికి తగినంత, కారం - ఒక టీస్పూన్, గరంమసాలా - ఒక టీస్పూన్, ధనియాల పొడి - ఒక టీస్పూన్, పచ్చిమిర్చి - నాలుగు, కొత్తిమీర - ఒక కట్ట, నిమ్మకాయ - ఒకటి, ఉల్లిపాయలు - రెండు.

**తయారీ**

- ఒక పాత్రలో చికెన్ డ్రమ్‌స్టిక్స్ తీసుకుని పెరుగు, అల్లంవెల్లుల్లి పేస్టు, ఉప్పు, కారం, గరంమసాలా, ధనియాల పొడి, తరిగిన పచ్చిమిర్చి, కొత్తిమీర తురుము వేసి బాగా కలియబెట్టి నాలుగైదు గంటల పాటు పక్కన పెట్టాలి.
- ఒక పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక చికెన్ డ్రమ్‌స్టిక్స్‌ను నెమ్మదిగా పేర్చినట్టుగా వేసి మూత పెట్టి పెద్ద మంటపై ఐదు నిమిషాలు ఉడికించాలి.
- తరువాత మూత తీసి డ్రమ్‌స్టిక్స్‌ను తిప్పి మరో మూడు నిమిషాల పాటు ఉడికించాలి.
- చివరగా నిమ్మరసం పిండుకుని, ఉల్లిపాయలతో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవాలి.

## పాంకో ఫ్రైడ్ చికెన్



**కావలసినవి**

చికెన్ - అరకిలో, కోడిగుడ్లు - రెండు, అల్లంవెల్లుల్లి పేస్టు - ఒక టేబుల్‌స్పూన్, పిండి - పావు కప్పు, మిరియాల పొడి - కొద్దిగా, ఉప్పు - రుచికి తగినంత, బ్రెడ్ ముక్కల పొడి - కొద్దిగా, నూనె - సరిపడా.

**తయారీ**

- ముందుగా చికెన్‌ను శుభ్రంగా కడిగి పెద్ద పెద్ద ముక్కలుగా కట్ చేసుకోవాలి.
- ఒక పాత్రలో చికెన్ ముక్కలు తీసుకొని, కోడిగుడ్లు, అల్లంవెల్లుల్లి పేస్టు, పిండి, మిరియాల పొడి, తగినంత ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని గంటపాటు పక్కన పెట్టాలి.
- తరువాత చికెన్ ముక్కలకు బ్రెడ్ ముక్కల పొడి అంటిస్తూ పక్కన పెట్టుకోవాలి.
- ఒక పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక అందులో చికెన్ ముక్కలు వేయాలి.
- చిన్నమంటపై అవి గోధుమ రంగులోకి మారే వరకు ఫ్రై చేయాలి. వేడివేడిగా సర్వ్ చేసుకుంటే టేస్టీగా ఉంటాయి.

# పార్టీ స్టార్టర్స్

## మటన్ చాప్స్



**కావలసినవి**

మటన్ - ముప్పావు కిలో, నూనె - నాలుగు టేబుల్‌స్పూన్లు, లవంగాలు - నాలుగైదు, మిరియాలు - కొన్ని, యాలకులు - నాలుగు, దాల్చినచెక్క - ఒక ముక్క, ఉల్లిపాయలు - నాలుగు, అల్లంవెల్లుల్లి పేస్టు - ఒకటిన్నర టేబుల్‌స్పూన్, పచ్చిమిర్చి - రెండు, పసుపు - కొద్దిగా, కారం - ఒక టీస్పూన్, నిమ్మకాయ - ఒకటి, టొమాటో ప్యూరీ - అరకప్పు, గరంమసాలా - ఒకటిన్నర టీస్పూన్, పెరుగు - అరకప్పు, పుదీనా - ఒక కట్ట.

**తయారీ**

- పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక లవంగాలు, దాల్చినచెక్క, యాలకులు, మిరియాలు వేసి వేగించాలి.
- తరువాత ఉల్లిపాయలు వేయాలి. కాసేపయ్యాక మటన్ ముక్కలు, అల్లంవెల్లుల్లి పేస్టు వేసి కలిపి మూత పెట్టి నాలుగైదు నిమిషాలు ఉడికించాలి.
- ఇప్పుడు పచ్చిమిర్చి, పసుపు, కారం, నిమ్మరసం వేసి కలియబెట్టాలి. మూతపెట్టి పావుగంట ఉడికించాలి.
- టొమాటో ప్యూరీ వేసి మరికాసేపు ఉడకనివ్వాలి. గరంమసాలా, తగినంత ఉప్పు, పుదీనా, పెరుగు వేసి కలపాలి.
- కాసేపు ఉడికిన తరువాత చివరగా కొత్తిమీర వేసుకుని దింపుకొని వేడివేడిగా సర్వ్ చేసుకోవాలి. వీటి రుచికి ఎవరైనా వహ్వా అనాల్సిందే.

## చికెన్ వింగ్స్



**కావలసినవి**

చికెన్ వింగ్స్ - అరకిలో, ఉల్లిపాయలు - రెండు, టొమాటోలు - మూడు, క్యాప్సికం - ఒకటి, అల్లంవెల్లుల్లి పేస్టు - ఒకటిన్నర టీస్పూన్, పసుపు - ఒక టీస్పూన్, కారం - ఒక టీస్పూన్, ధనియాలపొడి - ఒకటిన్నర టీస్పూన్, జీలకర్ర - ఒకటిన్నర టీస్పూన్, ఎండుమిర్చి - మూడు, జీలకర్రపొడి - అర టీస్పూన్, నిమ్మరసం - ఒకటి, ఉప్పు - రుచికి తగినంత, నూనె - సరిపడా.

**తయారీ**

- పాన్‌లో నూనె వేసి కాస్త వేడి అయ్యాక చికెన్ వింగ్స్ వేయాలి. అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, కారం, ధనియాల పొడి, జీలకర్రపొడి, తగినంత ఉప్పు వేసి నెమ్మదిగా కలియబెట్టాలి.
- వింగ్స్ ఫ్రై అవుతున్న సమయంలో కావాలంటే మరి కొద్దిగా నూనె పోయవచ్చు.
- మసాలా తయారీ కోసం మరొక పాన్‌లో నూనె వేసి ఎండుమిర్చి, జీలకర్ర, ధనియాలు వేసి వేగించాలి.
- ఇప్పుడు ఫ్రై చేసి పెట్టుకున్న చికెన్ వింగ్స్ వేసి కలపాలి. ఉల్లిపాయలు వేసి మరికాసేపు వేగించాలి.
- టొమాటో ముక్కలు వేయాలి. క్యాప్సికం ముక్కలు, నిమ్మరసం, కొద్దిగా నీళ్లు పోసి మరికాసేపు ఉడికించాలి.
- చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని వేడి వేడిగా సర్వ్ చేసుకోవాలి.

## చికెన్ సాటే



**కావలసినవి**

చికెన్ - పావుకిలోవవవ, అల్లంవెల్లుల్లి పేస్టు - ఒక టేబుల్‌స్పూన్, పసుపు - చిటికెడు, సోయాసాస్ - ఒక టీస్పూన్, ఎండుమిర్చి పేస్టు - ఒక టీస్పూన్, నూనె - సరిపడా, నిమ్మకాయ - ఒకటి.

సాస్ కోసం : వేరుసెనగలు - ఒకకప్పు, ఉల్లిపాయ - ఒకటి, ఉప్పు - తగినంత, కొబ్బరిపాలు - ఒక కప్పు, బెల్లం - పావు కప్పు, నూనె - కొద్దిగా.

**తయారీ**

- ముందుగా చికెన్‌ను ఒక పాత్రలోకి తీసుకుని శుభ్రంగా కడిగి అల్లం వెల్లుల్లి పేస్టు, పసుపు, సోయాసాస్, ఎండుమిర్చి పేస్టు, నిమ్మరసం వేసి ముక్కలకు సమంగా పట్టేలా కలియబెట్టాలి.
- తరువాత చికెన్ ముక్కలను పుల్లకు గుచ్చి రెండు వైపులా కాల్చుకోవాలి.
- సాస్ కోసం వేరుసెనగలు వేగించి పొట్టు తీసి పెట్టుకోవాలి.
- పాన్‌లో నూనె వేసి ఉల్లిపాయలు వేసి వేగించాలి.
- తరువాత వేరుసెనగలు, ఎండుమిర్చి పేస్టు వేసి కలపాలి. బెల్లం, కొబ్బరిపాలు, తగినంత ఉప్పు వేసి మరికాసేపు వేగనివ్వాలి.
- ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి మెత్తగా పట్టుకోవాలి.
- చికెన్ ముక్కలను ఈ సాస్‌తో కలిపి తింటే ఎంతో రుచిగా ఉంటాయి.

## కకోరి కబాబ్



**కావలసినవి**

(ఓవెన్ టెంపరేచర్ 220 డిగ్రీలు)

మటన్ కీమా - అర కిలో, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒక టీస్పూన్, ఉప్పు - తగినంత, మిరియాల పొడి - పావు టీస్పూన్, ధనియాల పొడి - రెండు టేబుల్‌స్పూన్లు, పచ్చిమిర్చి - మూడు, బొప్పాయి ముక్కలు - రెండు టేబుల్‌స్పూన్లు, లవంగాలు - నాలుగు, దాల్చినచెక్క - చిన్నముక్క, జీలకర్ర - ఒక టీస్పూన్, ఉల్లిపాయలు - రెండు, నెయ్యి - కొద్దిగా, కోడిగుడ్డు - ఒకటి, జాజికాయ పొడి - పావు టీస్పూన్.

**తయారీ**

- కీమాను శుభ్రంగా కడిగి ఒక పాత్రలోకి తీసుకోవాలి. ఉల్లిపాయలు సన్నగా తరిగి నెయ్యిలో వేగించాలి. అందులో అల్లంవెల్లుల్లి పేస్టు, మిరియాల పొడి, ధనియాలపొడి, తరిగిన పచ్చిమిర్చి, బొప్పాయి ముక్కలు, లవంగాలు, దాల్చిన చెక్క పొడి, జీలకర్ర, జాజికాయ పొడి, తగినంత ఉప్పు వేసి కలపాలి.
- ఈ మిశ్రమాన్ని మిక్సీలో వేసి పట్టుకోవాలి. కోడిగుడ్డు వేసి మరొకసారి కలపాలి.
- ఈ మిశ్రమాన్ని అరగంటపాటు ఫ్రిజ్‌లో పెట్టాలి.
- ఇప్పుడు పుల్లల చుట్టూ మటన్ మిశ్రమాన్ని కబాబ్‌లా పెట్టాలి.
- వాటిని ఒక ట్రేలో పెట్టి, నెయ్యి రాసి ప్రీ హీటెడ్ ఓవెన్‌లో అరగంటపాటు ఉడికించాలి.
- బొగ్గుల గ్రిల్‌పై కూడా ఉడికించుకోవచ్చు. అయితే రెండు పక్కలా కాలేలా తిప్పుతమా ఉండాలి.
- చివరగా ఉల్లిపాయలతో గార్నిష్ చేసుకోవాలి. చట్నీతో తింటే కకోరి కబాబ్స్ టేస్ట్ సూపర్బ్‌గా ఉంటుంది.

---

## ముత్యాల ముగ్గు



17 చుక్కలు
సూటిచుక్క 1 వరుస
1 వచ్చే వరకు



**సి. మౌనిక**
బాలాపూర్, హైదరాబాద్



18 చుక్కలు
సరి చుక్కలు
6 వచ్చే వరకు



**ఆర్. రేష్మ**
సముదాయం, చిత్తూరు



18 చుక్కలు
4 వరుసలు
4 సరిచుక్క



**కాసర సింధు**
జంగారెడ్డిగూడెం, పశ్చిమగోదావరి



21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చే వరకు



**పోకల వరలక్ష్మి**
పెదలంక, కృష్ణాజిల్లా

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.
**మా చిరునామా...** నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com

ఆంధ్రజ్యోతి నవ్య యంగ్



# 2020 వీటిదే హవా!

**సాంకేతిక రంగంలో ఊహించని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రాబోయే రోజుల్లో కొత్త టెక్నాలజీతో అద్భుతాలు సృష్టించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 2020లో ప్రధాన పాత్ర పోషించబోతున్న అలాంటి కొన్ని టెక్నాలజీల గురించి తెలుసుకుందాం.**

**టెక్‌గురు**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో అంతర్భాగంగా ఉండే మెషిన్ లెర్నింగ్‌ను ఇప్పటికే వివిధ రంగాల్లో పాక్షికంగా వాడుతున్నప్పటికీ 2020లో ఈ టెక్నాలజీ మరింత ఊపందుకోనుంది. మనిషి మేధస్సుతో పనిలేకుండా కొన్ని రకాల పనులను కృత్రిమ మేధస్సుతో పూర్తి చేయటం ఈ టెక్నాలజీ లక్ష్యం. ఇమేజ్ రికగ్నిషన్, స్పీచ్ అండ్ ప్యాటర్న్స్, కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకోవడం వంటి వివిధ అంశాలలో ఈ టెక్నాలజీ వినియోగంలో ఉంది. మనిషి కన్నా వేగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆయా పనులను చేయగలుగుతుంది. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని అందిపుచ్చుకున్న సంస్థలు గతంతో పోలిస్తే తమ పనితీరులో 5 శాతం పెరుగుదలను నమోదు చేశాయి. అయితే మిషన్ లెర్నింగ్‌కి ప్రధానంగా భారీ మొత్తంలో డేటా సెట్స్ కావాలి. అందుకు అనుగుణంగానే డేటాను సమీకరించి, దానిని విశ్లేషించే పనిలో అన్ని సంస్థలు నిమగ్నమై ఉన్నాయి.

## 5జీ

ఇంటర్నెట్ ఎంతగా అభివృద్ధి చెందినా కూడా పూర్తి స్థాయి ప్రయోజనాలు పొందడానికి అతిపెద్ద అవరోధం నాణ్యమైన కనెక్టివిటీ లేకపోవడం. ముఖ్యంగా మొబైల్ ఇంటర్నెట్ ప్రస్తుత అవసరాలను పూర్తిగా తీర్చలేకపోతోంది. ఈ సమస్యకు ఏకైక పరిష్కారం 5జీ. 2019లో మొట్టమొదటిసారిగా 5జీని సపోర్ట్ చేసే స్మార్ట్‌ఫోన్స్ చూసాం. అలాగే ప్రపంచవ్యాప్తంగా అనేక టెలికామ్ సంస్థలు 5జీ సేవలను ప్రయోగాత్మకంగా పరిశీలించడం కూడా జరిగింది. ఇండియాలో రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థలు ఈ అంశం మీద పూర్తి స్థాయిలో ప్రయోగాలు చేస్తున్నాయి. 5జీ ద్వారా వేగవంతమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ మాత్రమే కాకుండా, మరింత ఇంటర్నెట్ సామర్థ్యం, తక్కువ రేట్ లేటెన్సీ సాధ్యపడుతుంది. వీటన్నిటి కారణంగా 2020లో టెక్నాలజీ సామాన్యుడికి మరింతగా అందుబాటులోకి రావడానికి 5జీ దోహదపడబోతోంది. తాజా అంచనాల ప్రకారం 2020లో ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల 5జీ నెట్‌వర్క్‌లు ఇంటిగ్రేట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## బ్లాక్ చైన్ టెక్నాలజీ

బ్యాంకింగ్ రంగం మొదలుకొని, వివిధ డేటా స్టోరేజ్‌లను ప్రపంచవ్యాప్తంగా వేలాది కంప్యూటర్లలో డీసెంట్రలైజ్డ్ డిజిటల్ లెడ్జర్ రూపంలో భద్రపరచడం కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. దీని ద్వారా డేటాకి అత్యంత పటిష్టమైన భద్రత లభిస్తుంది. 2020 తరువాత అనేక రంగాల్లో ఈ టెక్నాలజీ కూడా కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భద్రత కల్పించడం మాత్రమే కాకుండా సమాచారాన్ని చాలా వేగంగా ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం కూడా ఈ టెక్నాలజీ కల్పిస్తుంది. బ్లాక్ చైన్ టెక్నాలజీకి సంబంధించిన డెవలపర్లకి ఇప్పటికే విపరీతమైన డిమాండ్ లభిస్తోంది. భవిష్యత్‌లో క్రిప్టో కరెన్సీకి కూడా మరింత అవకాశం ఉన్న నేపథ్యంలో బ్లాక్ చైన్ టెక్నాలజీ లేని ప్రపంచాన్ని ఊహించడం కష్టమే.

## సైబర్ సెక్యూరిటీ

అత్యంత ముఖ్యమైనది అయినప్పటికీ, చాలా కాలంగా పెద్దగా ఎవరూ దృష్టి పెట్టని రంగం సైబర్ సెక్యూరిటీ. ఇటీవలి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా రాన్‌సమ్‌వేర్లు, నెట్‌వర్క్, వెబ్ దాడులు, పెద్ద మొత్తంలో యూజర్ డేటాను దొంగిలించడం వంటి సంఘటనలు పెరిగిన నేపథ్యంలో వ్యాపార సంస్థలు భారీ మొత్తంలో నష్టపోవాల్సి వస్తోంది. డేటా ఎంతగా పెరిగితే దానికి రక్షణ అంతగా అవసరం. ఈరోజు డేటా ఆధారంగానే ప్రపంచం మొత్తం నడుస్తోంది కాబట్టి ఆ డేటాకు మరింత రక్షణ కల్పించే సైబర్ సెక్యూరిటీ రంగం 2020లో అత్యంత కీలకం కాబోతోంది.

## ఎడ్జ్ కంప్యూటింగ్

ఒకప్పుడు సీడీలు, డీవీడీలు, హార్డ్‌డిస్కుల్లో స్టోర్ చేయబడిన డేటా మొత్తం ఇప్పుడు క్లౌడ్‌లో ఉంటోంది. అయితే పూర్తి స్థాయిలో క్లౌడ్ మీద ఆధారపడడం వల్ల ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో ఉన్న వ్యక్తులకి ఆయా క్లౌడ్ సర్వీసుల సర్వర్ల నుంచి డేటా పంపిణీ ఆలస్యం కావడం జరుగుతుంది. అంతేకాదు క్లౌడ్ మీద విపరీతమైన ఒత్తిడి పడుతుంది. ఈ నేపథ్యంలో క్లౌడ్ కంప్యూటింగ్‌ని మరింత సులభతరం చేయడం కోసం ఎడ్జ్ కంప్యూటింగ్ వచ్చింది. వీలైనంత సమాచారం యూజర్ డివైజ్‌లో ప్రాసెస్ చేయటం ద్వారా, క్లౌడ్ మీద ఆధారపడే అవసరం తగ్గించడం ఈ 'ఎడ్జ్ కంప్యూటింగ్' లక్ష్యం. అన్ని టెక్నాలజీ సంస్థలు 2020లో ఈ టెక్నాలజీని పూర్తిస్థాయిలో అందిపుచ్చుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నాయి.

వీటితోపాటు వర్చ్యువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, బిగ్ డేటా, ఎనలిటిక్స్, వాయిస్ టెక్నాలజీ వంటివి 2020లో ఎక్కువగా ప్రభావం చూపించబోతున్నాయి.

## ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్

2020లో మరింత అభివృద్ధి చెందబోతున్న మరో రంగం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్. ఇప్పటివరకు ఇంటర్నెట్ ద్వారా వ్యక్తుల మధ్య కమ్యూనికేషన్ మాత్రమే మెరుగుపడింది. ఖాతాదారులతో కమ్యూనికేషన్ మెరుగుపడి వ్యాపార సంస్థలు మాత్రమే లాభపడ్డాయి. ఇప్పుడు ఇంటర్నెట్ అనేక రకాల వస్తువులను ఒకదానితో మరొకదాన్ని అనుసంధానంగా చేయబోతోంది. రిఫ్రిజిరేటర్ డోర్ కావచ్చు, కూర్చున్న కుర్చీ కావచ్చు, ఇంట్లో లైట్లు, ఫ్యాన్లు, ఏసీ, గీజర్, మీ ఇంటి మెయిన్ డోర్ ఇలా అన్ని రకాల వస్తువులు ఒకదానితో మరొకటి ఇంటర్నెట్ ద్వారా కనెక్ట్ అయి కావలసిన పనులను చాలా సులభంగా చేసి పెడుతూ ఉంటాయి. అంతేకాదు, మీరు మొక్కలు పెంచుతుంటే, అందులో మీరు బిగించే సెన్సార్ మొక్కల తేమ శాతం ఎంత ఉంది అన్న విషయం పరిశీలించి, మీరు ఆఫీసులో ఉన్నా కూడా మీకు నోటిఫికేషన్ రూపంలో చూపిస్తుంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌కు సంబంధించిన అనేక రకాల కొత్త పరికరాలను మార్కెట్లోకి తీసుకురావడానికి రిలయన్స్ జియో వంటి సంస్థలు కూడా సన్నాహాలు చేస్తున్నాయి. ఇప్పటికే అనేక స్మార్ట్ హోమ్ వస్తువులు మార్కెట్లో లభిస్తున్నాయి. కాబట్టి 2020 తర్వాత ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ లేనిదే ప్రపంచాన్ని ఊహించుకోలేం.



## ఆటోమేషన్

ఇప్పటికే అనేక రంగాలు ఆటోమేషన్ వైపు ప్రయాణిస్తున్నాయి. తమ వస్తువుల ఉత్పత్తుల తయారీని ఆటోమేట్ చేయడం మొదలుకొని, తాము అందించే వివిధ రకాల సర్వీసులను సిబ్బందితో అవసరం లేకుండా ఆటోమేట్ చేయడం వరకు అనేక రకాలుగా ప్రపంచవ్యాప్తంగా సంస్థలు ఆటోమేషన్‌ని వినియోగించుకున్నాయి. సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ వంటి అనేక రంగాల్లో 2020 తర్వాత ఆటోమేషన్ ఊపందుకోబోతోంది. దీని మూలంగా అనేక ఉద్యోగాలకు మేధస్సుతో అవసరం ఉండకపోవచ్చు. కాబట్టి తక్కువ స్కిల్స్‌తో కూడిన ఉద్యోగాలు చేసేవారు పరిస్థితి తీవ్రం కాకముందే ప్రత్యామ్నాయాలు చూసుకోవడం మంచిది. ముఖ్యంగా రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ అనేక ఉద్యోగాలకు ఎసరు పెట్టబోతోంది. ఒక అంచనా ప్రకారం ప్రస్తుతం ఉద్యోగులు చేస్తున్న పనుల్లో 45 శాతం వరకు ఆటోమేట్ చేసే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వ్యాపార సంస్థల లావాదేవీలను ప్రాసెస్ చేయడం మొదలుకొని, డేటాను విశ్లేషించడం, ఈమెయిల్ మెసేజ్‌లకు రిప్లై ఇవ్వటం వంటి అనేక పనులను మనుషులతో సంబంధం లేకుండా రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్ ప్రక్రియ ద్వారా పూర్తి చేయబోతున్నారు.





నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

**టెక్ రివైండ్**

# 2019 టెక్ మెరుపులు

ఈ ఏడాది టెక్ రంగంలో సరికొత్త ఆవిష్కరణలు అందరినీ అలరించాయి. టెక్ ప్రియుల మనసు దోచేసిన అలాంటి కొన్ని టెక్ ఆవిష్కరణలు ఇవి...

### బయోమెట్రిక్స్

ఈ ఏడాదిలో అందర్నీ బాగా ఆకట్టుకున్న, ఎక్కువగా వినియోగంలోకి వచ్చిన టెక్నాలజీ ఇది. ఫింగర్‌ప్రింట్, రెటీనా స్కాన్‌లు దాదాపు అన్ని కార్యాలయాల్లో సాధారణమైపోయాయి. ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్ మాత్రం ఈ ఏడాది బాగా పాపులర్ అయింది. మనదగ్గర విమానాశ్రయాల్లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కసారి ఐడెంటిటీకి సంబంధించిన పత్రాలు చూపించి ఫేస్ రికగ్నిషన్ చేయించుకుంటే సరిపోతుంది. బోర్డింగ్ పాస్‌లు, ఇతర పత్రాలు చెక్ చేసే పని ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్‌తో తప్పినట్టయింది. రాబోయే రోజుల్లో అన్ని ఐటీ కంపెనీల్లో ఈ తరహా విధానం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



### వర్చ్యువల్ రియాల్టీ

కళ్లకు ఓ హెడ్‌సెట్ ధరించి కొత్త లోకంలో విహరించడం సరికొత్త అనుభూతిని కలిగించింది. ఈ ఏడాది ఎక్కువ మందిని ఆకర్షించిన టెక్నాలజీ ఇది. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ దీనికి ఎట్రాక్ట్ అయ్యారు. ప్రారంభంలో ఎక్కువ ధరతో కొంతమందికే అందుబాటులో ఉన్నా, తరువాత ఇది సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చింది.



### 3డి ప్రింట్

అప్పటి వరకు సాధారణ ప్రింట్‌ను మాత్రమే చూసిన వారికి 3డి ప్రింట్ ఓ మాయగా అనిపించింది. నిజమైన వస్తువును చూస్తున్నట్టుగా కనిపించే 3డి ప్రింట్ ఈ ఏడాది టెక్నాలజీ అద్భుతంలో ఒకటి.

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

కృత్రిమ మేధస్సు పరిచయం ఈ ఏడాది మరో అద్భుతం. మనిషి మేధస్సుతో చేసే పనులను కృత్రిమ మేధస్సుతో పూర్తి చేయడం సరికొత్త విప్లవానికి నాంది పలికింది. ఈ ఏడాది దాని ఫలితాలు కాస్తేనని, రాబోయే రోజుల్లో కృత్రిమ మేధస్సు వినియోగం పూర్తిస్థాయిలో ఉంటుందని నిపుణులు అంటున్నారు.

### మడిచే ఫోన్లు

చాలా రోజులుగా ఊరిస్తున్న మడిచే ఫోన్లు ఈ ఏడాది అందరినీ పలకరించాయి. 7.3 అంగుళాల డిస్‌ప్లేతో వచ్చిన సామ్‌సంగ్ గెలాక్సీ ఫోల్డ్ స్మార్ట్‌ఫోన్ మొబైల్ ప్రియులను బాగా ఆకట్టుకుంది.




### మూడు కెమెరాలు

స్మార్ట్‌ఫోన్‌కు సెల్ఫీకెమెరా, రియర్ కెమెరా ఉండటమే ఎక్కువ అనుకుంటున్న సమయంలో ట్రిపుల్ రియర్ కెమెరాలు ఉన్న ఫోన్‌లు అందుబాటులోకి వచ్చాయి. డ్యుయల్ రియర్ కెమెరా ఉండటం సాధారణమై పోయింది.

### 64 మెగాపిక్సెల్

స్మార్ట్‌ఫోన్‌లో 13 మెగాపిక్సెల్ రియర్ కెమెరా ఈ ఏడాది కనిపించకుండా పోయింది. 13 నుంచి మొదలుకుని 24, 48... చివరకు 64 మెగాపిక్సెల్ ఫోన్లు రావడం ఈ ఏడాది మొబైల్ ప్రియులను ఆశ్చర్యానికి గురిచేసింది.

**టెక్ సందేహాలు**

## ఆ కాంటాక్ట్స్ యాక్సెస్ చేసేదెలా?



నా కాంటాక్ట్‌లను మెయిల్‌లో సేవ్ చేసుకోవడం అలవాటు. అయితే అలా సేవ్ చేసుకున్న తర్వాత వాటిని తిరిగి యాక్సెస్ చేయలేకపోతున్నాను. దీనికి పరిష్కారం తెలియజేయగలరు.

**- వినయ్ పెరుమాళ్ల**

మీ మెయిల్‌లో సిఎస్‌వి ఫైల్ ఎటాచ్‌మెంట్‌గా ఇచ్చి మీ కాంటాక్ట్స్ సేవ్ చేస్తున్నారా? ఏ విధంగా సేవ్ చేస్తున్నారు అన్నది స్పష్టంగా పేర్కొనలేదు. ఏదేమైనా మీరు కాంటాక్ట్‌ను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందాలంటే గూగుల్ కాంటాక్ట్స్ అప్లికేషన్ గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. లేదా ఆండ్రాయిడ్ ఫోన్ సెటప్ చేసేటప్పుడు, గూగుల్ కాంటాక్ట్స్ సర్వీస్ కూడా మీ ఫోన్‌బుక్‌లో ఇంటిగ్రేట్ అవుతుంది. ఆ తర్వాత కొత్తగా మీ ఫోన్‌లో కాంటాక్ట్ సేవ్ చేసుకునేటప్పుడు.. దాన్ని గూగుల్ కాంటాక్ట్‌లో సేవ్ చేస్తే సరిపోతుంది. గూగుల్ కాంటాక్ట్స్ సర్వీస్ ద్వారా ఇప్పటికే మీ అకౌంట్లో సేవ్ చేసి ఉన్న అన్ని రకాల కాంటాక్ట్స్‌ని సులభంగా బ్యాకప్ తీసుకోవచ్చు. అవసరాన్ని బట్టి వేరే అకౌంట్‌లోకి ఇంపోర్ట్ కూడా చేసుకోవచ్చు.

## మెయిల్ అకౌంట్స్ లింక్ చేసుకోవచ్చా?




నా జీమెయిల్ అకౌంట్ ఫుల్ అయింది. నేను కొత్తగా ఇంకో పేరుతో జీమెయిల్ అకౌంట్ క్రియేట్ చేసుకొని ఫుల్ అయిన మెయిల్ ఐడీతో లింక్ చేసుకోవచ్చా? అలా చేస్తే ఓల్డ్ మెయిల్‌కి వచ్చిన మెయిల్స్ డైవర్ట్ అయి కొత్త ఐడీకి వస్తాయా?

**- సునీల్**

మీకు కావాలంటే మరో మెయిల్ ఐడీ క్రియేట్ చేసుకోవచ్చు. అలా క్రియేట్ చేసుకున్న ఐడీని ఇక మీదట ప్రధానమైన మెయిల్ ఐడీగా వాడుతూ కావాలంటే పాత మెయిల్‌కి ఏదైనా మెసేజ్ వస్తే అది కొత్త మెయిల్ ఐడీకి ఫార్వర్డ్ అయ్యే విధంగా కూడా లింక్ చేసుకోవచ్చు. అయితే ఇదంతా మీ పాత మెయిల్ ఐడీలో తగినంత స్టోరేజ్ స్పేస్ ఉన్నప్పుడు మాత్రమే. అందులో స్పేస్ లేకపోతే కొత్త మెయిల్ ఐడీ క్రియేట్ చేసుకున్న కూడా ఎలాంటి ఉపయోగం ఉండదు. కాబట్టి మొట్టమొదట మీరు చేయవలసిన పని, మీ పాత మెయిల్ ఐడీలో ఎక్కువ స్థలాన్ని ఆక్రమించిన మెయిల్స్, అటాచ్‌మెంట్లను గుర్తించి వాటిని తొలగించడం ద్వారా కొంత స్పేస్ సాధించడం. ఆ తర్వాత మాత్రమే రెండు మెయిల్ ఐడీలను ఒకదానితో మరొకటి లింక్ చేసుకోవచ్చు.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం: navya@andhrajyothy.com

# లిటిల్స్

**చేసేయండి!**



## గాలి గుమ్మటం

**కావలిసిన వస్తువులు:** రెండువైపులా తెరిచి ఉన్న ఖాళీ ఐస్‌క్రీమ్ కప్పు, రంగు కాగితం, జిగురు, దారం, టిష్యూ పేపర్, పేపర్ పంచ్, కత్తెర

**ఇలా చేయండి:**

- ఐస్‌క్రీమ్ కప్పు చుట్టూ రంగుల కాగితం అతికించి దానిపై మీకు నచ్చిన బొమ్మ వేయండి.
- టిష్యూ కాగితాన్ని సన్నటి పొడవాటి ముక్కలుగా కత్తిరించి ఐస్‌క్రీమ్ కప్పుకు ఒక వైపు అంచుల వెంబడి చుట్టూ అతికించండి.
- ఐస్‌క్రీమ్ కప్పుకు మరొక వైపు పేపర్ పంచ్‌తో సమానమైన దూరం ఉండేలా నాలుగు రంధ్రాలు చేయండి.
- రంధ్రాలను దారంతో కట్టి ముడి వేయండి. ముడి దగ్గర పొడవైన దారంతో కట్టి వేలాడదీయండి.
- గాలికి తిరుగుతూ ఆనందాన్ని పంచే గాలి గుమ్మటం రెడీ.




## పదాలను పట్టికలో కనిపెట్టండి

letter P

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| P | I | A | N | O | N | U | T | O | P | P |
| L | G | E | R | P | G | L | O | V | E | S |
| A | P | U | T | O | R | P | C | K | P | R |
| S | I | C | N | L | C | L | L | Y | P | E |
| S | Z | S | U | I | L | A | K | N | E | E |
| E | Z | E | R | C | K | T | E | E | R | S |
| S | A | B | W | E | C | E | A | E | E | N |
| P | T | M | H | I | K | R | U | D | T | O |
| G | I | P | U | M | P | K | I | N | A | T |
| J | I | S | L | E | N | G | I | E | H | E |
| N | P | R | E | T | Z | E | L | S | V | S |




## దారి కనుక్కోండి?



## చుక్కలు కలిపి రంగులు వేయండి





## 5 తేడాలు గుర్తించండి?

## డైలీ సుడోకు -236

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 6 | | 9 | | 2 | | 3 | |
| | 2 | 8 | | | | 1 | | |
| 4 | 5 | | 8 | | | | | 2 |
| 2 | | | 3 | | | | | |
| | 8 | 4 | | | | 9 | 6 | |
| | | | | | 8 | | | 1 |
| 8 | | | | | 5 | | 1 | 9 |
| | | 5 | | | | 3 | 4 | |
| | 4 | | 6 | | 9 | | 5 | |

**సుడోకు - 235 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 8 | 2 | 4 | 7 | 9 | 1 | 5 | 3 |
| 3 | 7 | 5 | 6 | 2 | 1 | 9 | 8 | 4 |
| 9 | 1 | 4 | 5 | 3 | 8 | 2 | 7 | 6 |
| 7 | 5 | 3 | 9 | 4 | 6 | 8 | 1 | 2 |
| 1 | 2 | 8 | 3 | 5 | 7 | 4 | 6 | 9 |
| 4 | 6 | 9 | 8 | 1 | 2 | 5 | 3 | 7 |
| 8 | 3 | 6 | 2 | 9 | 5 | 7 | 4 | 1 |
| 2 | 4 | 1 | 7 | 8 | 3 | 6 | 9 | 5 |
| 5 | 9 | 7 | 1 | 6 | 4 | 3 | 2 | 8 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.




## షూటింగుకు వేళాయెరా!

కొత్త ఏడాదిలో... తొలి నెలలో... కోకాపేటలో వేసిన సెట్‌లో... కొత్త లుక్‌లో... రెండో తారీఖు నుండి చిరంజీవి చిత్రీకరణలో పాల్గొంటారని తెలిసింది. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. రామ్‌చరణ్, నిరంజన్‌రెడ్డి నిర్మాతలు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జనవరి 2న మొదలు కానుంది. వాణిజ్య విలువలతో పాటు చక్కని సందేశంతో కొరటాల బౌండ్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఇందులో చిరంజీవి సరసన త్రిష నాయికగా నటించనున్నారని సమాచారం. అయితే... ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఇంతకుముందు వీరిద్దరూ 'స్టాలిన్'లో జంటగా నటించారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీత దర్శకుడు.

## లవర్ బాయ్ ఇమేజ్ అంటే చిరాకు


శంకర్ ప్రసాద్, ఉషా, నాగశౌర్య

"నాకు లవర్‌బాయ్ ఇమేజ్ అంటే చిరాకు. దాని నుండి బయటికొచ్చి రఫ్‌గా ఉండే క్యారెక్టర్ చేశా" అని నాగశౌర్య అన్నారు. ఆయన కథ అందించి, హీరోగా నటించిన చిత్రం 'అశ్వథ్థామ'. మెహరీన్ కథానాయిక. రమణ తేజ దర్శకత్వంలో ఉషా ముల్పూరి నిర్మించారు. శంకర్ ప్రసాద్ సమర్పకుడు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను సమంత ట్విట్టర్ వేదికగా విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాగశౌర్య మాట్లాడుతూ "నాకు కథలు రాయడమన్నా, చెప్పడమన్నా చాలా ఇష్టం. ఢిల్లీ, ముంబై ప్రాంతాల్లో అమ్మాయిలపై జరిగిన కొన్ని ఘటనల ఆధారంగా ఈ కథ రాశా. నా తల్లితండ్రులు గర్వంగా తలెత్తుకునేలా ఈ సినిమా చేశా" అని అన్నారు. "శౌర్య ఇచ్చిన కథే సినిమాకు ప్రాణం. హీరోగా ఆయన విశ్వ రూపం చూస్తారు. ప్రతి సన్నివేశం థ్రిల్లింగ్‌గా ఉంటుంది" అని దర్శకుడు చెప్పారు. జనవరి 31న సినిమాను విడుదల చేస్తున్నామని నిర్మాతలు చెప్పారు.




## 'వైల్డ్ డాగ్' విజయ్ వర్మ

ఎ.సి.పి విజయ్ వర్మ... ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్! తీవ్రవాదులపై మెరుపుదాడి చేసి... కాల్చి చంపడంలో ఆరితేరిన ఎన్ఐఎ (నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ) ఆఫీసర్! చాలాసార్లు సీక్రెట్ ఆపరేషన్స్ నిర్వహించి, తీవ్రవాదుల్ని ఎన్‌కౌంటర్ చేయడంతో విజయ్ వర్మకు 'వైల్డ్ డాగ్' అనే పేరు వచ్చింది. అతడి కథేంటో 'వైల్డ్ డాగ్' చిత్రంలో చూడమంటున్నారు హీరో నాగార్జున. ఎ.సి.పి విజయ్ వర్మగా ఆయన నటిస్తున్న చిత్రమిది. అహిషోర్ సాల్మన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిరంజన్‌రెడ్డి, అన్వేశ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఫస్ట్ షెడ్యూల్ పూర్తయింది. ఈ సందర్భంగా సినిమాలో నాగార్జున ఫస్ట్ లుక్ విడుదల చేశారు. "చాలా రోజుల తర్వాత నిజ జీవిత ఘటనల ఆధారంగా రూపొందుతోన్న చిత్రంలో భాగమైనందుకు ఎగ్జయిటింగ్‌గా ఉంది. కొత్తతరం సాంకేతిక నిపుణులతో కొత్త తరహాలో తెరకెక్కిస్తున్న చిత్రమిది. 2020 చాలా ఎగ్జయిటింగ్‌గా ఉండబోతోంది" అని నాగార్జున అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: షానియల్ డియో, సహ నిర్మాతలు: ఎన్ఎమ్ పాషా, జగన్ మోహన్ వంచ.




## పుట్టినరోజున... మేనకోడలు పుట్టింది!



సల్మాన్‌ఖాన్ పుట్టినరోజు డిసెంబర్ 27న (గురువారం). అదే రోజున కండల వీరుడి చెల్లెలు అర్పితా ఖాన్ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. సల్మాన్ పుట్టినరోజున అతడి మేనకోడలు కూడా పుట్టిందన్నమాట! ఆమెకు ఆయత్ శర్మ అని పేరు పెట్టారు. "చిన్నారి రాకుమారి భూమ్మీదకు వచ్చింది. ఈ నెల 27న మాకు అమ్మాయి పుట్టింది. మీ ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలకు కృతజ్ఞతలు" అని అర్పిత భర్త ఆయుశ్ శర్మ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

## నాన్నలా పేరు తెచ్చుకోవాలి!

- నటరాజ్


నటరాజ్

"నటుడిగా నాన్న సత్యప్రకాశ్‌కు తెలుగు పరిశ్రమలో మంచి పేరుంది. ఆయన పేరు పోగొట్టకుండా గుర్తింపు తెచ్చుకోవాలనుంది. నాన్న దర్శకత్వంలో హీరోగా పరిచయం కావడం ఆనందంగా ఉంది. నటరాజ్ నాకొడుకు అని ఆయన గర్వంగా చెప్పుకోవాలి" అని నటరాజ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా సత్యప్రకాశ్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. నూరిన్ షెరిఫ్, అంకిత మహారాణా నాయికలు. ఎ.గురురాజ్ నిర్మాత. జనవరి 1న ప్రేక్షకుల ముందుకొస్తుందీ సినిమా. ఈ సందర్భంగా నటరాజ్, అంకిత విలేకర్లతో మాట్లాడారు. "డబ్బుంటే చాలు.. ప్రేమించిన అమ్మాయి ఎలాంటిదైనా ఫర్వాలేదని భావించే ఓ కుర్రాడి కథ ఇది. అలాంటి కుర్రాడు డబ్బు మైకం నుంచి వాస్తవంలోకి ఎలా వచ్చాడనే కథాంశంతో ఉత్కంఠభరితంగా తెరకెక్కించాం. రొమాంటిక్ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. నాన్నే డైరెక్టర్ అయినా స్నేహితుల్లా పని చేశాం. మా ఇద్దరికీ సెట్‌లో సినిమా ధ్యాస తప్ప మరొకటి ఉండదు" అని అన్నారు. "ఇందులో గొప్పింటి అమ్మాయిగా ఈతరం అమ్మాయిలకు నచ్చే పాత్రలో కనిపిస్తా. తెరపై రొమాన్స్ పండించడం అంత ఈజీ కాదు. ఇందులో నటనకు ఆస్కారమున్న పాత్ర పోషించా "అని అంకిత చెప్పారు.

## లైఫ్‌స్టైల్ మారింది!



నెహ్రూ విజయ్, రోజా, నిఖిల్, సంతోషి కీలక పాత్రధారులుగా నటించిన చిత్రం 'లైఫ్‌స్టైల్'. సి.ఎల్.సతీశ్ మార్క్ దర్శకత్వంలో కలకొండ నర్సింహ నిర్మించారు. ఇటీవల ఈ చిత్రం పాటల్ని గోరేటి వెంకన్న విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "4జీ స్మార్ట్ ఫోన్‌కు 4జీ నెట్ వర్క్ ఎంత అవసరమో.. ఫ్యామిలీకి పిల్లలు కూడా అంతే అవసరం అన్న ఇతివృత్తంతో రూపొందుతున్న చిత్రమిది. టెక్నాలజీ పెరగడంతో యువత లైఫ్‌స్టైల్ కూడా మారిందని ఇందులో చెబుతున్నాం" అని అన్నారు.

## రైతులకు... సాఫ్ట్‌వేర్‌కి సంబంధం ఏంటి?

సుడిగాలి సుధీర్, ధన్యా బాలకృష్ణ జంటగా నటించిన చిత్రం 'సాఫ్ట్‌వేర్ సుధీర్'. రాజశేఖర్ రెడ్డి పులిచర్ల దర్శకత్వంలో కె. శేఖర్ రాజు నిర్మించిన ఈ చిత్రం శనివారం ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా ఫిల్మ్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ "సాఫ్ట్‌వేర్ బ్యాక్‌డ్రాప్‌లో పూర్తి వినోదాత్మకంగా సాగే చిత్రమిది. అంతర్లీనంగా మంచి సందేశం ఉంది. రైతులకు, సాఫ్ట్‌వేర్ సుధీర్‌కు ఉన్న లింక్ ఏంటీ? అనేది వెండితెరపై చూడాలి. సంవత్సరాంతంలో నవ్వులు పూయించే చిత్రమిది" అని అన్నారు. "రెగ్యులర్ సినిమాల్లా కాకుండా బర్నింగ్ ఇష్యూతో రూపొందించిన సినిమా ఇది. ఫ్యామిలీ మొత్తం చూడొచ్చు. ఇందులో గద్దర్ పోషించిన పాత్ర గుర్తుండిపోతుంది. సుడిగాలి సుధీర్ నుంచి ప్రేక్షకులు ఆశించే అన్ని అంశాలు ఇందులో ఉన్నాయి" అని దర్శకుడు అన్నారు.


కె. శేఖర్ రాజు, రాజశేఖర్‌రెడ్డి
















| సెన్సెక్స్ | నిఫ్టీ | బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|---|---|
| 411.38 ↑ | 119.25 ↑ | 153 ↑ | 200 ↓ | 4 పైసలు ↓ | ↓ |
| 41,575.14 | 12,245.80 | 38,944 | 46,320 | 71.35 | 67.66 |
| | | ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత) | | | |

# వినియోగం, పెట్టుబడులే పెద్ద సవాల్

**నిర్వహణ సామర్థ్యంతోనే**

**ఆర్థిక వ్యవస్థకు బలం: ఆర్‌బీఐ గవర్నర్**

ముంబై: దేశీయ కంపెనీలు, బ్యాంకుల నిర్వహణ సామర్థ్యంపై ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అవకాశాల్ని పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలంటే కంపెనీలు, బ్యాంకుల నిర్వహణ సామర్థ్యం పెరగడం తప్పనిసరన్నారు. ఆర్‌బీఐ తాజా 'ద్రవ్య స్థిరత్వ నివేదిక' (ఎఫ్ఎస్ఆర్) కోసం రాసిన ముందు మాటలో దాస్ ఈ విషయం స్పష్టం చేశారు. వినియోగం, పెట్టుబడులు మన ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే రెండు వృద్ధి ఇంజన్లనాన్నారు. మందగించిన ఈ రెండింటిని గాడిలో పెట్టడమే ప్రస్తుతం పెద్దసవాల్ అన్నారు. జూలై-సెప్టెంబరు, 2019 త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.



**ఎఫ్ఎస్ఆర్ ప్రధాన అంశాలు**

- ప్రభుత్వ రాబడులు తగ్గడం ద్రవ్య లోటు లక్ష్యానికి చేటు
- సవాళ్లున్నా ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి ఢోకా లేదు
- బ్యాంకుల్లో రూ.1.13 లక్షల కోట్లకు చేరిన మోసాలు
- బ్యాంకుల ఎన్‌పీఏల భారం తగ్గుతోంది
- ప్రస్తుతం ప్రభుత్వ పెట్టుబడులే జీడీపీకి ఊతం
- ఎగుమతులు మరింత తగ్గే ప్రమాదం
- మొత్తం రియల్టీ రుణాల్లో 7.33 శాతం నష్టాలే
- 6.3 శాతానికి చేరిన ఎన్‌బీఎఫ్‌సీల ఎన్‌పీఏలు

## 58 ఏళ్ల కనిష్ఠ స్థాయిలో పరపతి వృద్ధి రేటు

ఆర్థిక వ్యవస్థ మందగమనం ప్రభావం బ్యాంకుల రుణ విస్తరణపైనా కనిపిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) దేశంలో పరపతి వృద్ధి రేటు 6.5 లేదా ఏడు శాతం మించక పోవచ్చని పరపతి రేటింగ్ సంస్థ ఇక్రా తెలిపింది. గత 58 సంవత్సరాల్లో పరపతి వృద్ధి రేటు ఎన్నడూ ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోలేదు. కొన్ని ఇబ్బందులున్నా గత ఆర్థిక సంవత్సరం(2018-19)లోనూ పరపతి వృద్ధి రేటు 13.3 శాతం నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరు 6 నాటికి గత ఏడాదితో పోలిస్తే రుణాల మంజూరు రూ.80,000 కోట్లు మాత్రమే పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నమోదైన రూ.5.4 లక్షల కోట్లతో పోలిస్తే ఇది చాలా తక్కువ.

## పాన్-ఆధార్ అనుసంధానానికి మరో మూడు రోజులే గడువు

న్యూఢిల్లీ: పాన్ (శాశ్వత గుర్తింపు సంఖ్య)తో ఆధార్ అనుసంధానానికి మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉంది. పాన్‌తో ఆధార్ లింక్‌కు ఎప్పటికప్పుడు గడువు పొడిగిస్తూ వచ్చిన ప్రభుత్వం ఈ దఫా డిసెంబరు 31 తర్వాత గడువు పొడిగించేదిలేదని స్పష్టం చేసింది. ఆధార్‌తో అనుసంధానం చేసుకోలేని పక్షంలో పాన్ పనిచేయదని పేర్కొంది. ఈ ఏడాది జూలైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయ పన్ను చట్టంలో ఈ మేరకు సవరణను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ రెండింటి అనుసంధానం కోసం ఆదాయ పన్ను వెబ్‌సైట్‌లో ఆధార్, పాన్ అనుసంధానం లింక్‌పై క్లిక్ చేసి, ఆ రెండింటి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నెలాఖరులోపు రెండింటినీ జతచేయడంలో విఫలమైతే.. ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 139ఏఏ (2) ప్రకారం పాన్ కార్డును రద్దు చేస్తారు. ఒకవేళ తుది గడువు ముగిసిన తర్వాత అనుసంధానిస్తే పాన్ మళ్లీ పనిచేస్తుందా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. తుది గడువు దాటిపోతే పాన్ కార్డు 'ఇన్‌ఆపరేటివ్' పరిగణించే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

# ఎల్ఐసీ రూ.2,611 కోట్ల డివిడెండ్

న్యూఢిల్లీ: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) 2018-19 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వానికి రూ.2,610.74 కోట్ల డివిడెండ్‌ను చెల్లించింది. శుక్రవారంనాడిక్కడ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ చైర్మన్ ఎంఆర్ కుమార్ ఈ డివిడెండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ కార్యదర్శి రాజీవ్ కుమార్, ప్రత్యేక కార్యదర్శి దేబాశిష్ పాండా పాల్గొన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఎల్ఐసీ వాల్యుయేషన్ సర్‌ప్లస్ 9 శాతం వృద్ధితో రూ.53,214.41 కోట్లకు చేరుకుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మొత్తం పాలసీల్లో ఎల్ఐసీ మార్కెట్ వాటా 76.28 శాతం ఉండగా.. ఈ ఏడాది నవంబరు 30నాటికి తొలి ఏడాది ప్రీమియం వసూళ్లలో 71 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపింది. ఎల్ఐసీ చరిత్రలో వాల్యుయేషన్ సర్‌ప్లస్ రూ.50,000 కోట్లను అధిగమించటం ఇదే తొలిసారి కావటం విశేషం. 63 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎల్ఐసీ ప్రస్తుతం రూ.31.11 లక్షల కోట్లకు ఆస్తులను నిర్వహిస్తోంది. ఏటా వార్షిక ఆదాయం రూ.5.61 లక్షల కోట్లుగా ఉంది. 2018-19లో ఎల్ఐసీ తొలి ఏడాది ప్రీమియం అత్యధికంగా రూ.1,42,191.69 కోట్లుగా ఉంది. ఎల్ఐసీ చరిత్రలో ఇది రికార్డు. కాగా గడచిన ఆర్థిక సంవత్సరానికి 2.59 కోట్ల క్లెయిమ్స్‌కు సంబంధించి రూ.1.63 లక్షల కోట్ల మొత్తాన్ని ఎల్ఐసీ చెల్లించింది.



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు డివిడెండ్ చెక్‌ను అందజేస్తున్న ఎల్ఐసీ చైర్మన్ కుమార్

## లాట్ మొబైల్స్ స్టోర్లలో న్యూ ఇయర్ ఆఫర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని లాట్ మొబైల్స్ న్యూ ఇయర్ ఆఫర్లను ప్రకటించింది. ఇందులో భాగంగా మొబైల్ ఫోన్ల కొనుగోలుపై బహుమతులతోపాటు మొబైల్ ఎక్స్ఛేంజీపై 60 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించింది. అదనంగా ఎక్స్ఛేంజీ బోనస్ కింద రూ.5,000 వరకూ, 30 శాతం వరకూ పేటీఎం క్యాష్ బ్యాక్, 10 శాతం వరకూ హెచ్‌డీఎఫ్‌సీ క్యాష్ బ్యాక్ పొందవచ్చని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. లాట్ స్టోర్లలో రెడ్‌మీ, టీసీఎల్ స్మార్ట్ టీవీలను కూడా విక్రయిస్తున్నారు. రూ.12,499 ధర నుంచి స్మార్ట్ టీవీ లభిస్తుంది. వన్‌ప్లస్ 7టీ మొబైల్ కొనుగోలుపై రూ.3,000, ఐఫోన్ 11 అండ్ 11 ప్రో మొబైల్‌పై రూ.6,000 ఆదా చేయొచ్చని కంపెనీ వెల్లడించింది. ఇతర ఫోన్లపై కూడా ఆఫర్లు ఇస్తున్నట్లు తెలిపింది.

# విమానయానమా.. వామ్మో!

**పెరుగుతున్న సర్వీసుల రద్దు .. హైదరాబాద్‌లోనూ ఇదే పరిస్థితి .. ప్రయాణికులకు అగచాట్లు**

త్వరగా వెళ్లొచ్చని విమాన టికెట్ బుక్ చేసుకున్నారా? అయితే ఒకసారి ఆలోచించండి. మీరు టికెట్ బుక్ చేసుకున్న విమానం.. ఆ రోజు అసలు బయలుదేరుతుందో లేదో నమ్మకం లేదు. ఒకవేళ బయలుదేరినా, సమయానికి బయలుదేరుతుందనే నమ్మకం పెట్టుకోవద్దు. చవక విమానయాన సంస్థలైన ఇండిగో, గో ఎయిర్ విమానాల్లో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు ఇటీవల ఎక్కువగా ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. దేశంలోని దాదాపు అన్ని ప్రధాన విమానాశ్రయాల్లోనూ ఇదే పరిస్థితి. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలోనూ గత వారం హైదరాబాద్ నుంచి కోచి వెళ్లాల్సిన గో ఎయిర్ విమాన సర్వీసును అర్ధాంతరంగా రద్దు చేశారు. దీంతో ఈ విమానంలో టికెట్లను బుక్ చేసుకున్న ప్రయాణికులు ఆందోళన చేయాల్సి వచ్చింది. అయితే విమాన సర్వీసుల రద్దుకు చాలా కారణాలున్నాయని, ఉత్తర భారతంలో నెలకొన్న పరిస్థితులతో పాటు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవటం వంటివి ప్రధాన కారణాలని విమానయాన సంస్థలంటున్నాయి.

### పైలెట్ల కొరత

ప్రస్తుతం దేశంలోని అనేక విమానయాన సంస్థల్ని పైలెట్ల కొరత వేధిస్తోంది. దేశీయ విమానయాన సంస్థలు ప్రస్తుతం 650కి పైగా విమానాలు నడుపుతున్నాయి. ఈ విమానాలు నడిపేందుకు దేశంలో 8,000 మంది పైలెట్లు అందుబాటులో ఉన్నారు. అయినా అనేక విమానయాన సంస్థలను ఇంకా పైలెట్ల కొరత వేధిస్తోంది. గో ఎయిర్‌లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. దీంతో సమయానికి పైలెట్లు అందుబాటులో లేక అనేక ఎయిర్‌లైన్స్ సంస్థలు చివరి నిమిషంలో విమాన సర్వీసులు రద్దు చేస్తున్నాయి.

### విశ్రాంతి నిబంధనలు

ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) ఇటీవల పైలెట్ల విశ్రాంతి నిబంధనలను తప్పనిసరిగా అమలు చేస్తోంది. నిర్ణీత పని గంటల అనంతరం పైలెట్లకు విశ్రాంతిని తప్పని సరిచేసింది. దీంతో విమానయాన సంస్థలకు, ఉన్న పైలెట్లతో ఎక్కువ సమయం పని చేయించుకునే అవకాశం లేకుండా పోయింది. ఇది కూడా సర్వీసుల రద్దుకు ఒక కారణంగా ఉంది.

### విదేశాల్లో అవకాశాలు

భారతీయ పైలెట్లకు ఆగ్నేయాసియా, పశ్చిమాసియా దేశాల్లోనూ మంచి డిమాండ్ ఉంది. దేశీయ విమానయాన సంస్థలతో పోలిస్తే ఈ దేశాల విమాన సంస్థలు ఎక్కువ జీతభత్యాలు ఆఫర్ చేస్తున్నాయి. దీంతో కొంత మంది పైలెట్లు అక్కడి ఎయిర్‌లైన్స్‌లో చేరుతున్నారు.

### సాంకేతిక సమస్యలు

ఈ మధ్యకాలంలో ఎయిర్‌బస్ ఏ320 నియో, బోయింగ్ 737 మాక్స్ విమానాల్లో తరచూ సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. ఏ320 నియో విమానాల్లోని ప్రాట్ అండ్ విట్నీ (పీడబ్ల్యూ) ఇంజన్లలో ఈ సమస్యలు మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయి. టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే సాంకేతిక సమస్యలతో ఈ ఇంజన్లు మొరాయిస్తున్నాయి. దీంతో ఈ విమానాలను అత్యవసరంగా ల్యాండింగ్ చేయాల్సి వస్తోంది. ఇదే సమయంలో ప్రయాణికుల కోసం మరో విమానాన్ని అందుబాటులోకి తీసుకురావటంలో విమానయాన సంస్థలు విఫలం కావటంతో సర్వీసులను భారీగా రద్దు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఏ320 విమానాలను అత్యధికంగా వినియోగిస్తున్న ఇండిగో, గోఎయిర్ విమాన సంస్థలకు ఇది మరింత ఇబ్బందికరంగా మారింది. పీడబ్ల్యూ ఇంజన్లతో సమస్యలు వస్తుండటంతో వెంటనే మార్చాలని అన్ని విమానయాన సంస్థలను నియంత్రణ సంస్థ డీజీసీఏ ఆదేశించింది.

### విమానాల సరఫరాలో జాప్యం

భారత్‌కు చెందిన పలు విమానయాన సంస్థలు.. భారీగా ఎయిర్‌బస్ ఏ320 నియో, బోయింగ్ కంపెనీ బీ737 మాక్స్ విమానాల కోసం ఆర్డర్లు ఇచ్చాయి. అయితే ఈ విమానాల్లో ఇటీవల అనేక సాంకేతిక సమస్యలు వెలుగుచూశాయి. దీంతో ఆ కంపెనీలు ఆ లోపాల్ని సరిదిద్దే పనిలో పడ్డాయి. ఈ కారణంగా ముందు హామీ ఇచ్చిన సమయానికి, విమానాలు సరఫరా చేయలేక పోతున్నాయి. ఇదే సమయంలో ప్రయాణికుల సంఖ్య పెరింది. పెరిగిన రద్దీకి అనుగుణంగా విమానాలు లేకపోవడంతో, విమాన సర్వీసుల రద్దు పెరిగి పోయింది.

### ప్రతికూల వాతావరణం

ప్రస్తుతం ఉత్తర భారతాన్ని చలి వణికిస్తోంది. ఢిల్లీతో సహా అనేక విమానాశ్రయాలను దట్టమైన పొగ మంచు కప్పేస్తోంది. దీంతో రన్‌వేలపై విమానాలు దిగటం, టేకాఫ్ తీసుకోవడం కష్టంగా మారింది. ఫలితంగా అనేక విమాన సర్వీసులు రద్దవుతున్నాయి. లేదా రావాల్సిన విమానాల్ని వేరే ఎయిర్‌పోర్టులకు మళ్లిస్తున్నారు. జనవరి నెలాఖరు వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని అంచనా. పొగ మంచు కారణంగా ఈ మధ్య కాలంలో హైదరాబాద్ విమానాశ్రయంలో దిగాల్సిన కొన్ని విమానాలను సమీపంలోని విమానాశ్రయాలకు మళ్లించారు.

### కష్టాలు తీరేనా ?

కొత్త సంవత్సరంలోనూ ఈ సమస్యలు తీరే సూచనలు కనిపించడం లేదు. ఏ320 నియో విమానాల్లో ఉపయోగిస్తున్న పీడబ్ల్యూ ఇంజన్ల లోపాలకు ఇంకా పరిష్కారం దొరకలేదు. బోయింగ్ బీ737 మాక్స్ విమానాలదీ ఇదే పరిస్థితి. సమస్యలు తీరే వరకు దేశీయ విమానయాన సంస్థలకు అదనపు విమానాలు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఇదే సమయంలో పైలెట్ల కొరత కూడా పెద్దగా తీరకపోవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## ఇళ్ల ధరల వృద్ధిలో భారత్‌కు 47వ స్థానం

**» నైట్ ఫ్రాంక్ వెల్లడి**

న్యూఢిల్లీ: ఇళ్ల ధరల వృద్ధి విషయంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 56 దేశాల్లో భారత్ 47వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో మన దేశంలో ఇళ్ల ధరలు గత ఏడాది ఇదేకాలంతో పోల్చితే కేవలం 0.6 శాతం పెరిగాయని గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ వెల్లడించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఇళ్ల ధరలు 7.7 శాతం పెరిగాయి. అప్పుడు భారత్ 11వ స్థానంలో ఉందని నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. కాగా అమ్మకాలు నెమ్మదిగా జరగడం, అధిక ఇన్వెంటరీ, డెవలపర్ల వద్ద నగదు లేకపోవడం వంటి అంశాలు ఇళ్ల ధరలను ప్రభావితం చేస్తున్నట్టు నివేదిక పేర్కొంది. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ చట్టం, వస్తు సేవల పన్ను, బినామీ లావాదేవీల నిరోధక చట్టం వంటివి మార్కెట్లో పరిస్థితులను మార్చినట్టు తెలిపింది.

## అదానీ చేతికి స్నోమాన్ లాజిస్టిక్స్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్.. కోల్డ్ చెయిన్ లాజిస్టిక్స్ విభాగంలోకి అడుగుపెట్టింది. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన అదానీ లాజిస్టిక్స్ లిమిటెడ్.. లాజిస్టిక్స్‌లో మెజారిటీ వాటాను చేజిక్కించుకోవటం ద్వారా ఈ విభాగంలోకి ప్రవేశించింది. గేట్‌వే డిస్ట్రిపార్క్స్ లిమిటెడ్ నుంచి స్నోమాన్ లాజిస్టిక్స్ లిమిటెడ్‌లో 40.25 శాతం వాటాలను రూ.296 కోట్లకు కొనుగోలు చేసినట్లు అదానీ వెల్లడించింది. ఈ మేరకు ఒప్పందం కూడా కుదుర్చుకున్నట్లు తెలిపింది. దేశీయ కోల్డ్ చెయిన్ మార్కెట్లో స్నోమాన్ వాటా 30 శాతంగా ఉంది.

## విదేశీ మారక నిల్వలు 45,500 కోట్ల డాలర్లు



ముంబై: భారత్ విదేశీ మారక నిల్వలు సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయికి చేరాయి. డిసెంబరు 20తో ముగిసిన వారంలో విదేశీ మారక నిల్వలు 45.6 కోట్ల డాలర్లు పెరిగి 45,494.8 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. క్రితం వారంలో ఈ నిల్వలు 45,449.2 కోట్ల డాలర్లుగా ఉన్నాయి. సమీక్షా వారంలో బంగారం నిల్వలు 16.4 కోట్ల డాలర్లు పెరిగి 2,713.2 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత్ స్పెషల్ డ్రాయింగ్ హక్కులు 10 లక్షల డాలర్లు తగ్గి 144.3 కోట్ల డాలర్లకు చేరుకోగా భారత్ నిల్వలు 1.7 కోట్ల డాలర్లు క్షీణించి 364.2 కోట్ల డాలర్లకు చేరాయని భారత రిజర్వు బ్యాంకు వెల్లడించింది.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)**



| | | | |
|---|---|---|---|
| 27వ తేదీకి.. | | విజయవాడ | 464 |
| హైదరాబాద్ | 450 | విశాఖపట్నం | 475 |
| 28వ తేదీకి.. | | వరంగల్ | 453 |
| చిత్తూరు | 478 | డజను గుడ్లు రూ. 69 | |
| గోదావరి | 464 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 100 | విజయవాడ | 100 |
| వరంగల్ | 100 | గుంటూరు | 100 |
| మహబూబ్‌నగర్ | 100 | ఒంగోలు | 102 |
| కరీంనగర్ | 100 | చిత్తూరు | 90 |
| కర్నూలు | 100 | నెల్లూరు | 90 |
| విశాఖపట్నం | 100 | అనంతపురం | 93 |
| గోదావరి | 100 | | |



**బులియన్**

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 39,010 | 39,150 | --- | 39,200 | 38,990 |
| క్రితం ముగింపు | 38,910 | 39,150 | 40,040 | 39,250 | 38,770 |
| 22 క్యారెట్లు | 37,140 | 36,250 | --- | 36,340 | 37,140 |
| క్రితం ముగింపు | 37,000 | 36,250 | 36,830 | 36,250 | 36,920 |
| వెండి (కిలో) | 46,600 | 47,500 | --- | 47,400 | 50,200 |
| క్రితం ముగింపు | 46,900 | 48,000 | 47,900 | 47,700 | 50,400 |

## బ్యాంక్ షేర్ల దన్ను

**» మూడు రోజుల నష్టాలకు తెర**

**» 411 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్**

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో మూడు రోజుల వరుస నష్టాలకు శుక్రవారంనాడు తెరపడింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ షేర్లకు లభించిన కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లో ర్యాలీ నెలకొంది. బీఎస్ఈ సూచీ సెన్సెక్స్ 411.38 పాయింట్లు పెరిగి 41,575.14 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 41,611.27 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 119.25 పాయింట్లు పెరిగి 12,245.80 పాయింట్ల వద్ద క్లోజైంది. మొత్తంగా ఈ వారంలో సెన్సెక్స్ 106.4 పాయింట్లు, నిఫ్టీ 26 పాయింట్లు తగ్గాయి.

శనివారంనాడు ప్రభుత్వరంగ బ్యాంకుల సీఈఓలతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా బ్యాంకుల ఆర్థిక పనితీరు, వ్యాపార వృద్ధిపై సమీక్ష నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకు షేర్లలో ర్యాలీ నెలకొంది. సెన్సెక్స్ షేర్లలో యాక్సిస్ బ్యాంకు షేరు అధికంగా (3.33 శాతం) లాభపడింది. తర్వాత పవర్‌గ్రిడ్, ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంకు, రిలయన్స్ ఇండస్ట్రీస్, మారుతీ షేర్లు ఉన్నాయి. మరోవైపు కోటక్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, టీసీఎస్ కంపెనీల షేర్లు 0.42 శాతం వరకు తగ్గాయి.

"మార్కెట్లలో నెలకొన్న వరుస బలహీనత నేపథ్యంలో ప్రభుత్వరంగంలోని బ్యాంకుల షేరు మార్కెట్ వృద్ధికి దోహదపడ్డాయి. వచ్చే వారంలో బాండ్లను విక్రయించనున్నట్టు సెంట్రల్ బ్యాంక్ ప్రకటించింది. ఇది ఆర్థిక సంస్థల షేర్ల పెరుగుదలకు దారితీసింది. గ్లోబల్ మార్కెట్లలో లాభాలు కూడా దేశీయ మార్కెట్లలో ర్యాలీకి కారణమయ్యాయి" అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- శుక్రవారంనాటి ట్రేడింగ్‌లో బీఎస్ఈ ఎనర్జీ, రియల్టీ, ఆయిల్, గ్యాస్, బ్యాంకెక్స్, ఫైనాన్స్, ఆటో, పవర్ సూచీలు 1.74 శాతం వరకు పెరిగాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ మాత్రం నష్టంతో ముగిసింది.
- బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.87 శాతం వరకు పెరిగాయి.

## శ్రీసిటీలో పానసోనిక్ ప్లాంట్!

**» రూ.295 కోట్లతో ఏర్పాటు**

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ సెజ్‌లో పానసోనిక్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. సుమారు రూ.294.60 కోట్ల పెట్టుబడితో ఈ యూనిట్‌ను నెలకొల్పనుంది. ఎలక్ట్రిక్ ఉత్పత్తులు, వైర్లు తదితర ఉత్పత్తులను పానసోనిక్ ఇక్కడ ఉత్పత్తి చేయనుంది. ఉత్తరాదిలో ప్లాంట్లను నిర్వహిస్తున్న పానసోనిక్ దక్షిణాదిన కార్యకలాపాలను విస్తరించాలనే ఉద్దేశంతో శ్రీసిటీలో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. 2021 నాటికల్లా ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ యూనిట్ ద్వారా సుమారు 600 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

## నెల్కోతో విస్తారా జట్టు

**» త్వరలో విమానంలో డేటా సేవలు**

న్యూఢిల్లీ: విమాన ప్రయాణికులకు డేటా సేవలను అందించేందుకు టాటా గ్రూప్‌నకు చెందిన నెల్కోతో విస్తారా జట్టు కట్టింది. సాధ్యమైనంత త్వరలో ప్రయాణికులకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు టెలికాం శాఖ కార్యదర్శి అన్షు ప్రకాశ్ వెల్లడించారు. ఈ డేటా సేవల కోసం అవసరమైన స్పెక్ట్రమ్‌ను ఇప్పటికే కేటాయించినట్లు ఆయన చెప్పారు. డేటా సర్వీసుల కోసం నెల్కోతో జట్టు కట్టిన విస్తారా.. ఇస్రో నుంచి ఇప్పటికే ట్రాన్స్‌పాండర్ స్పేస్‌ను తీసుకుఉందని వివరించారు. కాగా విమానాల్లో డేటా సేవలపై టారిఫ్‌ను ప్రభుత్వం నియంత్రించడం లేదని, దానిపై ఎంత చార్జి విధించాలన్నది ఆయా సంస్థల ఇష్టమని ఆయన పేర్కొన్నారు. అయితే.. విస్తారా ప్రతినిధి మాత్రం డేటా సేవల్ని అందించే విషయమై తామింకా తుది నిర్ణయానికి రాలేదని చెప్పడం గమనార్హం.



# కష్టాల నుంచి గట్టెక్కే యత్నం

**» విమానాశ్రయాల వ్యాపారంలో వాటా విక్రయించిన జీఎంఆర్, జీవీకే**

**» వ్యాపార పునర్‌వ్యవస్థీకరణలో ఔషధ కంపెనీలు**





హైదరాబాద్ కంపెనీలకు 2019 కాస్త కలిసొచ్చిందనే చెప్పాలి.. ఇన్‌ఫ్రా, ఫార్మా రంగాలకు చెందిన కంపెనీలు వ్యాపార పునర్ వ్యవస్థీకరణ, విస్తరణ, ఆస్తులు, అప్పుల పట్టికను పటిష్ఠం చేసుకోవడంపై, రుణ భారాన్ని తగ్గించుకోవడంపై దృష్టిపెట్టాయి. రుణ భారాన్ని తగ్గించుకోడానికి జీఎంఆర్, జీవీకేలు విమానాశ్రయాల వ్యాపారంలో వాటాను విక్రయించి నిధులు సమీకరిస్తే.. ఔషధ కంపెనీ డాక్టర్ రెడ్డీస్ న్యూట్రాస్యూటికల్స్ వ్యాపారంలోకి, నాట్కో అగ్రికెమికల్స్ ఉత్పత్తుల తయారీకి అడుగుపెట్టాయి. భవిష్యత్తులో చైనా మార్కెట్‌లోని అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అరబిందో ఫార్మా చైనాలో సంయుక్త సంస్థను ఏర్పాటు చేసింది. క్రితం ఏడాదితో పోలిస్తే 2019లో హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ అనుమతుల పరంగా కొంత ఊరట లభించిందనే చెప్పాలి. ఫైనాన్షియల్ సేవల రంగంలో కార్వీ గ్రూప్‌నకు చెందిన కార్వీ స్టాక్ బ్రోకింగ్‌పై సెబీ సస్పెండ్ వేటు వేయడం 2019లో హైదరాబాద్ కార్పొరేట్ కంపెనీలకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. దాదాపు 95 మంది ఖాతాదారులకు చెందిన రూ.2,300 కోట్ల విలువైన షేర్లను తాకట్టు పెట్టి నిధులు సమీకరించి గ్రూప్ కంపెనీలకు తరలించిందన్న ఆరోపణలపై కార్వీ స్టాక్ బ్రోకింగ్ లైసెన్స్‌ను సెబీ సస్పెండ్ చేసింది. హైదరాబాద్‌కు చెందిన టర్బో ఏవియేషన్.. బ్రిటన్ వ్యాపార గ్రూప్‌తో చేతులు కలిపి విమానయాన సేవలందించడానికి సిద్ధమైంది. సాఫ్ట్‌వేర్ రంగంలో హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడానికి ఇంటెల్ వంటి అంతర్జాతీయ కంపెనీలు వరుస కట్టాయి.

దేశ, విదేశాల్లో విమానాశ్రయాల అభివృద్ధి లక్ష్యంతో జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 2019లో పురోగతి సాధించింది. గ్రీస్‌లో హెరాక్లెన్ అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం, నిర్వహణను జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ దక్కించుకుంది. గ్రీక్ భాగస్వామి టెర్నా గ్రూప్‌తో దీన్ని అభివృద్ధి చేస్తోంది. గోవాలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం ప్రాథమిక పనులను ప్రారంభించింది. నాగపూర్, భోగాపురం విమానాశ్రయాల అభివృద్ధి పనులను దక్కించుకుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్‌లో టాటా గ్రూప్, జీఐసీ, ఎస్ఎస్‌జీ క్యాపిటల్ రూ.8,000 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం కుదుర్చుకున్నాయి. జీవీకే పవర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రుణ భారాన్ని తగ్గించుకోవడానికి విమానాశ్రయాల వ్యాపారంపై దృష్టిపెట్టింది. జీవీకే ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్‌లో రూ.7,614 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ, పీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్స్, నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. రుణాల్లో కూరుకుపోయిన ఐవీఆర్‌సీఎల్‌ను విక్రయించే ప్రక్రియను లిక్విడేటర్ ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ఎన్‌సీసీపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. దాదాపు రూ.6,000 కోట్ల ప్రాజెక్టులపై ఎన్‌సీసీ అయోమయంలో పడింది.

-హైదరాబాద్, ఆంధ్రజ్యోతి బిజినెస్

### ఔషధ రంగంలో..

డాక్టర్ రెడ్డీస్ పౌష్టికాహార (న్యూట్రిషన్) ఉత్పత్తుల విభాగంలోకి అడుగుపెట్టింది. మధుమేహ రోగుల కోసం న్యూట్రిషన్ డ్రింక్‌ను విడుదల చేసింది. అమెరికా మార్కెట్‌లో కొన్ని న్యూరాలజీ డెర్మటాలజీ ఔషధాల మార్కెటింగ్ హక్కులను విక్రయించడం ద్వారా డాక్టర్ రెడ్డీస్ వ్యాపార పునర్‌వ్యవస్థీకరణపై దృష్టిపెట్టింది. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో కీలకమైన అగ్రి కెమికల్స్ ఉత్పత్తుల తయారీకి యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఇందుకోసం దాదాపు రూ.100 కోట్లను వెచ్చించింది. ఔషధాల అభివృద్ధి, తయారీ, మార్కెటింగ్, పంపిణీ కోసం చైనాలో అరబిందో ఫార్మా సంయుక్త సంస్థను ఏర్పాటు చేసింది. సంయుక్త సంస్థ ఏర్పాటుకు షాంఘై లాంగ్జిన్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, హాంకాంగ్‌కు చెందిన స్వేవా కేపిటల్‌తో అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ హెలిక్స్ హెల్త్‌కేర్ బీవీ నెదర్లాండ్స్ ఒప్పందం కుదుర్చుకుంది. అరబిందో ఫార్మా చైనాలో సంయుక్త సంస్థను ఏర్పాటు చేస్తే.. పెట్టుబడులను తగ్గించుకునే లక్ష్యంతో గ్రాన్యూల్స్ ఇండియా చైనాలోని సంయుక్త సంస్థలో వాటాను చైనా భాగస్వామికి విక్రయించింది. కీలకమైన వ్యాపారంపై దృష్టి పెట్టేందుకు అజినోమోటో ఓమ్నికెమ్‌తో కలిసి ఏర్పాటు చేసిన సంయుక్త సంస్థలో కూడా గ్రాన్యూల్స్ వాటాను భాగస్వామికి విక్రయించింది.

హైదరాబాద్‌కు చెందిన లారస్ ల్యాబ్స్ గత ఏడాది దక్షిణాఫ్రికాకు చెందిన ఫెకొలాంగ్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీని సొంతం చేసుంది. సబ్ సహారా ప్రాంతంలో ఎయిడ్స్ ఔషధాల సరఫరాకు గ్లోబల్ ఫండ్‌తో కూడా లారస్ వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది.



## నంబి నారాయణన్‌కు రూ.1.30 కోట్ల పరిహారం

తిరువనంతపురం, డిసెంబరు 27: ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ (77)కు రూ.1.30 కోట్ల పరిహారం ఇవ్వాలని కేరళ ప్రభుత్వం నిర్ణయించింది. భారత అంతరిక్ష ప్రయోగాల రహస్య సమాచారాన్ని విదేశాలకు చేరవేశారంటూ నారాయణన్‌పై 1994లో అభియోగాలు వచ్చాయి. ఈ ఉదంతంలో ఆయన రెండు నెలలు జైలులో ఉన్నారు. సీబీఐ విచారణలో.. ఆరోపణలు తప్పని తేలడంతో నారాయణన్‌కు రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని సుప్రీం కోర్టు, రూ.10 లక్షలు ఇవ్వాలని మానవ హక్కుల సంఘం ఆదేశించాయి. అన్యాయంగా అరెస్టు చేయడం, ,వేధింపులకు అదనపు పరిహారం కోరుతూ కోర్టులో ప్రభుత్వంపై నారాయణన్ కేసు వేశారు. దీంతో డబ్బు చెల్లించాలని నిర్ణయించారు.



## వివాదాస్పద ఐపీఎస్ రాజీవ్‌కుమార్‌కు ఐఏఎస్ పోస్టు

కోల్‌కతా, డిసెంబరు 27: వివాదాస్పద ఐపీఎస్ అధికారి రాజీవ్ కుమార్‌ను ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శిగా పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ నియమించారు. ఇంతవరకు ఈ పోస్టును ఐఏఎస్‌లకు కేటాయించేవారు. అయితే, శారదా చిట్‌ఫండ్ స్కాంను దర్యాప్తు చేసిన రాజీవ్.. తృణమూల్ నేతలను ఒడ్డున పడేశారు. ఆయనపై సీబీఐ దర్యాప్తు తీవ్ర రాజకీయ వివాదమైంది. రాజీవ్‌కు మద్దతుగా మమత ధర్నా చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ వేరే రాష్ట్రంలో విచారించింది. తృణమూల్ నేతల ప్రమేయం ఉన్న డాక్యుమెంట్లు, సీడీలను రాజీవ్ ధ్వంసం చేసినట్లు ఆరోపణ.



## ఉగ్ర గ్రూపుల అంతర్గత పోరు

» జైషే, లష్కర్, హిజ్బుల్ మధ్య విభేదాలు

శ్రీనగర్, డిసెంబరు 27: ఆర్టికల్ 370 నిర్వీర్యం తరువాత ఉగ్రవాద తండాలు- హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మొహమ్మద్, లష్కరే తొయిబా మధ్య అంతర్గత విభేదాలు నెలకొన్నట్లు నిఘావర్గాల సమాచారం. 'మా ఏరియా ఇది.. ఇటు రావొద్దు. టార్గెట్లను నిర్దేశించవద్దు' అని హిజ్బుల్, జైషే కొట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది. వారికి దిశానిర్దేశం చేస్తున్న పాకిస్థానీ సైనిక, నిఘా నాయకత్వాన్ని ఇది తీవ్ర అసహనానికి గురిచేస్తోంది. దీంతో 'కొట్టుకోకండి. మీ గొడవలు శత్రుపక్షాలకు ఆయుధమవుతాయి' అని చెప్పినట్లు సమాచారం.



## మిగ్‌కు బైబై

మూడు దశాబ్దాల పాటు భారత వాయుసేన(ఐఏఎఫ్)కు సేవలందించిన మిగ్-27 యుద్ధ విమానాలు చరిత్రపుటల్లోకి మౌనంగా నిష్క్రమించాయి. కార్గిల్ సహా పలు యుద్ధాల్లో ఈ విమానాలు భారత దళాలకు వెన్నెముకగా నిలిచాయి. పూర్వపు రష్యా నుంచి వీటిని కొనుగోలు చేశారు. ఇటీవల తరచూ కూలిపోతుండటంతో వీటిని పూర్తిగా ఉపసంహరించాలని ఐఏఎఫ్ నిర్ణయించింది. జోధ్‌పూర్ ఎయిర్‌బేస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో చివరి మిగ్‌కు ఐఏఎఫ్ అధికారులు బైబై చెప్పేశారు.



మనుషుల పట్ల మూగజీవాలకు ఎంత ప్రేమ ఉంటుందో ఈ ఫొటోను చూస్తే తెలుస్తుంది. తన యజమానిని ఒంటె ఎంతో ఆప్యాయంగా హత్తుకుంటున్న ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. 7 సెకన్ల నిడివి ఉన్న ఆ వీడియోను ఐఎఫ్ఎస్ అధికారి సుశాంత నందా పోస్ట్ చేశారు. 'ఒంటె యజమాని సొంత పని మీద కొన్ని రోజులు ఊరెళ్లాడు. బెంగపడిన ఒంటె.. ఆయన తిరిగొచ్చిన తర్వాత హత్తుకోవడం చూస్తే మూగజీవాల ప్రేమ ఎంత స్వచ్ఛమో అర్థం అవుతుంది' అంటూ ఆయన ట్వీట్ చేశారు.

## కొత్త సంవత్సరంలో తేదీ వేసేప్పుడు జాగ్రత్త!

### డీడీ/ఎంఎం/వైవై ఫార్మట్‌తో ప్రమాదం.. 2020 సంవత్సరాన్ని పూర్తిగా రాస్తేనే క్షేమం

**చెక్‌పై రెండంకెలే వేస్తే ఫ్రాడ్‌కు అవకాశం**



న్యూఢిల్లీ, డిసెంబరు 27: కొత్త సంవత్సరంలో చెక్కు మీద, ఇతర లీగల్ డాక్యుమెంట్ల మీద తేదీ వేసేటప్పుడు జాగ్రత్త! సంవత్సరం రాసేచోట 'డిడి/ఎంఎం/వైవై' పద్ధతిలో రెండు అంకెలు వేసే అలవాటు ఉన్న వారికి ప్రమాదం. వారిచ్చే చెక్కులను, ఇతర డాక్యుమెంట్లను తీసుకున్న వారు వాటిని దుర్వినియోగం చేయడానికి అవకాశం ఉంది. ఉదాహరణకు 13వ తేదీ జనవరి 2020 సంవత్సరం అని రాయడానికి 13/01/20 అని రాశారంటే కోరి కొరివి తెచ్చుకున్నట్లే. దాన్ని ఎవరైనా ట్యాంపర్ చేసి 2000 నుంచి 2099 వరకు ఏ అంకెనైనా చివర్లో వేసుకొనే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఆ డాక్యుమెంటునే మీకు వ్యతిరేకంగా వినియోగించుకొనే ప్రమాదం ఉంది. అందుకే, 2020 సంవత్సరంలో ఏడాదంతా తేదీ వేసేటప్పుడు 'డిడి/ఎంఎం/వైవైవైవై' ఫార్మట్‌నే పాటించాలి. సోమరితనానికి పోకుండా సంవత్సరం మొత్తం 2020 అని రాయాలి. అలా చేయకపోతే ఫ్రాడ్‌కు చేజేతులా అవకాశం ఇచ్చిన వాళ్లం అవుతాం. 2021 సంవత్సరం వచ్చాక మళ్లీ వందేళ్లపాటు ఏళ్లపాటు మీ ఇష్టం!

## మళ్లీ పెన్షన్ కమ్యుటేషన్!

### పునరుద్ధరించనున్న కార్మిక శాఖ

### 6.3 లక్షల మందికి ప్రయోజనం

న్యూఢిల్లీ, డిసెంబరు 27: పెన్షన్ కమ్యుటేషన్ విధానాన్ని కేంద్ర కార్మిక శాఖ పునరుద్ధరించనుంది! ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) తీర్మానాన్ని ఈ మేరకు ఆమోదిస్తూ జనవరి 1న నోటిఫికేషన్ విడుదల చేయనుంది. నెలవారీ వచ్చే పెన్షన్ సొమ్ములో మూడో వంతు మినహాయింపునకు సమ్మతి తెలపడం ద్వారా రిటైర్డ్ ఉద్యోగులు ఆ మినహాయింపు మొత్తాన్ని ఏకమొత్తంగా ముందే పొందే అవకాశమే పెన్షన్ కమ్యుటేషన్. గతంలో పదేళ్ల పాటు ఇలా అనుమతి ఉండేది. ఇప్పుడు 15 ఏళ్లకు పెంచుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల 6.3 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందన్నది అధికార వర్గాల మాట.

## ఏటీఎంలో విత్‌డ్రాకు ఓటీపీ

- » స్టేట్ బ్యాంకు సరికొత్త నిబంధన
- » రాత్రి 8 నుంచి ఉదయం 8 మధ్యే
- » జనవరి 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ, డిసెంబరు 27: ఏటీఎం లావాదేవీల్లో మోసాలను నిరోధించి, తమ ఖాతాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ఎస్‌బీఐ సరికొత్త నిబంధన అమల్లోకి తెస్తోంది. జనవరి 1 నుంచి రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల మధ్య రూ.10 వేలకు పైగా నగదును విత్‌డ్రా చేసుకునేవారు ఇకపై వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ) ద్వారా లావాదేవీలను నిర్వహించాల్సి ఉంటుంది. నగదు ఉపసంహరణకు యత్నించినప్పుడు రిజిస్టర్డ్ మొబైల్ నంబరుకు వచ్చే ఓటీపీని ఏటీఎం స్క్రీన్‌పై ఎంటర్ చేస్తేనే లావాదేవీ చేయగలుగుతారు. ఒక ఓటీపీతో ఒకసారి మాత్రమే విత్‌డ్రాకు వీలుంటుంది. నేషనల్ ఫైనాన్షియల్ స్విచ్ (ఎన్‌ఎఫ్‌ఎస్)లో ఈ మార్పు చేయకపోవడంతో.. ఎస్‌బీఐ కార్డుదారులు ఇతర బ్యాంకుల ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరించుకునే సమయంలో మాత్రం ఓటీపీ రక్షణ ఉండదు.

# 500 మంది ఆస్తుల స్వాధీనం!

యూపీ అధికారులకు డిమాండ్ డ్రాఫ్ట్ అందజేస్తున్న ముస్లిం గ్రూపులు



### విధ్వంసకారులను గుర్తించిన యూపీ సర్కారు.. జిల్లా యంత్రాంగాలకు నోటీసులు

లఖ్‌నవూ/ఢిల్లీ/ముంబై, డిసెంబరు 27 ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి పాల్పడితే.. వారినుంచే పరిహారం వసూలు చేస్తామని హెచ్చరించిన ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం చేతల్లోకి దిగింది. సీఏఏ వ్యతిరేక నిరసనలు, అనంతర అల్లర్లలో ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించిన 498 మందిని గుర్తించి వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలంటూ జిల్లా యంత్రాంగాలకు నోటీసు పంపింది. ప్రస్తుతం వీరంతా జైలులో ఉన్నారు. గత శుక్రవారం ప్రార్థనల అనంతరం హింసాత్మక ఘటనల నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఈ శుక్రవారం ప్రార్థనలు ప్రశాంతంగా ముగిసినట్లు డీజీపీ వెల్లడించారు.

**పలుచోట్ల కొనసాగిన నిరసనలు...**

సీఏఏకు వ్యతిరేకంగా శుక్రవారం ప్రదర్శనలు కొనసాగాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని జామామసీదు ప్రాంతంలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. రాజధానిలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. యూపీ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జోర్‌బాగ్‌నుంచి ప్రధానమంత్రి నివాసం వైపు ర్యాలీగా వెళ్తున్న వారిని అడ్డుకున్నారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గా వద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి. ముస్లింలను తప్పుదారి పట్టిస్తున్నారంటూ దర్గా ఆధ్యాత్మిక గురువు జైనుల్ అబెదిన్ అలీఖాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీఏఏకు వ్యతిరేకంగా ముంబైలో అజాద్ మైదాన్‌లో చేపట్టిన ఇంక్విలాబ్ మోర్చాలో ఢిల్లీ, యూపీ నుంచి వచ్చిన విద్యార్థులతో పాటు బాలీవుడ్ నటులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## నేను బతికున్నంత కాలం సీఏఏ అమలు కాదు: మమత

కోల్‌కతా/న్యూఢిల్లీ, డిసెంబరు 27: తాను బతికి ఉన్నంతకాలం బెంగాల్‌లో సీఏఏ అమలు కాదని, పౌరుల హక్కులను ఎవరూ కాలరాయలేరని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ పునరుద్ఘాటించారు. ఏ ఒక్కరూ బెంగాల్‌ను గానీ, దేశాన్ని గానీ వీడాల్సిన అవసరం రాదని, ఎటువంటి నిర్బంధ కేంద్రాలు ఉండబోవని స్పష్టం చేశారు. టాగూర్ రచించిన 'జనగణమన' దేశ ప్రజల ఐక్యతకు స్ఫూర్తి అని ట్విటర్‌లో పేర్కొన్నారు. కాగా.. కేంద్రం సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌లను త్రిశూలంగా చేసి గుండెల్లో గుచ్చుతోందని సీపీఎం నేత బృందా కరత్ ఆరోపించారు. 'ఉద్యోగాలు కల్పిస్తామంటూ అధికారంలోకి వస్తారు. ఆపై యూనివర్సిటీలను, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తారు. నిరసన తెలిపితే ఫూల్స్ అంటారు' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ట్వీట్ చేశారు.

## యూపీ ముస్లింల క్షమాపణ

**ఆస్తినష్టానికి 6.27 లక్షల చెక్.. యోగి సర్కార్‌కు అందజేత**

లఖ్‌నవూ, డిసెంబరు 27: చాలా అరుదైన పరిణామమిది... పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హింసా విధ్వంసాలకు పాల్పడ్డందుకు ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో కొన్ని ముస్లిం గ్రూపులు స్థానిక పాలనాయంత్రాంగానికి క్షమాపణ చెప్పాయి. అంతేకాదు.. తీవ్ర ఆస్తినష్టం కలిగించినందుకు రూ 6.27లక్షల పరిహారాన్ని కూడా చెల్లించాయి. వారు ఈమేరకు ఓ డిమాండ్ డ్రాఫ్ట్‌ను ప్రభుత్వాధికారులకు అందజేశారు. ఆ అందజేస్తున్న ఫోటోలను, వీడియోను యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మీడియాకు విడుదల చేసింది. ఆందోళనకారులు ఓ ప్రభుత్వ వాహనానికి నిప్పుపెట్టారు. అనేక ఇతర వాహనాలను కూడా ధ్వంసంచేశారు. ప్రభుత్వ వాహనాన్ని తగులబెట్టినందుకు చింతిస్తూ ఈ డ్రాఫ్ట్‌ను ఇచ్చారని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. మొత్తం ముస్లిం సమాజం ఏకమై ఈ విరాళాన్ని పోగుచేసి ఇచ్చింది అని స్థానిక కౌన్సిలర్ హాజీ అక్రమ్ అలీ తెలిపారు. బులంద్‌షహర్‌లో మొత్తం 22 మందిపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. 800 మంది కూడా ఈ హింసా విధ్వంసాల్లో పాల్గొన్నట్లు వాటిలో పేర్కొన్నారు. అటు ముజఫర్‌నగర్‌లో కూడా కొందరు ముస్లిం మతపెద్దలు ప్రభుత్వాధికారులను కలిసి క్షమాపణ చెప్పినట్లు కూడా ఆ ప్రకటనలో పేర్కొంది.

## రాహుల్... అబద్ధాలు ఇక చాలు

**సీఏఏలో పౌరసత్వం తొలగించే నిబంధన ఎక్కడుందో చూపాలి: అమిత్ షా**



న్యూఢిల్లీ, డిసెంబరు 27: సీఏఏపై కాంగ్రెస్ పార్టీ వదంతులు వ్యాప్తి చేస్తోందని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ శాంతికి భంగం కలిగిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. 'సీఏఏ వల్ల మైనారిటీలు, ముస్లిం సోదరులు పౌరసత్వం కోల్పోతారని కాంగ్రెస్ అండ్ కంపెనీ అబద్ధాలను ప్రచారం చేస్తోంది. సీఏఏలో అటువంటి నిబంధన ఎక్కడ ఉందో రాహుల్ బాబా (గాంధీ) చూపించాలి' అని సవాల్ విసిరారు. ఇక అబద్ధాలను కట్టిపెట్టాలని సూచించారు. హిమాచల్ ప్రదేశ్‌లో జయరాం ఠాకూర్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా శుక్రవారం సిమ్లాలో నిర్వహించిన సభలో అమిత్ షా ప్రసంగించారు. తమ దేశాల్లోని మైనారిటీలను కాపాడేందుకు 1950లో భారత్, పాకిస్థాన్ సంతకాలు చేసిన నెహ్రూ-లియాఖత్ ఒప్పందాన్ని ప్రస్తావించారు. మైనారిటీల జనాభా పాకిస్థాన్‌లో మూడు శాతానికి, బంగ్లాదేశ్‌లో ఏడు శాతానికి తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి అణచివేతను ఎదుర్కొన్న లక్షలు, కోట్ల మంది భారత్‌కు వచ్చిన వారికి పౌరసత్వం కల్పించాలని ప్రధాని నరేంద్ర మోదీ ధైర్యంగా నిర్ణయం తీసుకున్నారని అన్నారు.

## గల్ఫ్‌లో ప్రవాసీయుల క్రిస్మస్ వేడుకలు



కువైత్‌లో క్రిస్మస్ వేడుకలకు హాజరైన తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రైస్తవులు

('ఆంధ్రజ్యోతి' గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లోని తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దాదాపు అన్నిచోట్ల ఏపీ నుంచి వచ్చిన మత బోధకులు అతిథులుగా హాజరయ్యారు. కువైత్‌లోని మాల్వియా చర్చి వేలాది మందితో కిటకిటలాడింది. పాస్టర్ గద్దె లివింగ్‌స్టోన్ ఆధ్వర్యంలో 48 ఏళ్లగా ఇక్కడ తెలుగులో ప్రార్థనలు జరుగుతున్నాయి. మేడం మైత్రి, వర్మ చర్చిలతో పాటు ఫర్వానియా, అబ్బాసీయా, సాల్మియాలోని చర్చిల్లో వేడుకలు జరిగాయి. దుబాయి తెలుగు క్రైస్తవ సంఘం పాస్టర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో బర్ దుబాయిలో వేడుకలు నిర్వహించారు. బహ్రెయిన్‌లోని అతి పెద్ద చర్చి అయిన ఎన్ఈసీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. బహ్రెయిన్‌లో ఎన్.ఈశ్వర్‌రావు, శ్యాం సునీల్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.



## మమతతో వేదికను పంచుకోం: ఏచూరి

హైదరాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతో వేదికను సీపీఎం పంచుకోబోదని పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో 'దేశాన్ని రక్షించుకుందాం..రాజ్యాంగాన్ని రక్షించుకుందాం' అంశంపై, అనంతరం విలేకరుల సమావేశంలో ఏచూరి మాట్లాడారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ను తెరపైకి తెచ్చి హిందూ దేశంగా మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. వీటిపై నిరసనలను హిందూ-ముస్లిం ఘర్షణలుగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో ఎన్పీఆర్‌ను చేపట్టబోమని సీఎం కేసీఆర్ ప్రకటించాలన్నారు.

## సీఏఏ, ఎన్నార్సీలతో పేదలపై దాడి: రాహుల్

రాయ్‌పూర్, డిసెంబరు 27: సీఏఏ, ఎన్నార్సీల కారణంగా పేదలు అధికారుల వద్దకు వెళ్లి పత్రాలు చూపించాల్సి ఉంటుందని, వాటిలో ఏమాత్రం పొరపాట్లు ఉన్నా.. సరిచేయించుకునేందుకు లంచం ఇవ్వాల్సి వస్తుందని.. ఇవి వారిపై దాడి వంటివేనని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ అన్నారు. నోట్ల రద్దు నాటి సమస్యలనే పేదలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శుక్రవారం ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జాతీయ గిరిజన నాట్య ఉత్సవం-2019 ప్రారంభ కార్యక్రమంలో, విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తమకు నచ్చిన నిర్ణయాలు తీసుకోవచ్చుని, ఏం చేసినా ప్రజలను, దేశాన్ని ఐక్యంగా ఉంచకపోతే ఆర్థిక, నిరుద్యోగ సమస్యలను పరిష్కరించలేమని పేర్కొన్నారు.

# కేంద్రానికీ అమరావతే!

- » ప్రధానే వచ్చి శంకుస్థాపన చేశారు
- » కేంద్రం 2,500 కోట్లు ఇచ్చింది
- » రాజధానిగా కొనసాగించాల్సిందే!!
- » బీజేపీ అధిష్ఠానం స్పష్టత!
- » పెద్దల అనుమతితోనే కన్నా మౌనదీక్ష
- » రైతులపై ఉపరాష్ట్రపతి సానుభూతి
- » చెప్పాల్సినవారికి చెబుతానని హామీ
- » గవర్నర్‌దీ సానుకూల పథమే!
- » ఉధృత పోరాటానికి రైతులు సన్నద్ధం

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు రాజధానుల అంశంపై గందరగోళం నెలకొన్న ప్రస్తుత తరుణంలో.. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గట్టిగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ స్వయంగా వచ్చి శంకుస్థాపన చేసిన రాజధాని నగరాన్ని వేరే చోటకు తరలించడానికి వీల్లేదని బీజేపీ అధిష్ఠానం స్పష్టమైన వైఖరి తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే వైసీపీయేతర పార్టీలన్నీ రాజధానిగా అమరావతి ఉండాలని... భూములిచ్చిన రైతులు చేపడుతున్న ఉద్యమాలకు మద్దతు పలుకుతున్నాయి. ప్రత్యక్షంగానూ నిరసనల్లో పాల్గొంటూ టీడీపీ, జనసేన, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలన్నీ తమ వైఖరిని తేటతెల్లం చేశాయి. బీజేపీయే తొలుత కాస్త తటపటాయించింది. వాస్తవానికి మూడు రాజధానుల యోచన గురించి సీఎం జగన్ అసెంబ్లీలో ప్రకటన చేసిన వెంటనే బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఇంకొందరు ఆ పార్టీ నేతలు సమర్థించారు. అభివృద్ధి వికేంద్రీకరణను బీజేపీ కూడా కోరుకుంటోందన్నారు. అయితే జరిగేది పాలన వికేంద్రీకరణ మాత్రమేనని మంత్రుల మాటలతో తేలిపోవడంతో ఒకట్రెండు రోజుల్లోనే కన్నా తన స్వరం మార్చారు. రాజధాని అమరావతిలోనే ఉండాలని.. ఎక్కడకూ తరలించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బీజేపీ అధిష్ఠానం సూచనలతోనే ఆయన తన వైఖరి మార్చుకున్నట్లు తెలిసింది. రాజధాని నిర్మాణానికి కేంద్రం రూ.2,500 కోట్లు ఇచ్చిందని, దరిదాపుగా రూ.9 వేల కోట్ల పనులు జరిగాయని ఆయన గుర్తుచేశారు. అమరావతిలో రాజధాని ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. బీజేపీ పెద్దల ఆదేశాల మేరకే ఆయన శుక్రవారం ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రాంతంలో మౌనదీక్షకు కూర్చున్నారు. ఇక బీజేపీ ఎంపీ సుజనా చౌదరి రాజధాని మార్పుపై రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను కేంద్ర పెద్దలకు నివేదించే పనిలో ఉన్నారు. ఒక ప్రభుత్వాన్ని నమ్మి రాజధాని కోసం రైతులు భూములిస్తే.. ఇప్పుడు వేరే ప్రభుత్వం వచ్చి అర్ధాంతరంగా రాజధానిని మార్చేస్తే.. ప్రభుత్వాలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నట్లు సమాచారం. కాగా.. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని రాజధాని రైతులు ఆత్కూర్‌లోని స్వర్ణ భారత్ ట్రస్టులో కలిసి తమ గోడు వెలిబుచ్చారు. అయితే రాజ్యాంగబద్ధమైన ఉపరాష్ట్రపతి పదవిలో ఉండి దీనిపై బహిరంగంగా మాట్లాడడం సబబు కాదని ఆయన తెలిపారు. విజ్ఞాపన పత్రాలు ఇస్తే.. వాటిని ఇవ్వాల్సిన వారికి ఇచ్చి.. తన అభిప్రాయాన్ని కూడా తెలియజేస్తానని హామీ ఇచ్చారు. సానుకూలంగా మాట్లాడినందుకు రైతులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఇక మోదీ ప్రభుత్వం నియమించిన రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ కూడా అమరావతి రైతులు, రాజధానిపై సానుకూల ధోరణితో ఉన్నారని ఆయన్ను కలిసిన రైతులు చెబుతున్నారు. తాము చెప్పిన ప్రతి మాటను ఆలకించడంతో పాటు తగు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారని అంటున్నారు. రాష్ట్రంలో పాలక వైసీపీ తప్ప మిగతా పార్టీలు, సంఘాలు రాజధాని తరలింపును గట్టిగా వ్యతిరేకిస్తుండడం.. కేంద్రం, బీజేపీ పెద్దలు సైతం అమరావతిలోనే రాజధాని ఉండాలన్న వైఖరితో ఉండడంతో.. రైతులు మరింతగా పోరాడేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

**ప్రభుత్వోద్యోగుల్లో మథనం..**

అటు ప్రభుత్వోద్యోగులు కూడా రాజధాని మార్పును నిరసిస్తూ అంతర్గతంగా మథనపడుతున్నారు. అయితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా బహిరంగంగా నిరసనలు తెలియజేయడానికి జంకుతున్నారు. స్పష్టమైన ప్రకటన వచ్చాక కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని భావిస్తున్నట్లు సమాచారం.

## విశాఖ పాలనా రాజధాని సముచితం: టీఎస్సార్

పెందుర్తి (విశాఖపట్నం జిల్లా) డిసెంబరు 27: "విశాఖను ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా అభివృద్ధి చేయడం సముచితం. ఇక్కడ సచివాలయం, సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయాలని జీఎన్ రావు కమిటీ నివేదిక సమర్పించడాన్ని స్వాగతిస్తున్నా" అని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యుడు టి.సుబ్బిరామిరెడ్డి పేర్కొన్నారు. చినముషిడివాడలోని శారదా పీఠంలో శుక్రవారం ఆయన అతిరుద్ర, లక్ష చండీయాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖను పరిపాలనా రాజధానిగా అభివృద్ధి చేయడాన్ని సమర్థిస్తూనే, అమరావతిలో రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన విశాఖను పరిపాలన రాజధానిగా చేసుకోవడంవల్ల ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుందన్నారు.

## ఇంతలోనే ఆత్రం ఎందుకు?

- » దమ్ముంటే ప్రజల్లో ప్రచారానికి రావాలి
- » టీడీపీ నేతలకు స్పీకర్ సీతారాం సవాల్

గుజరాతీపేట (శ్రీకాకుళం), డిసెంబరు 27: "మూడు రాజధానుల అంశం పబ్లిక్ రిఫరెండం అవుతుంది. ఇంతలోనే తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆత్రం ఎందుకు?" అని స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రశ్నించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల ప్రారంభోత్సవ తర్వాత మీడియాతో మాట్లాడారు. "భవిష్యత్తులో రానున్న పార్లమెంట్, అసెంబ్లీ, స్థానిక ఎన్నికల్లో తుగ్లక్‌లు ఎవరన్నది రుజువవుతుంది. ఎటువంటి మంచి నిర్ణయం తీసుకున్నా సరే తుగ్లక్‌లకు తుగ్లక్‌లవలే ఉంటుంది. నేను రాజకీయాలు మాట్లాడటం లేదు. రాజధాని గురించి మాట్లాడుతున్నా. అభివృద్ధి, పాలనలకు సమాన ప్రాతినిధ్యం ఇచ్చేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయాన్ని వెల్లడించారు. దమ్ముంటే చంద్రబాబు, టీడీపీ నేతలు మూడు రాజధానుల అంశంపై వ్యతిరేకిస్తున్నారా? లేక సమర్థిస్తున్నారా? అన్న విషయాన్ని ప్రజలకు ఒక్క మాటలో చెప్పాలి" అని స్పీకర్ సవాల్ విసిరారు.

## 'భీమిలి'లో రాజధానిపై చర్చ

- » బీసీజీ నివేదిక తరువాత ఆలోచిస్తాం
- » అంత ఖర్చు పెట్టి రాజధాని కట్టలేం
- » మంత్రులు అవంతి, కన్నబాబు

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గంలో పరిపాలనా రాజధాని ఏర్పాటుపై మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగిందని మంత్రి అవంతి శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు అవంతి, కన్నబాబు మీడియాతో మాట్లాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. జీఎన్ రావు కమిటీ నివేదికపై కేబినెట్‌లో చర్చ జరిగిందని మంత్రి కన్నబాబు తెలిపారు. రాజధానిపై బీసీజీ రిపోర్ట్ రావాల్సి ఉందన్నారు. అది వచ్చిన తర్వాత ఏం చేయాలన్న అంశంపై ఆలోచిస్తామని ఆయన వివరించారు.

**భూములిచ్చిన రైతులకు ప్రాధాన్యం**

"రాజధాని కోసం భూసేకరణ ఎవరు చేశారన్నది ముఖ్యం కాదు. భూములు తీసుకున్నది చంద్రబాబా? జగనా? అన్నదీ ముఖ్యం కాదు. ప్రభుత్వాన్ని నమ్మి రైతులు భూములిచ్చారు. భూములు ప్రభుత్వ అధీనంలో ఉన్నాయి. రాజధానికి భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రాధాన్యమిస్తుంది" అని మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. రాజధాని తరలింపు ఓవర్‌నైట్ చేసేది కాదన్నారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి, ఎక్కడ బాగుందంటే అక్కడ పెడతామని, అసెంబ్లీలో చర్చించే చేస్తామని ఆయన స్పష్టం చేశారు. 'అప్పులు చేసి అమరావతిలో రాజధాని కట్టలేం కదా? అప్పు తెస్తే తీర్చాలి కదా? రాజధానికి ప్రాంతం ముఖ్యం కాదు. అంత వ్యయం చేసి, ఇక్కడ కట్టలేం. అలాగని విశాఖలో పెట్టి, ఇక్కడ తీసేయాలని కాదు. ప్రభుత్వం సంక్షేమ పథకాలనీ చూసుకోవాలి కదా?"అని అన్నారు.

## మూడు రాజధానులు సమంజసమే: ఎమ్మెల్యే పీఆర్కే

రెంటచింతల, డిసెంబరు 27: నవ్యాంధ్రాకు మూడు రాజధానుల ఏర్పాటు సమంజసమేనని మాచర్ల ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే గెలిపించే బాధ్యత తమదని టీడీపీ మాజీ మంత్రులు పేర్కొనడాన్ని పీఆర్కే అపహాస్యం చేశారు. వాళ్లకే ఆ సత్తా ఉంటే ఏప్రిల్ 11న నిర్వహించిన ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఎందుకు గెలవలేదని ప్రశ్నించారు.

## కన్నీరే ఇక మిగిలింది






## వైసీపీకీ కాంగ్రెస్ గతే!

- 'మూడు'కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం
- రాజమహేంద్రవరం, నెల్లూరులో అఖిలపక్ష తీర్మానం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 27: మూడు రాజధానుల ఆలోచనను ప్రభుత్వం విరమించుకోకపోతే అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌కు పట్టిన గతే వైసీపీకీ పడుతుందని పలు పార్టీల నేతలు హెచ్చరించారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో నేతలు మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు మాజీ సీఎం చంద్రబాబు, టీడీపీపై ఉన్న కక్ష రాష్ట్రంలోని 5 కోట్ల ప్రజలకు ఇప్పుడు శాపంగా మారిందన్నారు. విభజన గాయం మానకముందే మూడు రాజధానుల అంశం తెరపైకి తెచ్చి రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఈ ఆలోచనను విరమించుకోవాలని సమావేశంలో తీర్మానం చేశారు. నెల్లూరులో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు రాజధానుల నిర్ణయానికి వ్యతిరేకంగా ఆంధ్ర బిడ్డల సత్తా చూపాలన్నారు.


ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని

### బడ్జెట్ బేటీ అక్కడే

రాజధాని తరలింపుపై ముఖ్యమంత్రి కేబినెట్ భేటీలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. విశాఖలోనే సచివాలయం ఉంటుందని.. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు అక్కడే జరుగుతాయన్నారు. దీంతో ఇక అమరావతిలోని అసెంబ్లీ భవనం శీతాకాల సమావేశాలకే పరిమితమవుతుందా అని మంత్రులు సందేహం వెలిబుచ్చుతున్నారు. కాగా.. శాసనమండలిలో టీడీపీకి మెజారిటీ ఉన్న నేపథ్యంలో.. రాజధాని మార్పునకు వ్యతిరేకంగా ఓటేస్తుందని ప్రభుత్వం అనుమానిస్తోంది. ఈ నెల 17న అసెంబ్లీ శీతాకాల సమావేశాల చివరి రోజున ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం బిల్లు, ఎస్సీ కార్పొరేషన్ ఏర్పాటు బిల్లులకు వ్యతిరేకంగా ఓటేసి సర్కారుకు టీడీపీ షాకిచ్చింది. ఈ పరిస్థితి రాజధాని మార్పు విషయంలో ఎదురుకాకుండా.. అసెంబ్లీలో వైసీపీకి 150 మంది (స్పీకర్ మినహా) ఎమ్మెల్యేలు ఉన్నందున రెండు సభల ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేసి ఆమోదింపజేసుకోవాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించారు.

# విశాఖ వీచికే!



## మంత్రివర్గ భేటీలో సీఎం జగన్ వెల్లడి

అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిని అమరావతి నుంచి విశాఖపట్నానికి మార్చడం ఖాయమని ముఖ్యమంత్రి వైఎస్ స్పష్టమైన సంకేతాలు పంపించారు. జనవరి 20వ తేదీన ప్రత్యేక అసెంబ్లీ సమావేశం జరిపి... తన నిర్ణయానికి ఆమోదం తీసుకోనున్నారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం ఈ విషయాన్ని స్పష్టం చేశారు. శుక్రవారం జరిగిన కేబినెట్ భేటీలో రాజధాని నగరం మార్పు.. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్, పంచాయతీ ఎన్నికలకు పాత విధానంలోనే రిజర్వేషన్లు తదితర అంశాలపై చర్చ జరిపారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సమావేశం ప్రారంభమైన వెంటనే.. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై సీఎంకు నివేదిక సమర్పించింది. దాదాపు 4,075 ఎకరాల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు ఆధారాలున్నాయని తెలిపింది. మరికొంత గడువు ఇచ్చి ఉంటే.. దాదాపు 10 వేల ఎకరాల సమాచారం సమర్పించేవాళ్లమని బుగ్గన తెలిపారు. ఈ సందర్భంగా రాజధానిని విశాఖకు తరలించాల్సిన అవసరంపై ముఖ్యమంత్రి 45 నిమిషాలు మాట్లాడారు.

### భూములపై ఉపసంఘం పాక్షిక నివేదిక

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాజెక్టుల్లో చోటు చేసుకున్న అవినీతిపై అధ్యయనానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఉపసంఘం శుక్రవారం ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నితో కలిసి పాక్షిక నివేదికను జగన్‌కు సమర్పించింది. అమరావతి ప్రాంత పరిధిలో తెల్లరేషన్ కార్డుదారులూ లక్షలు, కోట్లతో భూములు కొన్నారని తెలిపింది. 2014 జూన్ నుంచి నవంబరు నెలాఖరులోపు 4,075 ఎకరాల మేర రిజిస్ట్రేషన్ జరిగిందని.. రాష్ట్రం ఏర్పడ్డాక ఈ స్థాయిలో కృడ రిజిస్ట్రేషన్లు జరగలేదని పేర్కొన్నారు. నివేదికను బుగ్గన ఇంగ్లీషులో చదువుతున్నప్పుడు సీఎం కలుగజేసుకుని.. తెలుగులో చదువన్నా అని అన్నారు. దీంతో.. బుగ్గన తెలుగు పదాలను వెతుక్కుని చదువుతుంటే సహచర మంత్రులు ఒక్కసారిగా నవ్వారు. వారితో సీఎం కూడా జత కలిపారు.

### తొందరపడొద్దంటూ...

తక్షణమే అసెంబ్లీని సమావేశపరచి.. విశాఖకు రాజధాని తరలింపును ఆమోదింపజేసుకుందామని పలువురు మంత్రులు సూచించారు. అయితే.. సీనియర్ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బుగ్గన, బొత్స సత్యనారాయణ, పినిపె విశ్వరూప్, పేర్ని వెంకట్రామయ్య (నాని) తదితరులు తొందరపాటువద్దన్నారు. ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటోందన్న ముద్ర పడకుండా చూసుకోవాలన్నారు. న్యాయపరమైన ప్రతిబంధకాలు ఎదురుకాకుండా.. అంతా సవ్యంగా జరిగేలా చూడాలని.. హైపవర్ కమిటీ వేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి ఏకీభవించారు. '3న బోస్టన్ నివేదిక వస్తుంది. వెంటనే మంత్రులు, సీనియర్ ఐఏఎస్‌లతో హైపవర్ కమిటీ వేద్దాం. అధ్యయనానికి 15 రోజుల గడువిద్దాం. జనవరి 18న నివేదిక ఇస్తే.. 19న రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆమోదిద్దాం. మర్నాడు అసెంబ్లీ ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేద్దాం. విశాఖకు రాజధాని నగరాన్ని ఎందుకు మార్చాల్సి వస్తుందో ప్రజలకు వివరిద్దాం' అని జగన్ చెప్పారు.

### ఎకరా అభివృద్ధికి 2 కోట్లని బాబే అన్నారు

'ఎవరిపైనా కక్షతోనో.. కోపంతోనే రాజధానిని మార్చడం లేదు. రాజధాని నగరాన్ని అభివృద్ధి చేయాలంటే ఎకరానికి రెండు కోట్లు ఖర్చవుతాయని చంద్రబాబే చెప్పారు. అంటే 53 వేల ఎకరాలకు రూ.లక్షా ఆరు వేల కోట్లు కావాలి. గత ఐదేళ్లలో చంద్రబాబు ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి రూ.5,800 కోట్లు ఖర్చు చేసింది. చంద్రబాబు చెప్పినట్లుగా రాజధానిని అభివృద్ధి చేయాలంటే రూ.1,10,000 కోట్లు కావాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం అంత డబ్బును ఖర్చు చేయగలదా?" అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు తరహాలోనే ఏటా రూ.5,000 కోట్లు ఖర్చు చేస్తే.. దశాబ్దాలు గడచినా అభివృద్ధి చేయలేం. ప్రతి ఐదేళ్లకోసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. కట్టిన భవనాలన్నీ కుంగిపోతుంటాయన్నారు. అమరావతిలో రోడ్లు నిర్మించాలంటే.. కిలోమీటరుకు రూ.42 కోట్ల వ్యయమవుతుందని... ఇంత ఖర్చు చేయడం అవసరమా అని ప్రశ్నించారు. "అదే విశాఖలో రాజధానిని నిర్మించి ఉంటే.. పరిస్థితి ఈరోజు మరోలా ఉండేది. అక్కడ సచివాలయం, అసెంబ్లీ నిర్మించి.. మెట్రో రైలును ఏర్పాటు చేస్తే హైదరాబాద్, ముంబై, బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో పోటీ పడేవాళ్లం. రూ.10 వేల కోట్లు ఖర్చుచేస్తే విశాఖ మహానగరంగా ప్రపంచంతోనే పోటీ పడుతుంది" అని వివరించారు. అమరావతి అభివృద్ధి మాత్రమే ప్రభుత్వ ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. "జలయజ్ఞం కింద రూ.23 వేల కోట్లు వ్యయం చేయాలి. గోదావరి జలాలను బానకచర్ల ద్వారా రాయలసీమకు తీసుకెళ్లాలి. దీనికి రూ.65 వేల కోట్లు కావాలి. వాటర్ గ్రిడ్ కింద ఉపరితల జలాలను ప్రతి ఇంటికీ అందజేయాలి. రూ.40 వేల కోట్లకు పైగా ఖర్చవుతాయి. ఇంకోవైపు నవరత్నాల సంక్షేమ పథకాలు అమలు చేయాలి. బందరు పోర్టును అభివృద్ధి చేయాలి. అప్పుడే కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మన ప్రాధాన్యం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి. అందుకే రాజధానిని విశాఖకు తరలించాలని నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు.

### రాజధాని రైతులతో మాటల్లేవ్!

ఆందోళనలు చేస్తున్న రాజధాని ప్రాంత రైతులతో సంప్రదింపులు జరపాలని గుంటూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి సూచించారు. దానిపై కృష్ణా జిల్లా మంత్రులు, సీఎం సానుకూలంగా స్పందించలేదని తెలిసింది. రాజధాని పోతోందన్న ఆగ్రహంతో వారున్నారని.. చంద్రబాబు వారిని మోసం చేశారని.. వారితో ఏం సంప్రదింపులు జరుపుతామని అన్నట్లు సమాచారం. అలాగే... రాజధాని ప్రాంత రైతులు భూములు వెనక్కి ఇచ్చేయాలని కోరితే.. ఇప్పటి వరకూ ఉపయోగించని భూములను తిరిగి యథాతథంగా వారికి ఇచ్చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం చెప్పినట్లు తెలిసింది. ఇప్పటికే రాజధాని నగర అభివృద్ధి కోసం వినియోగించుకున్న భూములకు బదులు వేరే చోట భూములు ఇద్దామన్నారు. కౌలు చెల్లింపుల భారం తగ్గించుకోవాలంటే.. భూములు వెనక్కి ఇచ్చివేయాల్సిందేనని స్పష్టం చేశారు. అమరావతి ప్రాంతంలో 20 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని.. వాటిని వాస్తవ లబ్ధిదారులకు అందజేద్దామని అన్నారు. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని పునరుద్ఘాటించారు. ఈ కుంభకోణంపై సీబీఐ లేదా ఏసీబీ/సీఐడీ లేదా లోకాయుక్తతో విచారణ జరిపించాల్సి ఉందని చెప్పారు. అయితే... న్యాయపరమైన అంశాలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని.. అందువల్ల ఎలాంటి లోపాలూ లేకుండా క్షుణ్ణంగా ఆయా అంశాలను పరిశీలించాల్సి ఉందని తెలిపారు.

### 29 గ్రామాల్లోనే ఆందోళనలు..

రాజధాని ప్రాంత రైతులు వారం రోజులుగా చేస్తున్న ఆందోళనలు కేబినెట్ సమావేశంలో చర్చకు వచ్చాయి. వారు తమకు న్యాయం చేయాలని కోరడం లేదని.. రాజధానిని తరలించవద్దని చెబుతున్నారని కొందరు మంత్రులు అన్నారు. మంత్రుల అభిప్రాయాలను సీఎం అడిగారు. రాజధాని తరలింపుపై కేవలం 29 గ్రామాల్లోనే ఆందోళనలు ఉన్నాయని.. వాటిని మరో గ్రామానికి విస్తరించకుండా చూడాలని మంత్రి కొడాలి నాని సూచించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసమే విశాఖలో సచివాలయం, అసెంబ్లీ నిర్మించాలన్న ఆలోచనకు సీఎం వచ్చారని ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఆయన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని అన్నారు. బొత్స జోక్యం చేసుకుని రాజధానిని మార్చడం లేదని.. పరిపాలనను విస్తరిస్తున్నామని చెప్పారు. అమరావతిని అభివృద్ధి చేస్తామని.. విద్యా నగరంగా రూపుదిద్దుతామని తెలిపారు.



'13 జిల్లాలు... 175 నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన సంపదను సృష్టించి ఇవ్వగలిగే శక్తి అమరావతికి ఉంది.'

అమరావతిపై ముందు సామాజిక వర్గం ముద్ర వేయాలని ప్రయత్నించారు. అక్కడ 75 శాతం మంది బలహీనవర్గాల ప్రజలే ఉన్నారని తేలడంతో మాటమార్చి ముంపు ప్రమాదం ఉందన్నారు.. ఎవరూ నమ్మకపోవడంతో లక్ష కోట్ల ఖర్చు వాదన తెచ్చారు.'

'మూడు రాజధానులు ఒక పిచ్చి ఆలోచన. ఈ ముఖ్యమంత్రి ఈ కాలపు తుగ్లక్. తుగ్లక్ పిచ్చి కంటే ఇరవై రెట్లు అధికంగా కనిపిస్తోందని ప్రసిద్ధ పాత్రికేయుడు శేఖర్ గుప్తాయే వ్యాఖ్యానించారు.'

## అమరావతి నిర్మాణానికి..

# పైసా భారం పడదు!

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. పైగా ఎదురు ఆదాయాన్ని సమకూర్చిపెట్టే నమూనా అని చెప్పారు. తమ పార్టీ నేతలు యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, కళా వెంకట్రావులతో కలిసి ఆయన మంగళగిరిలోని తమ పార్టీ జాతీయ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. లక్ష కోట్లు పెట్టగలిగే శక్తి లేనందునే అమరావతిలో రాజధాని నిర్మాణానికి తాము ముందడుగు వేయలేకపోతున్నామని కేబినెట్ భేటీ అనంతరం మంత్రి పేర్ని నాని ఇచ్చిన వివరణపై చంద్రబాబు స్పందించారు. 13 జిల్లాలు.. 175 నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన సంపదను సృష్టించి ఇవ్వగలిగే శక్తి అమరావతికి ఉందన్నారు. ఈ ఆలోచనను అర్థం చేసుకునే శక్తి లేక అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

### అన్నీ సవ్యంగా జరిగితే..

'అమరావతిలో రైతుల నుంచి సేకరించిన భూమి, ప్రభుత్వ భూమి కలిపి మొత్తం 54 వేల ఎకరాలు ఉంది. ఇందులో రైతులకు తిరిగి ఇచ్చింది.. మౌలిక వసతులకు పోను ప్రభుత్వం వద్ద ఇంకా పది వేల ఎకరాల భూమి ఉంది. ఎన్నికలకు ముందు అక్కడ గజం రూ.36 వేలు పలికింది. పనులు కొనసాగిస్తే ఇంకా పెరిగేది. భూముల విలువ పెరిగే లోపు పనులు ఆగకుండా చూడడానికి బాగా తక్కువ వడ్డీతో ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి రుణం తీసుకోవాలని మేం అనుకున్నాం. ఈ రుణంతో పనులు కొనసాగిస్తే భూముల విలువ బాగా పెరిగేది. ఉన్న పది వేల ఎకరాలనూ దశలవారీగా విక్రయిస్తూ పోతే ప్రభుత్వం పైసా పెట్టకుండా సరిపోయేది. పనులు నడుస్తున్నప్పుడు సిమెంటు, స్టీలు వంటి వాటి విక్రయాలపైనా ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. రాజధానిపై మన ఆలోచనలు చూసి అమరావతికి విట్, ఎస్ఆర్ఎం వంటి విద్యాసంస్థలు వచ్చాయి. అన్నీ సవ్యంగా జరిగితే అక్కడ వివిధ విద్యాలయాల్లో 50 వేల మంది విద్యార్థులు ఉండేవారు. వారి వల్ల ఎంత ఆదాయం వచ్చేది? కలల రాజధాని కట్టాలనుకున్నానని నన్ను ఎద్దేవా చేస్తున్నారు. అవును.. అది వాస్తవం. ఉన్నది చాలనుకుంటే హైదరాబాద్‌లో సైబరాబాద్ పేరుతో మరో కొత్త నగరం వచ్చేదే కాదు. హైదరాబాద్ అంతర్జాతీయ నగరం అయ్యేదే కాదు. డబ్బులు లేవని బీద అరుపులు అరుస్తున్నవారు మరో చోట సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ కట్టరా..? వాటికి డబ్బు ఖర్చు కాదా? అమరావతిలోనే వీటన్నిటినీ సమకూర్చిపెట్టాం. ఈ ఏడు నెలలుగా అందరూ వాటిలోనే కూర్చుని పనిచేస్తున్నారు. అమరావతిపై ముందుగా ఒక సామాజిక వర్గం ముద్ర వేయాలని ప్రయత్నించారు. అక్కడ 75 శాతం మంది బలహీనవర్గాల ప్రజలే ఉన్నారని తేలడంతో మాట మార్చి అక్కడ ముంపు ప్రమాదం ఉందని, నిర్మాణాలకు ఖర్చు పెరుగుతుందని రకరకాల ప్రచారాలు చేశారు. అవేవీ ప్రజలు నమ్మకపోవడంతో ఇప్పుడు లక్ష కోట్ల ఖర్చు వాదన తెచ్చారు.'

### ఢిల్లీ వెళ్లి చెప్పాలి..

రాజధాని రైతులు, వారి తరపున పోరాడుతున్న ప్రజా సంఘాలు, పార్టీలు కలిసి ఢిల్లీ వెళ్లాలి. ప్రధానిని, రాష్ట్రపతిని, కేంద్ర హోం మంత్రిని కలిసి అన్ని విషయాలు వివరించాలి. అక్కడ మేధావులు, పత్రికా సంపాదకులను కూడా కలిసి మొత్తం దేశం దృష్టికీ సమస్యను తీసుకెళ్లాలి. ఇది ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌కు సంబంధించిందే కాదు. దేశాభివృద్ధి కూడా దెబ్బ తింటోంది. రాజధాని మార్పును కేవలం 29 గ్రామాల సమస్యగా చూడవద్దు. దేశమంతా మనల్ని చూసి ఎగతాళి చేసే పరిస్థితి వచ్చింది. జీఎన్ రావు కమిటీ అని గొప్పగా చెబుతున్నారు. ఆయనేమైనా నిపుణుడా? గ్రూప్-1 మాజీ అధికారి. ముఖ్యమంత్రి తన ఆలోచనలు ఆ కమిటీకి చెప్పి రాయించారు. ముందే పేపర్ లీక్ చేసి సమాధానాలు రాయించినట్లుగా ఈ తతంగం నడిచింది.'

### హైకోర్టు ఆధ్వర్యంలో ఏ విచారణకైనా సిద్ధం

'రాజధాని భూముల్లో ఇన్‌సైడర్ వ్యవహారం జరిగిందని అంటున్న ప్రభుత్వం హైకోర్టు ఆధ్వర్యంలో ఏ విచారణ జరిపించినా మేం సిద్ధమే. సిట్టింగ్ న్యాయమూర్తి అయినా.. రిటైర్డ్ న్యాయమూర్తి అయినా రెడీ. ఇదే సమయంలో ఈ ఏడు నెలల్లో విశాఖలో చేసిన భూ దందాలపై సీబీఐ దర్యాప్తునకు ఈ ప్రభుత్వం సిద్ధపడాలి. 22-ఏ పరిధిలో ఉన్న భూములను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. జగన్‌కు సీబీఐపై అంత నమ్మకం ఉంటే ప్రతి శుక్రవారం సీబీఐ కోర్టుకు ఎందుకు వెళ్లడం లేదు? రూ.43 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని సీబీఐ నిర్ధారించింది. అదేదో త్వరగా తేల్చాలని కోరవచ్చు కదా? తన బాబాయి హత్య కేసును కూడా ఇవ్వవచ్చు కదా! మేం రైతుల తరపున పోరాడుతుంటే సీబీఐ విచారణ అని బెదిరింపులకు దిగుతున్నారు. ఏడు నెలల నుంచి ఇదే పాట పాడుతున్నారు. మీ దిక్కున్న చోట చెప్పుకోండి. హెరిటేజ్ కంపెనీ కొనుగోలు చేసిన భూమిపై ఆరోపణ చేస్తున్నారు. రాజధానికి పాతిక కి.మీ. దూరంలో ఆ కంపెనీ భూమి కొనుగోలు చేసింది. జగ్గయ్యపేట వద్ద ప్రభుత్వం ఇస్తామన్న 500 ఎకరాలు తమకు వద్దేవద్దని భరత్ పదే పదే చెబుతున్నా రోజూ అదే ఆరోపణ వినిస్తున్నారు. మరేమీ దొరక్క వీటి గురించి మాట్లాడుతున్నారు.'

### మార్చే అధికారం ఎవరిచ్చారు?

'రాజధానిని మార్చే అధికారం వీరికి ఎవరిచ్చారు? స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ రాష్ట్రంలోనైనా ఇలా మార్చారా? దేశంలో ఎంతో మంది ముఖ్యమంత్రులు అయ్యారు. వారెవరికీ ఇంత తెలివి లేదా? విభజన తర్వాత రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకూ సమదూరంలో ఉన్న ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేశాం. దానిపై అసెంబ్లీలో చర్చించాం. అందరి ఆమోదం తీసుకున్నాం. అదే సమయంలో రాష్ట్రంలో ఇతర ప్రాంతాల అభివృద్ధికి కూడా సమగ్ర ప్రణాళిక రూపొందించాం. అదానీ, లులు, రిలయన్స్‌లను ఈ ప్రభుత్వం వెళ్లగొట్టింది. విశాఖలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి 2వేల ఎకరాలు సేకరించాం. అది రాకుండా చేయడానికి వైసీపీ నేతలు కేసులు వేశారు. విశాఖ మెట్రోకూ అడ్డుపడ్డారు.'

### ఎక్కువ మంది సన్నకారే

'అమరావతిలో భూములిచ్చిన రైతులకు చట్టపరమైన ఒప్పందాలు ఉన్నాయి. అనుకోగానే రాజధానిని ఎవరూ మార్చలేరు. భూములిచ్చిన వారిలో అత్యధికులు బాగా సన్నకారు, చిన్నకారు రైతులే. ఇరిగేషన్, అమ్మ ఒడి, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వైద్యం, విద్య వంటి వాటికి డబ్బులు కావాలంటున్నారు. డబ్బులు చెట్లకు కాయవు. అమరావతిని చంపేసి అందరినీ వెళ్లగొడితే డబ్బులు రావు. సంపద సృష్టిస్తే ప్రభుత్వానికి.. వ్యక్తులకు ఆదాయం పెరుగుతుంది. దాని ద్వారా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వస్తాయి. ఎంత పట్టణ ప్రాంతం ఉంటే అంత ఆదాయం వస్తుంది.'

### రాజధాని పూర్తయ్యాక ఇల్లు కట్టుకుందామనుకున్నా..

'ముందు రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చి అది పూర్తయిన తర్వాత రైతుల నుంచి భూమి కొనుక్కుని అక్కడ ఇల్లు నిర్మించుకుందామని అనుకున్నాను. అలా కాకుండా ముందే భూమిని కొనుక్కుంటే దానిని కూడా ఇన్‌సైడర్ ట్రేడింగ్ అని అనేవాళ్లు.'

### ఎంపీ నిర్బంధంపై డీజీపీ ఏం చెబుతారు?

.ఎన్ఎస్‌జి రక్షణ ఉన్న నా వాహనంపై రాళ్లు, చెప్పులు వేసిన వారికి అది వారి భావ ప్రకటనా స్వేచ్ఛని.. రాజ్యాంగం అధికారం ఇచ్చిందని డీజీపీ సమర్థించారు. రోడ్డుపైకి వచ్చి మరీ వాళ్లు దాడి చేశారు. కానీ విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని నాని ధర్నాచౌక్‌కు వెళ్లకుండా ఇంట్లో నిర్బంధించారు. ఎంపీకి ఆ మాత్రం హక్కు కూడా లేదా? డీజీపీ దీనికి ఏం సమాధానం చెబుతారు? చట్టం కొందరికి చుట్టం కాదని, అందరినీ సమానంగా చూడాలని సీనియర్ నేతగా ఆయన్ను హెచ్చరిస్తున్నాను. కొన్ని టీవీ చానళ్లు రాజధాని రైతుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నాయి.

### జగన్ వీడియోల ప్రదర్శన

అమరావతిలో రాజధానిని ఆమోదిస్తున్నానని జగన్ చెప్పడం, హైదరాబాద్, బెంగళూరు వంటి రాజధాని ఉండాలనడం, అమరావతి నుంచి రాజధానిని మార్చే ఆలోచన లేదని వైసీపీ సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చేసిన ప్రకటన, పాత్రికేయుడు శేఖర్ గుప్తా రాజధాని మార్పుపై మాట్లాడిన వీడియోలను చంద్రబాబు ప్రదర్శించారు.

## కర్నూలుకు రాజధాని హంగులు ఇవ్వండి

- లేదంటే ప్రాంతీయ విద్వేషాలు, ఉద్యమాలు తప్పవు: టీజీ వెంకటేశ్



కర్నూలు(అర్బన్), డిసెంబరు 27: "కర్నూలుకు రాజధానికి ఉండే అన్ని హంగులూ ఇవ్వాలి. లేదంటే మళ్లీ ప్రాంతీయ విద్వేషాలు, ఉద్యమాలు పెరిగే అవకాశం ఉంది" అని బీజేపీ ఎంపీ టీజీ వెంకటేశ్ హెచ్చరించారు. శుక్రవారం కర్నూలులో మీడియాతో మాట్లాడారు. గతంలోనే రాష్ట్రంలో మూడు రాజధానులు ఏర్పాటు చేసే అవకాశం ఉందని చెప్పానని గుర్తు చేశారు. రాజధాని మార్పుపై హైపవర్ కమిటీ వేశారు కానీ సొల్యూషన్ వచ్చే పరిస్థితి లేదన్నారు. సీఎం జగన్ రాజధాని అమరావతిపై మొదటి నుంచి ప్రజల్లో పూర్తిగా నెగటివ్ భావన తెచ్చారని విమర్శించారు. రాజధానిని డీ సెంట్రలైజ్ చేసి ప్రాధాన్యతను తగ్గిస్తూ మళ్లీ పొరపాటు చేస్తున్నారని హెచ్చరించారు. హైకోర్టును మూడు ముక్కలు, రాజధానిని రెండు ముక్కలు చేసి రాయలసీమను జీరో చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలులో హైకోర్టు లేదా బెంచ్ ఏర్పాటుకు 5 ఏళ్లు పడుతుందనీ, ఒప్పుకోకపోతే జీరో అవుతుందని వివరించారు. హైదరాబాద్ రాజధానిగా ఉన్నప్పుడు కూడా ఉత్తరాంధ్రలో సమ్మర్, రాయలసీమలో వింటర్ క్యాపిటల్ ఏర్పాటు చేయాలని, రాష్ట్ర విభజన జరిగితే రాయలసీమలో రాజధాని ఏర్పాటు చేయాలని 14 సంవత్సరాలుగా కొట్లాడుతున్నామని వివరించారు. కానీ ఉత్తరాంధ్రకు రాజధానిని ఇచ్చి రాయలసీమకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఎవరి మాట వినకుండా అభివృద్ధి అంతా అమరావతిలో కేంద్రీకృతం చేశారని విమర్శించారు. ప్రాంతీయ హక్కుల కోసం పోరాడుతూ, రాష్ట్రం బాగుండాలని కోరుకొనే నాలాంటి నాయకుల అభిప్రాయాలు సేకరిస్తే బాగుంటుందని టీజీ అన్నారు.

# అమరావతిపై మరో కమిటీ!

- మంత్రులు, నిపుణులు, ఐఏఎస్‌లతో ఏర్పాటు
- జీఎన్‌రావు, బీసీజీలపై అధ్యయనం చేస్తుంది
- హైవర్ కమిటీ నివేదిక తర్వాతే నిర్ణయం
- కేబినెట్ భేటీ అనంతరం పేర్ని నాని ప్రకటన



అమరావతి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై అధికారిక నిర్ణయాన్ని ప్రభుత్వం 'వాయిదా' వేసింది. బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) నివేదిక వచ్చిన తర్వాత... దీనిని జీఎన్‌రావు కమిటీ ఇచ్చిన నివేదికనూ పరిశీలించేందుకు హైపవర్ కమిటీని నియమించాలని తీర్మానించింది. ఈ ఉన్నత స్థాయి కమిటీలో మంత్రులు, సీనియర్ ఐఏఎస్ అధికారులు, నిపుణులు ఉంటారు. శుక్రవారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసిన అనంతరం... సమాచార, ప్రసార శాఖ మంత్రి పేర్ని నాని ఈ విషయం తెలిపారు. బీసీజీ నివేదిక జనవరి మొదటి వారంలోనే అందుతుందన్నారు. "గత ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో కలల రాజధానిని నిర్మించాలనుకున్నారు. దీనికోసం రైతుల నుంచి 34వేల ఎకరాలు, ప్రభుత్వ బంజరు భూములను 20వేల ఎకరాలు సేకరించారు. ఒక ఎకరానికి రూ.2 కోట్లు మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమని ఆయన హయాంలోని నివేదిక చెప్పింది. అంటే మొత్తంగా 1.1 లక్షల కోట్లు అవసరం. అభివృద్ధి, సంక్షేమాన్ని వాయిదా వేసి మొత్తం రాజధానికి ఖర్చు చేయడమా? అనే విషయంపై మంత్రివర్గంలో చర్చించాం" అని తెలిపారు. రాజధానిపై ఇంత ఖర్చు చేస్తే ఎప్పటికి హైదరాబాద్, బెంగళూరు స్థాయికి వెళ్తుంది? అసలు వెళ్లగలదా? అన్న అనుమానాలూ ఉన్నాయన్నారు. రాజధాని రైతుల ఆందోళనపైనా కేబినెట్‌లో చర్చించామని చెప్పారు. "రైతులే కాదు... రాష్ట్రంలో ఎవరు ఇబ్బందుల్లో ఉన్నా సాధ్యమైన మేరకు న్యాయం చేయాలని అనుకునే నాయకుడు జగన్. ఎవరో ఏదో చెప్పారని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం ఇంకా ఒక నిర్ణయం తీసుకోలేదు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఈ కమిటీ నిర్దిష్టకాలంలో నివేదిక ఇచ్చేలా ఏర్పాటు చేయాలనుకుంటున్నాం" అని వివరించారు. రాజధాని మారుస్తున్నట్లు జగన్ ప్రకటించలేదని... జీఎన్ రావు కమిటీ ఫలానా విధంగా నివేదిక ఇవ్వొచ్చేమో అని మాత్రమే అన్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా పేర్కొన్నారు. అదే సమయంలో... "ఒకసారి నిర్ణయం తీసుకుంటే అందరికీ చెప్పి, వెనకడుగు లేకుండా ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తుంది" అని స్పష్టం చేశారు.

### ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై విచారణ...

2014లో రాజధాని ప్రకటనకు ముందు అమరావతి ప్రాంతంలో జరిగిన భూముల కొనుగోలు (ఇన్‌సైడర్ ట్రేడింగ్)పై మంత్రుల కమిటీ నివేదిక ఇచ్చిందని పేర్ని నాని తెలిపారు. చంద్రబాబుకు వాటా ఉన్న సంస్థ కూడా 2014 జూలైలోనే అక్కడ భూములు కొనుగోలు చేసిందని, డాక్యుమెంట్లతో సహా ఆధారాలున్నాయని తెలిపారు. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు... వారి కుటుంబ సభ్యులు కొనుగోలు చేసిన భూముల వివరాలూ ఉన్నాయన్నారు. "దీనిపై తదుపరి విచారణ కూడా వేస్తాం. ఇది సీబీఐకు ఇవ్వాలా, సీబీసీఐడీకి ఇవ్వాలా, లోకాయుక్తకు ఇవ్వాలా అనేది న్యాయ నిపుణులతో మాట్లాడి నిర్ణయిస్తాం. తప్పు చేస్తే శిక్షించండి, ధైర్యముంటే విచారణ వేయండని కొందరు అంటున్నారు. పాపం పండినపుడు అదెలాగూ జరుగుతుంది" అని చెప్పారు. వారు, వారి కారు డ్రైవర్ల పేరుతో కొన్న భూముల డాక్యుమెంట్లూ బయట కొస్తాయన్నారు.

### మీడియా ప్రశ్న - మంత్రి జవాబు

**రాజధాని** నిర్మాణానికి అదనంగా ఖర్చు అక్కర్లేదని, అది 'సెల్ఫ్ ఫైనాన్స్' ప్రాజెక్టు అని చంద్రబాబు చెబుతున్నారు కదా!

అదే నిజమైతే గత ప్రభుత్వం రూ.4వేల కోట్లు అప్పు ఎందుకు చేయాల్సి వచ్చింది? రైతులకు కౌలు చెల్లించలేదు? చేసిన అప్పులకు వడ్డీయే ఏటా రూ.570కోట్లు కట్టాల్సి వస్తోంది.

**రాజధాని** తరలించే ఉద్దేశంతోనే విశాఖకు ఒకేసారి వందలకోట్లు కేటాయించారా?

మొన్న ముఖ్యమంత్రి జగన్ కడప జిల్లాకు వెళ్లి వేల కోట్ల నిధులు కేటాయిస్తామన్నారు. రాజధాని అక్కడకు వెళ్లలేదు కదా! మేం అన్ని ప్రాంతాలకు నిధులు కేటాయిస్తున్నాం

**రాజధాని** కమిటీలపై కేంద్రానికి చెప్పారా?

అవసరమైనప్పుడు చెబుతాం. సీఎం అప్పుడప్పుడు ప్రధానిని కలుస్తున్నారు. ఈ విషయం కూడా చెప్పారేమో నాకు తెలియదు.

**విజయవాడ**-గుంటూరు మధ్యలోనే రాజధాని ఉంటుందని ఎన్నికల సభలో జగన్ చెప్పారు కదా?

చదువుకుంటున్నప్పుడు మీకో ప్యాషన్ ఉంటుంది. పాత్రికేయుడిగా చేరాక ఇక్కడి సాధక బాధకాలు తెలుస్తాయి. అప్పుడు జగన్‌కు ఇక్కడ జరిగిన విషయాలన్నీ తెలియకపోవచ్చు. బీజేపీఅధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ తొలుత మూడు రాజధానులంటే స్వాగతించారు. తర్వాత వ్యతిరేకిస్తున్నారు.

**రాజధానిపై** హైపవర్ కమిటీ నివేదిక వచ్చాక అఖిలపక్ష సమావేశం పెడతారా?

ఆ అవకాశం ఉంటే చెబుతాం.

**విశాఖపట్నంలో** రాజధాని అని... భీమిలి నియోజకవర్గంలోనే వస్తుందని విజయసాయిరెడ్డి చెప్పారుగా?

విజయ సాయిరెడ్డి పార్టీ నాయకుడు. ఆయన విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా కూడా ఉన్నారు. పార్టీ నేతగానే చెప్పుంటారు. అంతే తప్ప ప్రభుత్వం చెప్పలేదుగా?

## రాజధాని ఎక్కడున్నా ఒక్కటే

- పబ్లిసిటీ స్టంట్‌గా వాడుకుంటున్నారు: వర్మ



డాబాగార్డెన్స్ (విశాఖపట్నం), డిసెంబరు 27: "ఆంధ్రప్రదేశ్ రాజధాని ఎక్కడున్నా ఒక్కటేనన్నది నా ఉద్దేశం. రాజధాని మార్చడం వల్ల కనిపించే తేడా ఏమిటో నాకు తెలియదు. అనకాపల్లిలో పెట్టినా పక్క రాష్ట్రంలో పెట్టినా నాకు తేడా తెలియదు. రాజధాని అనే మాటకు మీనింగ్ లేదు. రాజధాని చెన్నైలో వున్నా ఒక్కటే" అని దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అన్నారు. 'బ్యూటిఫుల్' చిత్రం ప్రమోషన్ కోసం ఆయన శుక్రవారం విశాఖకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏ రాజకీయ నాయకుడైనా ఓటరుతో మనస్ఫూర్తిగా మాట్లాడిన సందర్భం ఉందా? అని ప్రశ్నించారు. రాజధాని అంశాన్ని పబ్లిసిటీ స్టంట్‌గా వాడుకుంటున్నారని అనిపిస్తోందని అన్నారు. గతంలో రాజధాని కోసం చేసిన ట్వీట్లు పబ్లిసిటీ స్టంట్ కోసమేనన్నారు. తనకు సమాజం పట్ల బాధ్యత ఉందని ఎవరికీ, ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. గతంలో మూడో పెగ్గులో ఉన్నప్పుడు రాజధాని కోసం ట్వీట్లు చేసేశాడినన్నారు. ఇప్పుడు వోడ్కాలో లేను కాబట్టి రాజధాని గురించి నేనేం మాట్లాడనని అన్నారు. రొమాంటిక్ వర్మగా మళ్లీ పేరు తెచ్చుకుంటానని వర్మ అన్నారు. తాను హిట్‌ను ఎంత బ్యూటిఫుల్‌గా తీసుకుంటానో, ఫ్లాప్‌ను కూడా అంతే బ్యూటిఫుల్‌గా తీసుకుంటానన్నారు. రాజకీయాలు, యాక్షన్ తరహా సినిమాల నుంచి రిలాక్స్ అయి ఇప్పుడు బ్యూటిఫుల్ చిత్రం తీశానన్నారు. అందరూ హ్యాపీ న్యూయర్ శుభాకాంక్షలు ఎందుకు చెబుతారో తనకు అర్థం కాదనీ, ఎవరి జీవితాలు మారిపోవు... జారిపోవని వ్యాఖ్యానించారు.

జగన్, ఆళ్లకు వ్యతిరేకంగా య(ర్రబాలెంలో ఆందోళన




## 101 ఏళ్ల యడ్లపాటి నిరసన

శతాధిక స్ఫూర్తి



101 సంవత్సరాల వయసులో టీడీపీ మాజీ మంత్రి యడ్లపాటి వెంకట్రావు తెనాలిలో జరిగిన నిరసనలో పాల్గొన్నారు. టీడీపీ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ 'మన అమరావతి - మన రాజధాని' పేరిట జరిపిన ఈ సభకు యడ్లపాటి మూడు చక్రాల కుర్చీలో హాజరయ్యారు. నిరసన సాగినంత సేపూ ఓపికగా శిబిరంలోనే ఉన్నారు. "జగన్ సర్కారు తీసుకున్న నిర్ణయం సరైనది కాదు. ఈ తరహా రాజధాని మార్పులు మంచి పరిణామం కాదు. దానిని పునఃసమీక్షించుకోవాలి" అని యడ్లపాటి విజ్ఞప్తి చేశారు. 'మూడు' వద్దు అంటూ ముగ్గులు దిద్దారు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మహిళలు. అమరావతికి చిహ్నంగా బుద్ధుని ప్రతిమను ముగ్గులో ఉంచారు. తుళ్లూరు శిబిరంలో మహిళలు అమరేశ్వరి దేవికి పూజలు చేశారు. ముస్లింలు మోకాళ్లపై కూర్చుని అల్లాని ప్రార్థించారు. తుళ్లూరు శిబిరాన్ని స్వామి స్కందానంద సందర్శించగా, మద్దతుగా యూపీకి చెందిన స్వామి చక్రపాణి వ్యాఖ్యలున్న పోస్టర్లు రాజధాని గ్రామాల్లో కనిపించాయి.

## పిట్ట కొంచెం గళం ఘనం

పది సంవత్సరాల యోగశ్రీ మైకు పట్టుకొని బిగ్గరగా గుక్కతిప్పుకోకుండా చేసిన నినాదాలు రైతుల్లో పోరాటతత్వాన్ని నూరిపోశాయి. 'వియ్ వాంట్ అమరావతి'... 'భూములు ఇచ్చాం-రోడ్డున పడ్డాం'... 'రక్తాన్ని అయినా చిందిస్తాం-అమరావతి సాధిస్తాం'...ప్రాణాలైనా అర్పిస్తాం-అమరావతి సాధిస్తాం' అంటూ ఈ విద్యార్థిని పది నిమిషాల పాటు నినాదాలు చేసింది. ధర్నాకు హాజరైనవారంతా ఉత్సాహంగా యోగశ్రీతో గొంతు కలిపారు.

జగన్‌కు ఓట్లు వేయించి తప్పు చేశానంటూ తాడికొండలో చెప్పుతో కొట్టుకుంటున్న వైసీపీ కార్యకర్త





గొల్లపూడిలో జరిగిన నిరసన ర్యాలీలో మాజీ మంత్రి దేవినేని ఉమ తదితరులు

# వెనక్కి తగ్గం

(మొదటి పేజీ తరువాయి)

నిరసనలు, రాస్తారోకోలు, మహాధర్నాలు, మౌనదీక్షలు, సంఘీభావ కవాతులతో దాదాపు అన్ని జిల్లాలు హోరెత్తిపోయాయి. ఆంక్షలు, సంకెళ్లు ఏవీ 'రాజధాని' సంకల్పాన్ని అణచలేకపోయాయి. మహాధర్నా శిబిరాలు కొనసాగుతున్న మందడం, వెలగపూడి, తుళ్లూరుల్లో 'రాజీ లేదు.. అమరావతే' అంటూ రైతులు కదం తొక్కారు. పోలీసుల తనిఖీలను దాటుకొని ధర్నా శిబిరాలకు చేరుకొన్నారు. కేబినెట్ నిర్ణయం ఎలా ఉన్నా.. రాజధానుల నిర్ణయం రద్దయ్యేవరకు వెనక్కి తగ్గొద్దనే పట్టుదల రైతుల్లో కనిపించింది. రాజధానిపై నిర్ణయాన్ని కేబినెట్ వాయిదా వేసినట్టు మధ్యాహ్నం రెండు గంటలకు తెలిసింది. అయినా, మహాధర్నా శిబిరాలను ఆ సమాచారం పెద్దగా కదిలించలేకపోయింది. పోరాటాన్ని కొనసాగించాల్సిందేనని ముక్తకంఠంతో రైతులు, జేఏసీలు తీర్మానించాయి.

నిరసనల పరంపరలో పదోరోజు పెదపరిమి నుంచి తుళ్లూరు వరకు పలుచోట్ల రైతులు టైర్లు రోడ్లపై తగలబెట్టి నిరసన తెలిపారు. ఉదయం 8 గంటలకే తుళ్లూరులోని శిబిరానికి రాయపూడి, దొండపాడు, బోరుపాలెం, అబ్బరాజుపాలెం, అనంతవరం, నెక్కల్లు, నేలపాడు శాకమూరు గ్రామాల నుంచి రైతులు వేలాదిగా తరలివచ్చారు. ఎండను లెక్క చేయకుండా రోడ్డుపై బైఠాయించి నిరసన గళం విప్పారు. మాకు అమరావతి కావాలి....సేవ్ అమరావతి... రక్తాన్ని అయినా చిందిస్తాం... అమరావతి సాధిస్తాం అన్న నినాదాలతో హోరెత్తించారు. నమ్మి ఓట్లు వేయించినందుకు చెప్పుతో కొట్టుకుంటున్నాం అంటూ ధూళిపాళ్ల బాబూరావు అనే వైసీపీ కార్యకర్త తాడికొండలో వాపోయాడు. రాజధానుల ప్రకటనపై తనను తాను చెప్పుతో కొట్టుకొంటూ అర్ధనగ్నంగా రోడ్డుపై నిరసన తెలిపాడు. 'వైఎస్ అన్న! నీ కుమారుడిని నమ్మాం. పెళ్లాం, పిల్లలు, మా చుట్టుపక్కల వారితో ఓట్లు వేయించాం. దాని ఫలితంగా ఇప్పుడు మా చెప్పుతో మేము కొట్టుకునే పరిస్థితి వచ్చింది" అని కన్నీరుపెట్టాడు. 'అన్నం సహించడం లేదు.. నిద్ర పట్టడం లేదు' అంటూ తుళ్లూరు, మందడంలోని నిరసన శిబిరాల్లోని మహిళలు కన్నీరుమున్నీరయ్యారు. తుళ్లూరులో ధర్నా జరుగుతుండగానే అటుగా వాహనాలను పోలీసులు అనుమతించారు. ఈ క్రమంలో రెండుకార్లు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకొన్నాయి. పోలీసుల తీరుపై అక్కడున్న రైతులు రగిలిపోయారు. వారితో వాగ్వాదానికి దిగారు.

### ఆగదు.. ఆగదు.. ఆగదు..

జీఎన్ రావు కమిటీ.. బోస్టన్ కన్సల్టెన్సీ.. హైపవర్ కమిటీ.. ఇలా ఎన్నిమాటలు రాజధానిపై చెప్పినా రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని నమ్మలేమని రాజధాని రైతులు తేల్చిచెబుతున్నారు. పూర్తిస్థాయి రాజధానిగా అమరావతిని కొనసాగిస్తామంటూ ప్రభుత్వం విస్పష్టంగా ప్రకటించేంత వరకూ ఆందోళనలను ఆపేది లేదని తేల్చిచెబుతున్నారు. అంతేకాదు, ఇకపై నిరసనల పరంపరను ఉధృతం చేయాలని కూడా భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిపై స్పష్టమైన ప్రకటన చేయనప్పటికీ తమ ఆందోళనలు ఆగవని అమరావతి రాజధాని పరిరక్షణ కమిటీ, పొలిటికల్ జేఏసీ కూడా స్పష్టం చేసింది. పోరాటషెడ్యూల్‌ను గుంటూరులో జరిగిన కమిటీ సమావేశంలో ఖరారు చేసింది. ఈ నెల30 నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద రిలే దీక్ష చేయాలని నిర్ణయించింది.

### టెన్షన్.. టెన్షన్..

కేబినెట్ సమావేశాలు, సీఎంకు బందోబస్తు పేరిట పోలీసు దిగ్బంధించిన మందడంలో శుక్రవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం కనిపించింది. ఇళ్లలోంచి రావొద్దని, దుకాణాలు తీయొద్దని ప్రజలపై పోలీసులు తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. మూడు రోజులుగా పోలీసుల అణచివేతను సహిస్తున్న రైతులు, ఇక తట్టుకోలేక తిరగబడ్డారు. 144 సెక్షన్‌ను లెక్కచేయకుండా, రోడ్డుపై బైఠాయించారు. ఆందోళన చేస్తున్న రైతుల్లో ఇరవై మందిని పోలీసులు అదుపులోకి తీసుకొని మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడకు మహిళలు పెద్దఎత్తున చేరుకొని ప్రభుత్వానికి నిరసన తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల తరువాతే పోలీసులు ఈ గ్రామానికి రాకపోకలను అనుమతించారు. అప్పటిదాకా కొనసాగిన విపరీతమైన తనిఖీలు, చెక్‌పోస్టుల వద్ద హడావుడితో సచివాలయ ఉద్యోగులకూ ఇబ్బందులు తప్పలేదు. మందడం సెంటర్ నుంచి సచివాలయానికి వెళ్లే దారిలోఎవ్వరు వచ్చినా పోలీసులు గుర్తింపు కార్డు చూపితేనే సచివాలయం వైపు వెళ్లనిచ్చారు. సచివాలయ ప్రధాన ద్వారం వద్దా తనిఖీలు ముమ్మరం చేశారు. ఆ మార్గంలో ఇనుపకంచెలను ఏర్పాటు చేశారు. సచివాలయం లోపలకు ప్రవేశించినా ఉద్యోగులకు ఊరట దొరకలేదు. మొదటి బ్లాక్ వద్ద సీఎంవో ఉద్యోగుల గుర్తింపు కార్డులను సైతం పరిశీలించాకే పంపించారు. మంత్రివర్గ సమావేశం ఆ బ్లాక్‌లోనే జరిగింది. అక్కడకు మంత్రులను తప్ప వారి వ్యక్తిగత సిబ్బందిని, అంగరక్షకులను మాత్రం అనుమతించలేదు. కదిలొచ్చిన 6 జిల్లాల లాయర్లు హైకోర్టు తరలింపు ప్రయత్నాలను నిరశిస్తూ న్యాయవాదులు వరుసగా రెండోరోజూ విధులకు దూరంగా ఉన్నారు. జిల్లా కోర్టుల్లోని లాయర్లు కూడా ఇదే బాటలో నడిచారు. రాజధాని వ్యవహారం తేలేవరకు కోర్టు కేసులకు హాజరు కారాదని ఆరు జిల్లాల న్యాయవాదులు తీర్మానించారు. వారంతా తుళ్లూరులో భేటీ అయి ఈ నిర్ణయం తీసుకొన్నారు. అక్కడి రైతులకు మద్దతు ప్రకటించారు. రైతులకు సంఘీభావంగా గుంటూరు జిల్లా పెదకాకాని హైవేపై టీడీపీ, సీపీఐ, జనసేన, బీజేపీ సంయుక్తంగా మహాధర్నా నిర్వహించాయి. హైవేకు ఇరువైపులా కిలోమీటరు పొడవునా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు బలవంతంగా టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, రాజధాని ప్రాంతంలో బీజేపీ నాయకత్వం శనివారం పర్యటించనుంది.



మందడం గ్రామం మీదుగా పోలీసు పహారాలో వెళ్తున్న సీఎం జగన్ కాన్వాయ్

## విశాఖను ఒప్పుకోం

- రాయలసీమలోనే రాజధాని, హైకోర్టు
- కర్నూలులో విద్యార్థుల మానవ హారం

రాయలసీమను విస్మరించి.. అభివృద్ధి చెందిన విశాఖలో పాలనా రాజధాని పెట్టడం ఏమిటని రాయలసీమ విద్యార్థులు ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని ఒప్పుకొనేది లేదని తేల్చిచెప్పారు. శ్రీబాగ్ ఒప్పదం మేరకు రాయలసీమలోనే రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో కర్నూలు నగరంలోని బిర్లాగేట్ వద్ద రాయలసీమ విద్యార్థి సంఘాల జేఏసీ భారీ మానవ హారం నిర్మించింది. రాజధాని, హైకోర్టుపై స్పష్టత ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యాక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించింది. వీరి ఆందోళనతో కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు స్తంభించాయి. కాగా, అమరావతిలోనే రాజధానిని కొనసాగించాలంటూ చిత్తూరు జిలా నగరిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కాగడాల ప్రదర్శన నిర్వహించాయి. శ్రీకాళహస్తిలో తెలుగుదేశం పార్టీ నేత పీఆర్ మోహన్ తలకిందులుగా వేలాడుతూ.. వినూత్న నిరసన తెలిపారు.

## హోరెత్తిన బెజవాడ

- రోడ్డెక్కి ధర్నాకు దిగిన టీడీపీ నేతలు
- దేవినేని ఉమ, బోడె ప్రసాద్ అరెస్ట్
- మంత్రి బొత్స ఇంటిని ముట్టడి

విజయవాడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజధానిని అమరావతిలోనే కొనసాగించాలంటూ ఆందోళనలు, నిరసనలు, మానవహారాలతో బెజవాడ హోరెత్తింది. మాజీ మంత్రి దేవినేని ఉమ గొల్లపూడి నుంచి దుర్గగుడి వరకూ భారీ నిరసన ర్యాలీని నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు రైతులు, మహిళలు సుమారు 4వేల మంది వరకు తరలివచ్చారు. అమరావతి రైతులకు సంఘీభావంగా ఉమ గొల్లపూడి వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అమరావతికి వ్యతిరేకంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని దేవినేని హెచ్చరించారు. పోలీసులు ఆయనను అరెస్టు చేసి తోట్లవల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పెనమలూరు సెంటర్‌లో విజయవాడ-బందరు రహదారిపై ఆందోళనకు దిగారు. ఆయనను కూడా పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇదిలావుంటే, విజయవాడలోని మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటిని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మం నేతృత్వంలో టీఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు, రైతులు ముట్టడించారు. కొద్దిసేపు ఆందోళన చేసిన అనంతరం వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. విజయవాడ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో భారీ ర్యాలీ జరిగింది. విజయవాడ గాంధీనగర్‌లో అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మానవ హారంలో నగరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని కోరుతూ శుక్రవారం సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో భారీ కవాతు నిర్వహించారు. రాజధాని విషయంలో జగన్ మొండిగా వ్యవహరిస్తే అగ్గిపుట్టిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు.

## రైతులకు న్యాయం జరగాలి

**ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు**

పిడుగురాళ్ల, డిసెంబరు 27: "గత ప్రభుత్వం అడగకపోయినా 33 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా రైతులు ఇచ్చారు. రాజధాని ఎక్కడ? ఎలా? అనే దాని కన్నా భూములిచ్చిన రైతులకు న్యాయం జరగాలి. భూములిచ్చిన రైతులకు సీఎం జగన్ న్యాయం చేస్తారు" అని గుంటూరు జిల్లా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్లలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి చేపట్టిన ప్లాన్ ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. పౌరసత్వ బిల్లుకు సీఎం జగన్ మద్దతు ఇవ్వటం లేదన్నారు.

## రాజకీయ కక్షలతోనే: సుజనా

తిరుమలగిరి/హైదరాబాద్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షలతోనే ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని వేరే ప్రాంతాలకు మార్చడానికి సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నట్లు ఉందని బీజేపీ ఎంపీ సుజనాచౌదరి ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రపతి కోవింద్‌ను కలిసి అమరావతి కోసం భూములిచ్చిన రైతులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆందోళనలతోపాటు రాజధాని మార్పు నిర్ణయం గురించి రాష్ట్రపతికి వివరించినట్లు ఆయన విలేకరులకు చెప్పారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో కియ పరిశ్రమ ఏర్పాటుచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని, కానీ రాజధానుల మార్పు ఎంతమాత్రమూ తగదన్నారు. పిల్లి పిల్లలను మార్చినట్లు రాజధానుల మార్పు తొందరపాటు చర్య అని ఆయన అభివర్ణించారు. జీఎన్ రావు కమిటీ నివేదిక పూర్తిగా అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. రాజధాని మార్పు, రైతుల సమస్యలపై కోర్టును ఆశ్రయించే విషయాన్ని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. రివర్స్ టెండరింగ్, రాజధాని మార్పు వంటివి పూర్తిగా రాజకీయ విద్వేషాలకు తావిస్తుందన్నారు. ప్రజలకు పరిపాలన సరిగా అందకపోతే సరైన సమయంలో బీజేపీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

## ఉద్రిక్తతలు పెరుగుతాయి: సీపీఎం

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): "రాష్ట్ర ప్రభుత్వం రాజధానిపై పారదర్శకంగా వ్యవహరించాలి. మంత్రివర్గ సమావేశంలో రాజధాని అంశంపై చేసిన నిర్ణయం ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరగడానికి మరింత దోహదం చేస్తున్నాయి. జీఎన్ రావు కమిటీపై నిర్ణయం ప్రకటించకుండా బోస్టన్ కమిటీ నివేదిక కోసం ఎదురు చూస్తున్నామనీ, ఈ రెండు నివేదికలను అధ్యయనం చేయడానికి మరొక హైపవర్ కమిటీ వేస్తామని ప్రకటించడం సమస్యను సాగదీయడానికే తోడ్పడుతుంది" అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. ఇప్పటికే జీఎన్‌రావు కమిటీ నివేదికలో ఏముందో ప్రజలకు తెలియదని చెప్పారు. బోస్టన్ కన్సల్టెన్సీని ఎందుకు నియమించారో తెలియదన్నారు. ప్రజలను అయోమయంలో పెట్టి రాజధాని అంశంపై మంత్రులు తలోరకంగా మాట్లాడుతూ గందరగోళం సృష్టిస్తున్నారన్నారన్నారు. ఈ చర్చను కొనసాగించకుండా వెంటనే అఖిలపక్షం వేసి ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రయత్నించాలని ఆయన కోరారు. అమరావతిలో ఇన్‌సైడర్ ట్రేడింగ్‌పై విచారణ జరిపిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమన్నారు. అలాగే విశాఖలోనూ తాజా భూముల కొనుగోళ్లపై ప్రజల్లో పలు అనుమానాలున్నాయన్నారు. అందువల్ల అమరావతి, విశాఖ రెండు చోట్లా న్యాయ విచారణ జరిపించాలని మధు డిమాండ్ చేశారు.

## మీరు పెయిడ్ ఆర్టిస్టులా?

- ఓ చానల్ మహిళా రిపోర్టర్ వ్యాఖ్య
- ఆగ్రహంతో కారు అద్దాలు పగలగొట్టిన రైతులు
- జర్నలిస్టులు, పోలీసులకూ గాయాలు

'మేం పెయిడ్ ఆర్టిస్టులమా..? మా త్యాగాలు అంత అలుసా' అంటూ రాజధాని రైతులు ముగ్గురు మీడియా ప్రతినిధులపై రెండుచోట్ల దాడి చేశారు. ఈ ఘటనల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. రైతులను ఆపే ప్రయత్నంలో పోలీసులూ గాయపడ్డారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చేపట్టిన మౌన దీక్షను కవర్ చేసేందుకు కొన్ని చానళ్ల ప్రతినిధులు వెళ్లారు. ఓ చానల్ కన్నాను ఇంటర్వ్యూ చేస్తున్న సమయంలో.. కొందరు రైతులు 'మీది కేసీఆర్ చానెల్.. ఇక్కడి నుంచి వెళ్లిపోండి' అంటూ నినాదాలు చేశారు. ఆ చానల్ మహిళా రిపోర్టర్.. ఆ రైతుల దగ్గరకు వచ్చి 'మీరు పెయిడ్ ఆర్టిస్టులా' అన్నారు. దీంతో రైతులు ఆవేశంతో ఆమెపై దాడికి ప్రయత్నించారు. పోలీసులు రైతులను అడ్డుకోగా, ఇద్దరు మీడియా ప్రతినిధులు ఆమెను కారెక్కించి పంపారు. 'క్షమాపణ చెప్పించకుండా ఆమెను ఎందుకు పంపించారు' అంటూ ఆ ఇద్దరు ప్రతినిధులపై రైతులు దాడి చేశారు. మహిళా రిపోర్టర్ కారును వెలగపూడిలో మహిళలు అడ్డుకుని కారు అద్దాలు పగలగొట్టారు. పోలీసులు అతికష్టం మీద ఆమెను అక్కడినుంచి పంపించివేశారు.

## రాజధాని అమ్మకానికి కుట్ర

**రైతులకు మద్దతుగా కన్నా లక్ష్మీనారాయణ మౌనదీక్ష**

గుంటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజధానిని అమ్మేందుకు సీఎం జగన్మోహన్‌రెడ్డి కుట్ర పన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. రాజధాని ప్రాంత రైతులకు బాసటగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని ఉద్దండరాయపాలెంలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన స్థలంలో శుక్రవారం ఆయన మౌనదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజధాని భూములను నచ్చిన వారికి అమ్ముతామని వైసీపీ నేతలు చెబుతున్నారని మండిపడ్డారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను జగన్ నిట్టనిలువునా ముంచుతారని ఎవరూ ఊహించలేదన్నారు. రాజధాని కోసం రైతులు చేసిన త్యాగాన్ని గుర్తించి పన్ను చెల్లింపుల విషయంలో కేంద్రం మినహాయింపు ఇచ్చిందని గుర్తు చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణకు బీజేపీ మద్దతు ఉంటుంది తప్ప.. పరిపాలన వికేంద్రీకరణకు కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బీజేపీ పోరాటం చేస్తుందని, మొదటి అడుగుగా మౌన దీక్ష చేశామని కన్నా వివరించారు.



ఉండవల్లి ప్రధాన కూడలిలో నేలపై పడుకుని ఆందోళన

## మళ్లీ గెలిచి తరలించు

- మడమ తిప్పను, నిజాయితీ... అంతా బుస్
- సీపీఐ నారాయణ ధ్వజం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): "రైతులు చంద్రబాబు తాత, ముత్తాతల ఇళ్ల కోసం భూములు ఇవ్వలేదు. రాజధాని నిర్మాణం కోసం ప్రభుత్వంతో ఒప్పందం చేసుకొన్నారు. అమరావతి ప్రతిపాదన వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న నువ్వు (జగన్) సంపూర్ణ మద్దతు పలికావు. ఎన్నికల్లో పొరపాటున కూడా అమరావతిని ఇక్కడి నుంచి తరలిస్తానని చెప్పలేదు. నవరత్నాలు గురించే మాట్లాడారు. ప్రజలకు చెప్పకుండా, మేనిఫెస్టోలో చేర్చకుండా రాజధానిని తరలించే అధికారం నీకు ఎవరిచ్చారు? కావాలంటే మళ్లీ ప్రజల వద్దకు వెళదాం. నేను సవాలు విసురుతున్నా. అప్పుడు కూడా నువ్వు గెలిస్తే రాజధానిని తీసుకెళ్లి పులివెందులలోనో, ఇడుపులపాయలోనో పెట్టుకో. అప్పటివరకు రాజధానిని మార్చే హక్కే లేదు" అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, సీఎం జగన్మోహన్‌రెడ్డికి స్పష్టం చేశారు. రాజధాని రైతులకు మద్దతుగా ఆయన తాడికొండ, తుళ్లూరులో ఆందోళనలలో పాలు పంచుకొన్నారు. విశాఖలో ప్రశాంత వాతావరణం వీళ్లు కాళ్లు పెడితే మటాష్ అయిపోతుందని నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన తిప్పల నాగిరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, టీడీపీకి చెందిన గంటా శ్రీనివాసరావు తదితరులు భూ డెకాయిట్‌లని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ భూములను నకిలీ స్వాతంత్ర సమర యోధుల పేరుతో సుమారు ఐదు వేల ఎకరాలను ఆక్రమించి అన్యాక్రాంతం చేశారని తెలిపారు. అప్పటి సీఎం చంద్రబాబు సిట్ వేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆ తర్వాత సీఎంగా వచ్చిన జగన్ ఏడు నెలలైనా ఏమి చేయలేదని మండిపడ్డారు. జగన్ చెప్పే 'నిజాయితీ, మడమ తిప్పను' వంటివన్ని బుస్ అంటూ ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో బలం ఉంది కదా అని రాజధాని తరలింపుపై చట్టం చేసినా అంగీకరించే ప్రశ్నే లేదని తేల్చి చెప్పారు. రైతు కుటుంబాల మహిళల కంట ఒలికిన కన్నీరు ఊరికేపోదని, కచ్చితంగా పగ తీర్చుకొంటుందని అన్నారు. చంద్రబాబుతో కక్ష ఉంటే ఆయనతో తుళ్లూరుకు వచ్చి కుస్తీ పడాలని అన్నారు. ఆరంభం నుంచీ విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఉండాలన్న మాటకే కట్టుబడి ఉన్నామని నారాయణ స్పష్టం చేశారు. రాజధానిగా అమరావతినే కొనసాగిస్తామని సీఎం జగన్ స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.




రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించిన సీపీఐ నేత నారాయణ

## మీరే న్యాయం చేయాలి

- రాష్ట్రపతికి అమరావతి రైతుల అభ్యర్థన

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజధాని తరలింపు ఆలోచనను వ్యతిరేకిస్తున్న అమరావతి ప్రాంత రైతులు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి తమ ఆవేదన, అభ్యంతరాలను తెలియచేశారు. రాష్ట్ర విభజన అనంతరం రాజధాని లేని ఆంధ్రప్రదేశ్‌కు అమరావతిని అద్భుత రాజధానిగా ప్రభుత్వం నిర్మిస్తుందన్న విశ్వాసంతో 29గ్రామాలకు చెందిన వేలమంది రైతులు తమ భూములు ఇచ్చారని, వారి త్యాగం నిరర్థకమయ్యే దుస్థితి నెలకొన్నదని కోవింద్‌కు విన్నవించారు. ఈ దేశ ప్రథమ పౌరుడిగా, రాజ్యాంగాధిపతిగా ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకుని, పూర్తిస్థాయి రాజధానిగా అమరావతే కొనసాగేలా చూడాలని ఆయనను అభ్యర్థించారు. శీతాకాల విడిది కోసం హైదరాబాద్ వచ్చిన కోవింద్‌ను అమరావతి రాజధాని సమీకరణ రైతు సమాఖ్య నేతలు మాదల రాజేంద్ర, ముప్పవరపు కృష్ణారావు, పువ్వాడ సుధాకరరావు, ఉప్పలపాటి సాంబశివరావు తదితరులు కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరితోపాటు కలిశారు. రాజధాని వికేంద్రీకరణ దిశగా రాష్ట్రప్రభుత్వం చేస్తున్న యోచనను తాము ఏయే కారణాల వల్ల తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామో ఈ సందర్భంగా రాష్ట్రపతికి వివరించారు. రాష్ట్ర విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అమరావతి నిర్మాణానికి సంకల్పించినట్లు 2014లో సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనను అసెంబ్లీలో అన్ని పార్టీల సభ్యులు ఆమోదించారని, అప్పుడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కూడా సంపూర్ణ మద్దతు తెలిపారని వివరించారు. ఈ నేపథ్యంలో రాజధాని కోసం రైతులు 33వేల ఎకరాలు భూసమీకరణలో ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వం రాజధాని వికేంద్రీకరణ దిశగా యోచిస్తుండడం తమకు శరాఘాతంలా పరిణమించింది రైతులు ఆవేదన తెలిపారు. రాజధానిని తరలిస్తే తామిచ్చిన భూములకు విలువ దారుణంగా పడిపోయి, బతుకులు దుర్భరమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



బస్సులో సచివాలయానికి వెళ్లే ఉద్యోగుల ఐడీ కార్డులను పరిశీలిస్తున్న పోలీసులు



ఆందోళన చేస్తున్న మహిళలను తాళ్లతో నియంత్రిస్తున్న పోలీసులు

## అదీ .. పాక్ అసలు రంగు


గంభీర్

న్యూఢిల్లీ: హిందూ క్రికెటర్ డానిష్ కనేరియా విషయంలో పాకిస్థాన్ జట్టు ఆటగాళ్లు ప్రవర్తించిన తీరు.. ఆ దేశ అసలు రంగును బయటపెట్టిందని గంభీర్ అన్నాడు. లెగ్ స్పిన్నర్ కనేరియా పాక్‌కు ఎన్నో విజయాలు అందించినా.. అతడు హిందువు కావడంతో కొందరు పాక్ క్రికెటర్లు కనేరియాపట్ల వివక్ష ప్రదర్శించేవారని ఆ దేశ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గంభీర్ స్పంది స్తూ.. 'కనేరియా 65 టెస్టుల్లో పాక్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అయినా అతడిపట్ల అమానుషంగా ప్రవర్తించడం సిగ్గుచేటు. కైఫ్, ఇర్ఫాన్ పఠాన్, మునాఫ్ పటేల్‌కు భారత్ ఎంతో గౌరవం ఇచ్చింది. దేశం గర్వపడేలా మేమంతా కలిసికట్టుగా ఆడాం. కానీ పాక్ నుంచి వస్తున్న వార్తలు దురదృష్టకరం. అయినా పాకిస్థాన్ అసలు రంగు ఇదే. ఒక ఆటగాడికే అలాంటి పరిస్థితి ఎదురైందంటే ఇక పాక్‌లో ఇతర మైనార్టీల పరిస్థితి ఏంటో ఊహించొచ్చు' అని గంభీర్ అన్నాడు.

## స్నేహిత్ బృందానికి రజతం




హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): చెన్నైలో జరిగిన అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో అంతర్జాతీయ ఆటగాడు ఫిడేల్ ఆర్ స్నేహిత్ సారథ్యంలోని ఉస్మానియా యూనివర్సిటీ జట్టు రజత పతకం దక్కించుకుంది. ఫైనల్లో స్నేహిత్, మహ్మద్ అలీ, వృషిన్, రఘురామ్, శశికిరణ్‌లతో కూడిన ఓయూ టీమ్ 2-3తో చిట్కార యూనివర్సిటీ జట్టు చేతిలో ఓడి రజతంతో సంతృప్తి పడింది.

## హెడ్ శతకం

ఆసీస్ 467 ఆలౌట్
న్యూజిలాండ్ 44/2
బాక్సింగ్ డే టెస్ట్

మెల్‌బోర్న్: ట్రావిస్ హెడ్ (114) శతకంతో న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఆతిథ్య ఆస్ట్రేలియా పట్టుబిగించింది. 257/4 స్కోరుతో రెండోరోజైన శుక్రవారం ఆటను కొనసాగించిన ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 467 పరుగులకు ఆలౌటైంది. వాగ్నర్ (4/83) నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ స్మిత్ (85)ను వాగ్నర్ తొందరగానే పెవిలియన్ చేర్చాడు. హెడ్, కెప్టెన్ పెయిన్ (79) కలిసి ఆరో వికెట్‌కు 150 పరుగులు జత చేశారు. అయితే, పెయిన్‌ను వాగ్నర్ అవుట్ చేయడంతో ఆసీస్ ఇన్నింగ్స్ వేగంగా ముగిసింది. అనంతరం బరిలోకి దిగిన కివీస్ ఆరంభంలోనే విలియమ్సన్ (9) వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది. ఆట ముగిసేసరికి కివీస్ మొదటి ఇన్నింగ్స్‌లో 44/2 స్కోరు చేసింది. లాథమ్ (9), రాస్ టేలర్ (2) క్రీజులో ఉన్నారు.

**ఈ ఏడాది దేశ రెజ్లింగ్‌లో ప్రముఖంగా చెప్పుకోవాల్సింది యువ ఆటగాడు దీపక్ పూనియా మెరుపుల గురించే. ఒలింపియన్లు సుశీల్ కుమార్, సాక్షి మాలిక్ పూర్తిగా నిరాశపరిచినా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో దీపక్, వినేశ్ ఫొగట్ సహా ఇతర రెజ్లర్లు అమోఘ ప్రదర్శన చేశారు. ఐదు పతకాలతోపాటు నాలుగు ఒలింపిక్ బెర్తులు 'పట్టే'సి ఔరా అనిపించారు. అంతేకాదు టోక్యో ఒలింపిక్స్ పతకాలపై భారీగా అంచనాలు పెంచేశారు.**

రివైండ్ 2019

# పట్టు పట్టారు!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఈ దశాబ్ది చివరి సంవత్సరంలో రెజ్లింగ్ క్రీడను అవలోకిస్తే మొదటగా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మనోళ్ల ప్రదర్శనను ప్రస్తావించాలి. స్టార్లు బజ్‌రంగ్ పూనియా (65 కి), వినేశ్ ఫొగట్ (53 కి.) పోడియం ఫినిష్ చేయడమేకాదు.. టోక్యో ఒలింపిక్స్ బెర్తులూ కైవసం చేసుకున్నారు. ఈ ఏడాది ఆరంభంలో జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మెరిసిన దీపక్ పూనియా (86 కి.) సీనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజత పతకంతో జోరు కొనసాగించాడు. ఆ క్రమంలో ఒలింపిక్స్‌కూ క్వాలిఫై అయ్యాడు. 2010లో సుశీల్ కుమార్ తర్వాత ప్రపంచ టోర్నీలో దీపక్ టైటిల్ చేజిక్కించుకోగలడని భావించారు. కానీ ఊహించని విధంగా అయిన పాదం గాయంతో దీపక్ ఫైనల్‌నుంచి వైదొలిగాడు. ఫలితంగా చరిత్ర సృష్టించే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయాడు. అతడి ప్రతిభకు ఫిదా అయిన యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్.. దీపక్‌ను 'జూనియర్ రెజ్లర్ ఆఫ్ ది ఇయర్' అవార్డుకు ఎంపిక చేయడం విశేషం.

**బజ్‌రంగ్‌కు షాక్:** ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 65 కిలోల విభాగంలో నెంబర్ వన్ బజ్‌రంగ్ పూనియా హాట్‌ఫేవరెట్‌గా బరిలోకి దిగాడు. అంచనాలను నిజంచేస్తూ ఆ మెగా టోర్నీలో అతడు సెమీఫైనల్ వరకు తిరుగులేని విజయాలు సాధించాడు. కానీ కజక్ రెజ్లర్ దౌలత్ నియజబెకోవ్‌తో సెమీస్ బౌట్‌లో ఆ దేశ జడ్జిలు పక్షపాతంతో వ్యవహరించడంతో ఓడాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండోస్థానంలో ఉన్న బజ్‌రంగ్ ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా శ్రమిస్తున్నాడు.

**ఒలింపిక్ పతక రేసులో రవి:** తిరుగులేని టెక్నిక్, బలీయమైన డిఫెన్స్‌కు మారుపేరైన 22 ఏళ్ల రవి దహియా టోక్యో ఒలింపిక్స్ పతక రేస్‌లో ముందంజలో ఉన్నాడు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అతడు కాంస్యం నెగ్గడంతోపాటు ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో సత్తా చాటాడు. ఒత్తిడి పరిస్థితుల్లోనూ ప్రశాంతంగా బౌట్‌లో తలపడే రవి టోక్యోలో పతకం గెలవడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు. నాన్ ఒలింపిక్ కేటగిరిలో వరల్డ్ చాంపియన్‌షిప్ 61 కిలోలలో కాంస్యం గెలిచిన రాహుల్ అవారే భావి స్టార్‌గా మన్ననలు అందుకుంటున్నాడు.

**ఆశలు పెంచిన వినేశ్:** వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచి ఈ మెగా ఈవెంట్‌లో తొలి పతకం ఖాతాలో వేసుకున్న వినేశ్ ఫొగట్ మహిళల విభాగంలో అత్యంత పోటీ ఉండే 51 కిలోలలో తనకు ఎదురులేదని నిరూపించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరల్డ్ నెంబర్ వన్ సారా ఆన్‌ను సహా పలువురు స్టార్ రెజ్లర్లను చిత్తుచేసిన ఫోగట్.. టోక్యో ఒలింపిక్స్‌కు ముందు ఎనలేని ఆత్మవిశ్వాసం కూడగట్టుకుంది. అయితే రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత సుశీల్ కుమార్, రియో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన సాక్షి మాలిక్ ఈ ఏడాది పూర్తిగా నిరాశపరిచారు. వరల్డ్ చాంపియన్‌షిప్‌లో వీరిద్దరు తొలిరౌండ్‌లోనే వెనుదిరిగారు.


దీపక్ పూనియా


వినేశ్

### పాల విక్రేత కుమారుడిగా..

దేశ రెజ్లింగ్‌లో ఈ ఏడాది దీపక్ పూనియా తన ముద్ర వేశాడు. హరియాణాకు చెందిన పాల విక్రేత కుమారుడైన దీపక్ పూనియా.. 2016 క్యాడెట్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గి సంచలనం సృష్టించాడు. 2018లో సీనియర్ స్థాయిలో ఒకటే పతకం నెగ్గిన అతడు ఈ ఏడాది చెలరేగాడు. 2కాంస్యాలు, ఓ రజతం నెగ్గినా.. కజకిస్థాన్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానం సాధించడమే హైలైట్‌గా నిలిచింది. జూనియర్ నుంచి సీనియర్‌గా మారిన కొద్దికాలానికే వరల్డ్ నెంబర్ వన్‌గా ఎదిగిన 20 ఏళ్ల దీపక్‌పై టోక్యో ఒలింపిక్స్‌లో భారీ అంచనాలున్నాయి.


మేరీకోమ్

# కాచుకో..!


నిఖత్ జరీన్

## మేరీతో నిఖత్ అమీతుమీ

### ఒలింపిక్ క్వాలిఫయర్స్ ట్రయల్స్ ఫైనల్ నేడే

న్యూఢిల్లీ: ఒక్క చాన్స్ కోసం ఇన్ని రోజులుగా ఎదురు చూసిన తెలుగు బాక్సర్ నిఖత్ జరీన్‌కు ఆ తరుణం రానే వచ్చింది. ఒలింపిక్ క్వాలిఫయర్స్ కోసం నిర్వహిస్తున్న ట్రయల్స్‌లో మహిళల 51 కిలోల కేటగిరీలో ఆరుసార్లు వరల్డ్ చాంపియన్ మేరీ కోమ్‌తో నిఖత్ అమీతుమీ తేల్చుకోనుంది. శనివారం జరిగే తుది సమరంలో గెలిచిన వారికి వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వుహాన్ జరిగే ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ బెర్త్ ఖరారవుతుంది. శుక్రవారం జరిగిన తొలి రౌండ్ బౌట్లలో మేరీ, నిఖత్ తమ ప్రత్యర్థులపై నెగ్గారు. జూనియర్ వరల్డ్ చాంపియన్ నిఖత్.. జాతీయ చాంపియన్ జ్యోతి గులియాను చిత్తుచేసింది. రీతూ గ్రేవాల్‌ను మేరీ ఓడించింది. ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు సంబంధించి భారత బాక్సింగ్ ఫెడరేషన్ (బీఎ్‌ఫఐ) భిన్న ప్రకటనలతో ఆందోళన చెందిన నిఖత్.. మేరీతో ట్రయల్స్‌కు డిమాండ్ చేయడం పెద్ద దుమారాన్నే రేపింది. గతంలో మేరీ 48 కిలోలకు ప్రాతినిధ్యం వహించేది. కానీ, ఒలింపిక్స్ నుంచి ఆ వెయిట్ కేటగిరీని తప్పించడంతో ఆమె 51 కిలోలకు మారింది. కాగా, ఆ వెయిట్ కేటగిరీకి ప్రాతినిధ్యం వహిస్తున్న నిఖత్‌కు మేరీ రాక ఇబ్బందిగా మారింది. సీనియారిటీ, పాపులారిటీ పరంగా మేరీ ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఇటీవల జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ కోసం ట్రయల్స్‌ను షెడ్యూల్ చేసి బౌట్ సమయానికి మేరీని ఎంపిక చేసినట్టు ప్రకటించడంతో నిఖత్ హతాశురాలైంది. దీంతో తన కెరీర్‌పై ఆందోళన వ్యక్తం చేసిన జరీన్.. తనకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర క్రీడా మంత్రికి లేఖ రాయడం.. ఆ తర్వాత ఫెడరేషన్ ట్రయల్స్ అని ప్రకటించింది. ఇండియన్ బాక్సింగ్ లీగ్‌లోనూ నిఖత్, మేరీ బౌట్ జరగకుండా కథ నడిపారు. ట్రయల్స్‌కు బాక్సర్ల ఎంపికలోనూ ఎంతో సస్పెన్స్ కొనసాగినా.. చివరకు జరీన్‌కు చోటు దక్కింది. ఒకవేళ మేరీని ఓడిస్తే నిఖత్ కెరీర్‌లో ఇది అతిపెద్ద విజయంగానే భావించాలి.

## తడబడిన ఆంధ్ర

### తొలి ఇన్నింగ్స్ 110/7 ● బెంగాల్‌తో రంజీ


జ్ఞానేశ్వర్ (45 బ్యాటింగ్)

కోల్‌కతా: ఆతిథ్య బెంగాల్-ఆంధ్ర జట్టు మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్ డ్రా దిశగా సాగుతోంది. బ్యాటింగ్ వైఫల్యంతో శుక్రవారం ఆట చివరకు ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 110 పరుగులు సాధించింది. ప్రతికూల వాతావరణం కారణంగా మూడో రోజు కేవలం 46 ఓవర్ల ఆటే సాధ్యమైంది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (148 బంతుల్లో 4 ఫోర్లతో 45 బ్యాటింగ్), కెప్టెన్ హనుమ విహారి (44 బంతుల్లో 4 ఫోర్లతో 23) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. మరో ఓపెనర్ ప్రశాంత్ కుమార్ (0), రికీ భుయ్ (0) డకౌటయ్యారు. శ్రీకర్ భరత్ (2), కరణ్ షిండే (6), షోయబ్ మహ్మద్ ఖాన్ (9), శశికాంత్ (1) సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. ఇషాన్ పోరెల్ 3, ముకేష్ కుమార్ 2 వికెట్లు తీశారు. ఆకాశ్‌దీప్, అమిత్‌కు చెరో వికెట్ దక్కింది. ప్రస్తుతం ఫాలోఆన్ తప్పించుకోవాలంటే ఆంధ్ర మరో 30 రన్స్ చేయాలి. అయితే ఆటకు శనివారమే ఆఖరి రోజు కావడంతో మ్యాచ్ డ్రా అయ్యే అవకాశం ఉంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్ 289 పరుగులు చేసింది.

## ఇంగ్లండ్ 181 ఆలౌట్

● ఫిలాండర్‌కు నాలుగు వికెట్లు
● దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

సెంచూరియన్: బౌలర్ల ఆధిపత్యం నేపథ్యంలో దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ మధ్య తొలి టెస్ట్ ఆసక్తికరంగా మారింది. కెరీర్‌లో చివరి టెస్ట్ సిరీస్ ఆడుతున్న ఫిలాండర్ (4/16) నిప్పులు చెరగడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 181 పరుగులకే కుప్పకూలింది. దీంతో సౌతాఫ్రికాకు 103 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. జొ డెన్లీ (50) అర్ధ శతకం సాధించగా.. రబాడ మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 72/4 స్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరుకు 277/9కు ఏడు పరుగులు మాత్రమే జోడించిన దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 284 రన్స్‌కే ఆలౌటైంది.

## శ్రీకాంత్, అంజుమ్‌లకు లైఫ్‌టైమ్ అవార్డు

న్యూఢిల్లీ: బీసీసీఐ అందించే ప్రతిష్ఠాత్మక సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు టీమిండియా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్, మహిళల మాజీ సారథి అంజుమ్ చోప్రా ఎంపికయ్యారు. ఈ ఏడాదికిగాను వీరికి ఈ అవార్డులు ఇవ్వనున్నట్టు బీసీసీఐ ప్రకటించింది. వచ్చేనెల 12న ముంబైలో జరిగే వేడుకల్లో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

## అరిడేన్ డబుల్

జంషెడ్‌పూర్‌పై ఒడిశా గెలుపు

భువనేశ్వర్: అరిడేన్ శాంటానా డబుల్ గోల్స్‌తో ఒడిశా ఎఫ్‌సీ మూడో విజయాన్ని నమోదు చేసింది. ఐఎస్‌ఎల్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 2-1తో జంషెడ్‌పూర్‌పై గెలిచింది. అరిడేన్ శాంటానా (28వ, 45వ నిమిషం) రెండు గోల్స్ సాధించాడు. జంషెడ్‌పూర్ ప్లేయర్ ఐటర్ మన్రోయ్ (38వ) పెనాల్టీని గోల్‌గా మలిచాడు.



## 'తెలుగు' వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

చంద్రశేఖర్ కంబార ప్రారంభించారు. 'చివరకు మిగిలేది' నవలా రచయిత బుచ్చిబాబు సతీమణి శివరాజు సుబ్బలక్ష్మి జ్యోతిప్రకాశనం చేశారు. మహాసభల సందర్భంగా రూపొందించిన 'తెలుగు ప్రపంచం' పుస్తకాన్ని సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, 'ప్రపంచ తెలుగు' పుస్తకాన్ని శాంత బయోటిక్స్ అధినేత కె.ఐ.వరప్రసాదరెడ్డి ఆవిష్కరించారు. సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, తెలుగుభాషా సంస్కృతులపై పరిశోధనలు చేస్తున్న ఫ్రెంచ్ ఆచార్యుడు డేనియల్ నెగర్స్, కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెన్ను శ్రీనివాసరావు, అజో-విభో-కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోశ్యుల సత్యనారాయణ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. జొన్నవిత్తుల చేసిన 'చతుర్ముఖ పారాయణం' ఆకట్టుకుంది. విదేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి నుంచి మొత్తం 1,600మంది ప్రతినిధులు హాజరయ్యారు.

### తెలుగు సినిమాను కాపాడుకోవాలి: సిరివెన్నెల



'సినిమా ఎలా ఉంటుందో ప్రపంచానికి చాటిచెప్పింది తెలుగు సినిమా. అలాంటి సినిమా నేడు కేవలం మన ఉపేక్షతో పాడైపోతోంది. సినిమాకు కుల, మత భేదం ఉండదు. దానికి డబ్బుతో మాత్రమే సంబంధం ఉంటుంది. సినిమాలు చూసి మీ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పాలి. అందులో మంచి స్వీకరించాలి. చెడు ఉంటే చెప్పుతో కొట్టాలి' అని సినీగేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి ఈ మహాసభల్లో ఉద్వేగంగా ప్రసంగించారు. కాగా, 40ఏళ్ల వయసు వరకు ఫ్యాక్షన్ వైపు పడిన వంగల వెంకట కొండారెడ్డి అడుగులు చివరకు సాహిత్యం వైపు మళ్లాయి. 'గొర్లు, గుంటకాలు గోడకు ఆనుకుని గోడుగోడుమంటున్నాయి. కత్తులు, కొడవళ్లు, పలుగులు, పారలు అలిగి అటకెక్కాయి.' అంటూ ఆయన రాసిన కవిత అందరినీ ఆకట్టుకుంది.

# 'స్థానికం' ఇప్పట్లో లేనట్టే!

- అందుకే 60.15% రిజర్వేషన్లు
- సుప్రీం తీర్పుకి వ్యతిరేకంగా కేబినెట్ నిర్ణయం
- ఎవరైనా హైకోర్టుకెళ్తే 'స్టే' వచ్చే అవకాశం
- రాజధాని రగడ సహా ప్రభుత్వ వ్యతిరేకతతో ఇప్పటికిప్పుడు ఎన్నికలు వద్దనేదే సర్కారు యోచన
- జూన్ తర్వాతే మోగనున్న స్థానిక నగారా

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిపై ప్రభుత్వ నిర్ణయంతో పెరిగిన వ్యతిరేకత ఒకపక్క, సంక్షేమ పథకాల అసంపూర్ణ పంపిణీతో ఆశించిన మేరకు సానుకూలత లేకపోవడం మరోపక్క ప్రభుత్వానికి ఇబ్బందిగా పరిణమించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎలాంటి ఎన్నికలు వచ్చినా తాము ఆశించిన ఫలితం దక్కే అవకాశం లేదని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని తెలుస్తోంది. దీంతో ఎంత అవకాశం ఉంటే అంత స్థానిక సంస్థల ఎన్నికలను జాప్యం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారని సమాచారం. మొత్తంగా జనవరి-మార్చి మధ్య జరగాల్సిన స్థానిక ఎన్నికలను జూన్ తర్వాత నిర్వహించే పరిస్థితి కనిపిస్తోంది.

### రిజర్వేషన్లపై దూకుడు వెనుక

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 50శాతానికే పరిమితం చేయాలి. అయితే, దీనికి భిన్నంగా ప్రభుత్వం పాత పద్ధతిలోనే 60.15% రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించింది. అదే విషయాన్ని జనవరి 3న హైకోర్టుకు తెలపనుంది. అయితే, ఎలాగూ ఇది సుప్రీం తీర్పునకు విరుద్ధం కాబట్టి.. హైకోర్టు అభ్యంతరం తెలిపే అవకాశం ఉంటుంది. వాస్తవానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జనవరి 10 నుంచి మార్చి నెలాఖరులోపు ఎన్నికలు నిర్వహిస్తామని హైకోర్టుకు హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో జనవరి 3న ఎన్నికల షెడ్యూల్ కూడా సమర్పించాల్సి ఉంది. అయితే, రిజర్వేషన్లను 50 శాతానికి కుదించాలని కనుక హైకోర్టు ఆదేశిస్తే.. ప్రభుత్వం ఆ ఆదేశాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు యత్నిస్తోందని సమాచారం. అంటే, ముందు చెప్పినట్లు జనవరి 10న ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండదు.

### ఆరు మాసాలకు వాయిదా?

స్థానిక సంస్థల ఎన్నికలు జనవరిలో వాయిదా కనుక పడితే.. వివిధ కారణాలతో తర్వాత ఆరు మాసాల వరకు జరిగే అవకాశం లేదు. ప్రతి ఏటా జనవరిలో కొత్త ఓటరు జాబితా సిద్ధమవుతుంది. 18 ఏళ్లు నిండిన యువత పేర్లతో కొత్త ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. దీంతో ఫిబ్రవరిలో స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్లు విడుదల చేసేటట్లయితే కొత్త ఓటర్ల జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించాలన్న నిబంధనలున్నాయి. అయితే, కొత్త ఓటరు జాబితాను స్థానికసంస్థల ఓటరు జాబితాకు అనుగుణంగా మార్పు చేయాల్సి ఉంటుంది. ఈ పని చేపడితే మరో రెండు నెలల సమయం పడుతుంది. పోనీ మార్చి, ఏప్రిల్ నెలల్లో నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉందా అంటే అదీ లేదు. ఆ సమయంలో విద్యార్థులకు పరీక్షలున్నాయి. దీంతో మే నెల తర్వాతే ఎన్నికలకు అవకాశం కనిపిస్తోంది. అంటే మేలో నోటిఫికేషన్ ఇస్తే.. జూన్‌లో ఎన్నికలు నిర్వహించే చాన్స్ ఉంది.

### ఎన్నికలు జరిగితే ఎంపీటీసీ, జెడ్పీటీసీలకే!

ఎన్నికలు అనివార్యమైతే ముందు ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని కొందరు హైకోర్టును ఆశ్రయించడం, తప్పనిసరిగా ఆ ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఆదేశించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని భావించారు. అయితే కేబినెట్ సమావేశంలో మంత్రులు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు గతంలో వార్తలు వచ్చాయి. హైకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో స్థానిక సంస్థలన్నింటికీ మార్చిలోపు ఎన్నికలు పూర్తి చేస్తామని ప్రభుత్వం తెలిపింది. దీంతో ఎన్నికలు జరిగితే ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు అనుగుణంగా ప్రభుత్వం మార్గం సుగమం చేసుకుంటోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇక, ఎన్నికల కమిషన్ కూడా జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు సంబంధించి ఓటర్ల జాబితా, ఎన్నికల ప్రక్రియ కోసం ప్రభుత్వానికి లేఖలు రాసింది. దీంతో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ ఊపందుకున్నట్టు తెలిసింది.

## త్వరలో 'పంచాయతీ'

### 2011 జనాభా ప్రకారమే 'స్థానిక' కోటా!.. రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం

అమరావతి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని... 2011 జనాభా లెక్కల ప్రకారం వీటిలో రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించామని పేర్ని నాని తెలిపారు. ఎస్టీలకు 6.77శాతం, ఎస్సీలకు 19.08శాతం, బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. మచిలీపట్నం పోర్టును రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలని నిర్ణయించిందన్నారు. దీనికోసం ఎస్‌పీవీ ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. రామాయపట్నం పోర్టు నిర్మాణం విషయంలో ముందడుగు పడేలా కృష్ణపట్నం పోర్టు ముఖ పరిధిని తగ్గిస్తూ మరో తీర్మానం చేశామన్నారు. వచ్చే మార్చిలోపు 412 కొత్త 108 వాహనాలు కొనేందుకు రూ.71.48 కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. వైద్య పరీక్షల కోసం ఏర్పాటుచేసిన 104 వాహనాల కొనుగోలుకు 60.51 కోట్లు ఇస్తామన్నారు. కృష్ణాజిల్లా సూరంపల్లిలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్ ఇంజినీరింగ్ సంస్థకు భూమి కేటాయిస్తారు.



## ఐదు క్లాసులకు ముగ్గురే!

ముగ్గురు విద్యార్థులు.. ఒక ఉపాధ్యాయుడు! విజయనగరం జిల్లా భోగాపురం మండలం అమటాం రావివలసలోని ప్రభుత్వ బడిలో రెండేళ్లుగా ఇదిగో ఇదే పరిస్థితి. స్కూలులో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఈ పిల్లల్లో ఇద్దరు నాలుగో తరగతి. ఒకరు ఐదో క్లాసు. ఒకటి నుంచి మూడు దాకా ఒక్క విద్యార్థీ లేడు. నిజానికి, రెండేళ్ల క్రితందాకా ఈ ఎలిమెంటరీ స్కూలులో 20 మంది విద్యార్థులుండేవారు. సొంత భవనం లేకపోవడంతో మిగిలిన విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి పోయారు. మిగిలిన ముగ్గురు పిల్లలతోనే 'పరాయి పంచన' క్లాసులు నిర్వహిస్తున్నారు.

- భోగాపురం (విజయనగరం)



## ధాన్యానికి నిప్పుపెట్టి నిరసన

విజయనగరం జిల్లా కొమరాడలో అన్నదాతలు ఆందోళనకు దిగారు. ధాన్యం కొనేందుకు అధికారులు నిరాకరించడంతో రైతులు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దాంతో రహదారిపై ఆందోళనకు దిగి అక్కడే ధాన్యం తగులబెట్టేందుకు యత్నించారు. శుక్రవారం కొందరు రైతులు ధాన్యాన్ని విక్రయించేందుకు కొమరాడ పీఏసీఎస్ వద్దకు చేరుకున్నారు. కానీ ధాన్యం కొనుగోలు చేయడం లేదని అక్కడి సిబ్బంది బదులిచ్చారు. వాతావరణంలో మార్పులు, ఏనుగుల భయంతో కల్లాల్లో ధాన్యానికి రక్షణ లేకుండా పోతోందని.. ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేశారు. కానీ వారు పెడచెవిన పెట్టడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమైంది. దాంతో అన్నదాతలు పార్వతీపురం-రాయగడ రోడ్డుపై ఆందోళనకు దిగారు. తాము తెచ్చిన ధాన్యాన్ని నిప్పుపెట్టే ప్రయత్నం చేశారు. -కొమరాడ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

epaper.andhrajyothy.com